





# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 11 సంచిక : 291 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కాకినాడ శుక్రవారం 27 జూన్ 2025 వెల : 5/-రూ॥

VOLUME : 11 ISSUE :291 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAKINADA FRI 27 JUNE 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Kakinada, Visakhapatnam, Ongole Circulated by Srikakulam, Vizianagaram, Eluru, Vijayawada, Guntur, Nelloru, Chittur, YSR Kadapa, Kurnool, Anantapur


## ఇజ్రాయెల్‌పై విజయం సాధించాం, అమెరికాను చిత్తు చేశాం



- ఇజ్రాయెల్‌పై ఇరాన్ విజయం సాధించిందని ఖమేనీ ప్రకటన
- 'మోసపూరిత జియోనిస్ట్ పాలన'ను చిత్తు చేశామని వ్యాఖ్య
- అమెరికా జోక్యం చేసుకున్నా ఫలితం శూన్యమన్న ఇరాన్

పెన్ పవర్ డెస్క్:ఇజ్రాయెల్‌పై ఇరాన్ 'విజయం' సాధించిందని, అమెరికాను కూడా చావుదెబ్బ తీశామని ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇజ్రాయెల్‌ను నేరుగా ప్రస్తావిం చకుండా, "మోసపూరిత జియోనిస్ట్ పాలన" అంటూ సంబోధించారు. వివరాలు 2లో..

## డ్రగ్స్ తీసుకున్న నటులను ఇండస్ట్రీ నుంచి బహిష్కరించాలి

- తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుదామన్న దిల్ రాజు
- డ్రగ్స్ తీసుకున్న నటులను ఇండస్ట్రీ నుంచి బహిష్కరించాలని దిల్ రాజు ప్రతిపాదన
- యువత డ్రగ్స్‌కు అలవాటైతే దేశ భవిష్యత్తు అంధకారమేనన్న విజయ్ దేవరకొండ
- ప్రతి ఒక్కరూ సైనికుడిలా మారి డ్రగ్స్‌ను నిర్మూలించాలన్న రామ్ చరణ్

వివరాలు 2లో..



## కూటమి ప్రభుత్వానికి ఆర్థిక క్రమశిక్షణ లోపించింది

- ఏపీ ప్రభుత్వ ఆర్థిక నిర్వహణపై జగన్ ధ్వజం
- రాజ్యాంగ ఉల్లంఘనలంటూ ఆరోపణ
- ఖనిజ సంపద తాకట్టు, సంఘటిత నిధి ప్రైవేటుపరం అంటూ విమర్శలు



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణను గాలికొదిలేసి, రాజ్యాంగ నిబంధనలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తోందని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తీవ్రస్థాయిలో విమర్శించారు. ప్రభుత్వ ఆర్థిక విధానాలు, నిధుల సమీకరణ పద్ధతులపై ఆయన పలు ప్రశ్నలు సంధించారు. 2025 జూన్ 25న ఆంధ్రప్రదేశ్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎండీసీ) రెండో విడత నాన్-కన్వర్టబుల్ డిబెంచర్ల (ఎన్‌సీడీలు లేదా బాండ్లు) జారీని పూర్తి చేసిందని, 9.30 శాతం అధిక వడ్డీ (కూపన్) రేటుకు రూ. 5,526 కోట్లు సమీకరించిందని వివరాలు 2లో..

### రాజమండ్రిలో 'అఖండ గోదావరి'
## పర్యాటక ప్రాజెక్ట్ కు శంకుస్థాపన చేసిన షెకావత్, పవన్ కల్యాణ్


- రాజమండ్రిలో అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టు
- కేంద్రం రూ.375 కోట్లతో రాష్ట్రంలో చేపట్టనున్న పర్యాటక ప్రాజెక్టులు
- ప్రాజెక్టుల ఫోటో గ్యాలరీని తిలకించిన షెకావత్, పవన్
- గోదావరి రివర్ ఫ్రంట్ నుంచి ప్రాజెక్టు ప్రాంతం పరిశీలన
- హాజరైన రాష్ట్ర మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఇతర నేతలు



పెన్ పవర్ డెస్క్:రాజమండ్రిలో అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టు నిర్మాణానికి గురువారం అంకురార్పణ జరిగింది. కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమం గోదావరి తీర ప్రాంత అభివృద్ధిలో ఒక ముఖ్యమైన మైలురాయిగా భావిస్తున్నారు. శంకుస్థాపన కార్యక్రమం అనంతరం, కేంద్ర ప్రభుత్వం సమకూరుస్తున్న రూ.375 కోట్ల నిధులతో రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో చేపట్టనున్న వివిధ ప్రాజెక్టులకు సంబంధించిన ఫోటో గ్యాలరీని గజేంద్ర సింగ్ షెకావత్, పవన్ కల్యాణ్ తిలకించారు. అనంతరం, గోదావరి తీరంలోని రివర్ ఫ్రంట్ వ్యూ పాయింట్ నుంచి వివరాలు 2లో..

# డ్రగ్స్ పై యుద్ధం...
## ఎవరు అడ్డొచ్చినా తొక్కుకుంటూ పోతాం

- గంజాయి, డ్రగ్స్‌పై యుద్ధం ప్రకటిస్తున్నట్లు సీఎం చంద్రబాబు వెల్లడి
- గత ప్రభుత్వం గంజాయి కట్టడిలో విఫలమైందని విమర్శ
- 'ఈగల్' పేరుతో రాష్ట్రవ్యాప్తంగా గంజాయిపై ప్రత్యేక నిఘా
- 26 జిల్లాల్లో నార్కోటిక్స్ సెల్స్, పాఠశాలల్లో ఈగల్ క్లబ్‌ల ఏర్పాటు
- మద్యం ఆదాయంలో 2 శాతం డ్రగ్స్ నిర్మూలనకు కేటాయింపు
- గంజాయి బ్యాచ్‌కు సహకరించిన వారికి గుణపాఠం తప్పదని హెచ్చరిక



పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలో గంజాయి, మాదకద్రవ్యాల మహమ్మారిని కూకటివేళ్లతో పెకిలిస్తామని ముఖ్యమంత్రి చంద్రబా బు స్పష్టం చేశారు. వీటిపై యుద్ధం ప్రకటిస్తున్నామని, ఈ పోరాటంలో ఎవరు అడ్డువచ్చినా ఉపేక్షించేది లేదని, వారిని తొక్కుకుంటూ ముందుకెళతామని తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. గత ప్రభుత్వ హయాంలో గంజాయి నియంత్రణ పూర్తిగా గాలికొదిలేశారని, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పోరాడినందుకు టీడీపీ కార్యాలయంపై దాడులు చేశారని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. యాంటీ నార్కోటిక్స్ డే సందర్భంగా గురువారం నాడు గుంటూరులో నిర్వహించిన వాకథాన్‌లో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. అనంతరం శ్రీకన్వెన్షన్‌లో విద్యార్థులు, యువతతో జరిగిన సదస్సులో ఆయన ప్రసంగించారు. "రాబోయే రోజుల్లో రాష్ట్రంలో ముఠా కక్షలకు తావులేదు. రాయలసీమలో ఫ్యాక్షనిజాన్ని అణచివేసింది తెలుగుదేశం పార్టీయే. మతసామర స్యాన్ని కాపాడతాం, విద్వేషాలు రెచ్చగొట్టేవారిని ఉపేక్షించం. గంజాయి బ్యాచ్‌కు అండగా నిలిచిన వారికి తగిన గుణపాఠం చెబుతాం" అని సీఎం ఉద్ఘాటించారు. గంజాయి నిర్మూలన కేవలం ప్రభుత్వ బాధ్యతే కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా చర్యలు తీసుకోవాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. ఈ విషయంలో ప్రతిపక్షాలు కూడా కలిసిరావాలని కోరారు. "ప్రజలను మెప్పించి ఓట్లు వేయించుకోవాలి కానీ, తప్పుడు పనులతో రాజకీయ లబ్ధి పొందాలనుకుంటే కుదరదు. 2021లో దేశవ్యాప్తంగా పండిన మొత్తం గంజాయిలో 50 శాతం ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల నుంచే ఉత్పత్తి కావడం, దానికి విశాఖపట్నం కేంద్రంగా మారడం తీవ్ర ఆవేదన కలిగించింది" అని ఆయన అన్నారు. గంజాయికి బానిసలవడం వల్ల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాయని, యువత అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ వివరాలు 2లో..

## సీఎం చంద్రబాబును కలిసిన కేంద్రమంత్రి గజేంద్ర షెకావత్

- ఏపీలో కేంద్రమంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ పర్యటన
- రాజమండ్రిలో అఖండ గోదావరి ప్రాజెక్టుకు శంకుస్థాపన
- అనంతరం ఉండవల్లి రాక... స్వాగతం పలికిన మంత్రి నారా లోకేశ్
- సీఎం చంద్రబాబుతో పలు అంశాలు చర్చించిన షెకావత్

వివరాలు 2లో..



### మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డిపై కేసు..
## ఎంపీపీ అరెస్ట్.. వైసీపీ నేతలకు చిక్కులు!

- మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డిపై బాణసంచా ఘటనలో కేసు
- 2024 ఎన్నికల ప్రచారంలో అపశ్రుతి, వ్యక్తి కంటికి గాయం
- లోకేశ్ అనే వ్యక్తి కంటిచూపు కోల్పోయిన వైనం
- శ్రీకాంత్ రెడ్డితో పాటు 19 మంది వైసీపీ నేతలపై ఎఫ్ఐఆర్
- ఎంపీపీ సుదర్శన్ రెడ్డిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- జాతీయ మానవ హక్కుల కమిషన్ ఆదేశాలతో చర్యలు



పెన్ పవర్ డెస్క్:అన్నమయ్య జిల్లాలో వైసీపీకి చెందిన మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డితో పాటు పలువురు ఆ పార్టీ నేతలపై కేసు నమోదైంది. 2024 ఎన్నికల ప్రచార సమయంలో బాణసంచా పేల్చడం వల్ల ఓ వ్యక్తి కంటిచూపు కోల్పోయిన ఘటనకు సంబంధించి ఈ కేసు నమోదు కాగా, ఓ నేతను పోలీసులు అదుపులోకి కూడా తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే... 2024 సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా వైసీపీ కార్యకర్తలు లక్కిరెడ్డిపల్లి మండలం అగ్రహారంలో భారీగా బాణసంచా కాల్చారు. ఈ క్రమంలో జరిగిన అపశ్రుతిలో లోకేశ్ అనే వివరాలు 2లో..

### ఆరేళ్లుగా పోటీ చేయని రాజకీయ పార్టీలు...
## ఎన్నికల సంఘం కీలక నిర్ణయం!

- ఎన్నికల్లో పోటీ చేయని పార్టీలపై ఎన్నికల సంఘం చర్యలు
- ఆరేళ్లుగా యాక్టివ్‌గా లేని 345 పార్టీల డీలిస్టింగ్ ప్రాసెస్ షురూ
- సంబంధిత పార్టీలకు కార్యాలయాలు కూడా లేవని గుర్తింపు
- దేశవ్యాప్తంగా 2,800కు పైగా గుర్తింపు లేని నమోదిత పార్టీలు
- వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన పార్టీలపై వేటు

పెన్ పవర్ డెస్క్:దేశంలో రాజకీయ పార్టీగా నమోదు చేసుకుని, ఆరేళ్లుగా ఎటువంటి ఎన్నికల్లోనూ పోటీ చేయకుండా నిష్క్రియంగా ఉన్న పార్టీలపై కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) దృష్టి సారించింది. 2019 నుంచి ఇప్పటివరకు ఒక్క ఎన్నికలో కూడా పాల్గొనని 345 వివరాలు 2లో..




## క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ అభిప్రాయం తెలపండి

- రేషన్ డిపోల వద్ద క్యూఆర్ కోడ్ పోస్టర్ల ఏర్పాటు
- స్కాన్ చేసి సరుకులు, డీలర్లపై ఫీడ్‌బ్యాక్ ఇవ్వొచ్చు
- 65 ఏళ్లు పైబడినవారు, దివ్యాంగులకు ఇంటికే రేషన్ సౌకర్యం
- ఈనెల 26 నుంచే జులై నెల సరుకుల పంపిణీ ప్రారంభం
- నూతన విధానాలు వెల్లడించిన మంత్రి నాదెండ్ల మనోహర్

పెన్ పవర్ డెస్క్:రాష్ట్ర ప్రజలకు మరింత మెరుగైన, పారదర్శకమైన సేవలు అందిం చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల మరి యు వినియోగదా రుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల వివరాలు 2లో..



## భారత్‌పై చైనా ఎత్తుగడ! బీజింగ్ నుంచి ఆగిపోయిన స్పెషాలిటీ ఫెర్టిలైజర్స్ సరఫరా



- భారత్‌కు చైనా నుంచి ప్రత్యేక ఎరువుల సరఫరా రెండు నెలలుగా నిలిపివేత
- ఇతర దేశాలకు మాత్రం చైనా ఎగుమతులు యథాతథం
- పంటల దిగుబడి పెంచడంలో ఈ ఎరువులు చాలా ముఖ్యం
- అధికారిక నిషేధం లేకుండానే తనిఖీల పేరుతో చైనా ఎత్తుగడ
- భారత్ వాడే ప్రత్యేక ఎరువుల్లో 80 శాతం చైనా నుంచే దిగుమతి
- ప్రత్యామ్నాయాల కోసం పశ్చిమాసియా, ఐరోపా వైపు భారత్ చూపు

పెన్ పవర్ డెస్క్:గత రెండు నెలలుగా చైనా నుంచి భారత్‌కు ప్రత్యేక ఎరువుల (స్పెషాలిటీ ఫెర్టిలైజర్స్) ఎగుమతులు పూర్తిగా నిలిచిపోయాయి. అయితే, బీజింగ్ ఇతర దేశాలకు మాత్రం ఈ ఎరువులను యథావిధిగా సరఫరా చేస్తుండటం గమనార్హం. పండ్లు, కూరగాయలు వంటి వాణిజ్య పంటలతో పాటు ఇతర పంటల్లో దిగుబడిని గణనీయంగా పెంచడంలో ఈ ప్రత్యేక ఎరువులు కీలక పాత్ర పోషిస్తాయి. ఈ పరిణామం భారతీయ వ్యవసాయ రంగంపై ప్రభావం చూపే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది. వివరాలు 2లో..

## డాకింగ్ విజయవంతం...
### అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో అడుగుపెట్టిన శుభాంశు శుక్లా



- యాక్సియం-4 మిషన్ ద్వారా అంతరిక్షంలోకి భారత వ్యోమగామి
- శుభాంశు శుక్లా సహా నలుగురు వ్యోమగాములు ఐఎస్ఎస్‌లో ప్రవేశం
- అమెరికా కెన్నడీ స్పేస్ సెంటర్ నుంచి ఫాల్కన్-9 రాకెట్ ద్వారా ప్రయోగం
- గురువారం సాయంత్రం విజయవంతంగా స్పేస్‌క్రాఫ్ట్ డాకింగ్
- అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో 14 రోజుల పాటు పరిశోధనలు

పెన్ పవర్ డెస్క్:అంతరిక్ష పరిశోధన రంగంలో భారత్ మరో కీలక విజయాన్ని అందుకుంది. యాక్సియం-4 మిషన్ లో భాగంగా భారత వ్యోమగామి శుభాంశు శుక్లా, మరో ముగ్గురు అంతర్జాతీయ వ్యోమగాములతో కలిసి అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# క్రమ"శిక్ష"ణ ఎక్కడ?

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్రమంగా పార్టీపైన పట్టుబిగించే ప్రయత్నం చేస్తున్నారు. కాంగ్రెస్ కు ఎవరూ శత్రువులుండరు. ఆ పార్టీ నేతలే. ఇది ఇప్పుడు మొదలయింది కాదు. దేశంలో ఏ రాష్ట్రంలో అధికారంలో ఉన్నా లేకపోయినా పైకి పార్టీ లేచే కొద్దీ కిందకు లాగే వాళ్లు ఎక్కువ మంది ఉంటారు. అందుకే చాలా మంది చాలా రాష్ట్రాల్లో ముఖ్యమంత్రులు ప్రత్యర్థి పార్టీల నేతల కంటే సొంత పార్టీ నేతలకే ఎక్కువ భయపడుతుంటారు. అందుకు కారణం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది తమ కారణంగానే నని భావించి తనకు సరైన ప్రాధాన్యత ఇవ్వాలని కోరుకుంటారు. ఎమ్మెల్యే టిక్కెట్ రాకపోతే.. ఎమ్మెల్సీని అడుగుతారు. అదిఇస్తే మంత్రి పదవి సంగతేంటని ప్రశ్నిస్తారు.

**అన్నీ గాంధీ భవన్ నుంచి డిమాండ్లే...**

కుటుంబంలో ఒకరికి టిక్కెట్ ఇచ్చి మంత్రిపదవిని ఇచ్చినా మిగిలిన కుటుంబ సభ్యుల మాటేంటని నిలదీస్తారు. ఇక ఎప్పుడూ ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయని వారు, వారి వల్ల ఒక్క ఓటు కూడా కాంగ్రెస్ గుర్తుపై వేయించలేని వారు సయితం తమకు పదవులకు కావాలని కోరతారు. కోరడమే కాదు గాంధీభవన్ లో కూర్చుని మరీ డిమాండ్ చేస్తారు. ఏకంగా మీడియా సమావేశం పెట్టి సొంత పార్టీ పైన, ప్రభుత్వంపైన విమర్శలు చేయడానికి కూడా వెనుకాడరు. అయితే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో వైఎస్ పాదయాత్రతో కాంగ్రెస్ సుదీర్ఘకాలం తర్వాత అధికారంలోకి వచ్చినా ఆ విజయం తమవల్లనేనంటూ డప్పాలుకొట్టుకున్న వారు అనేక మంది. వైఎస్ రాజశేఖర్ రెడ్డికి కూడా అసంతృప్తుల బెడద 2004 ముందు నుంచి ఆయన మరణించేంత వరకూ తప్పలేదు.

**పార్టీపై దృష్టిపెట్టాలనకుంటున్నా....**

ఇక రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పాటయి రెండేళ్లు కావస్తుండటంతో ఇప్పటి వరకూ పార్టీ విషయాలను పెద్దగా పట్టించుకోలేదు. ఆయన ఎక్కువగా పాలనపైనే ఫోకస్ పెట్టారు. మంత్రి వర్గ విస్తరణ కూడా పూర్తి కావడంతో పాటు స్థానికసంస్థల ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ కాంగ్రెస్ పార్టీని గాడిలో పెట్టాల్సిన అవసరం ఏర్పడింది. నియోజకవర్గ స్థాయి నేతలు కూడా మీసాలు మెలేస్తుండటం, సీనియర్ నేతలపైనా, మంత్రులపైనా విమర్శలు చేస్తుండటంతో రేవంత్ రెడ్డి పార్టీ అధినాయకత్వంతో మట్లాడి క్రమశిక్షణ కమిటిని నియమించుకున్నారు.క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ గా ఉన్న వారు సయితం తమ ఇలాకాలో సొంత పార్టీ నేతలను విమర్శలు చేయడం కొంత ఇబ్బందిగా మారింది. పీసీసీ అధ్యక్షుడి హెూదాలో మహేష్ కుమార్ గౌడ్ చేస్తున్న హెచ్చరికలు పెద్దగా పనిచేయడంలేదు.

**నాడు జగ్గయ్యపేటలో వైఎస్...**

కాంగ్రెస్ లో క్రమశిక్షణ కమిటీ అనేది ఒక బ్రహ్మపదార్థం. 1999లో ఒక ఇన్సిడెంట్ గురించి మాట్లాడుకుందాం. అప్పుడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి పీసీసీ ప్రెసిడెంట్. కృష్ణా జిల్లా పర్యటనకు రోడ్డు మార్గాన బయలుదేరి వచ్చారు. జగ్గయ్య పేట అడ్డరోడ్డువద్ద సామినేని ఉదయభాను అనుచరులు మరొక కాంగ్రెస్ నేతను చితక బాదారు. ఆ నేత వైఎస్ కారులో ఉన్నా సరే కారు అద్దాలు బద్దలు కొట్టి బయటకు లాగి కొట్టారు. వెంటనే నందిగామలోని వసంత నాగేశ్వరరావు ఇంట్లో మీడియా సమావేశం పెట్టిన వైఎస్ సామినేని ఉదయభానును ఆరేళ్ల పాటు పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. కానీ ఆరు నెలలకు తిరక్కముందే జరిగిన ఎన్నికల్లో ఉదయ భానుకు టిక్కెట్ వచ్చింది. 1999లో ఎమ్మెల్యేగా కాంగ్రెస్ నుంచి గెలిచారు.

**ఇప్పుడు మల్లురవి నేతృత్వంలో...**

అట్లుంటుది కాంగ్రెస్ పార్టీ యవ్వారం. ఇప్పుడు రేవంత్ రెడ్డి కూడా క్రమశిక్షణ కమిటీని ఏర్పాటు చేశారు. తనకు బాగా సన్నిహితుడైన నాగర్ కర్నూలు ఎంపీ మల్లురవిని క్రమశిక్షణ సంఘం ఛైర్మన్ గా నియమించారు. ఈ కమిటీ బెదిరింపులకు కాంగ్రెస్ నేతలు తలొగ్గుతారా? తోకముడుస్తారా? అంటే నవ్వడం మినహా మరొక సమాధానం రాదు. కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ అంటే కోరలు లేని పాము వంటిదని కార్యకర్తల నుంచి నేతల వరకూ అందరికీ తెలుసు. అందుకే ఇప్పుడు ఏర్పడిన క్రమశిక్షణ కమిటీ పార్టీ నేతలపై చర్యలు తీసుకుంటారని భావించడం అత్యాశే అవుతుంది. కొండా మురళిపైనో, మరొకరిపైనో వేటు వేసే ధైర్యం కాదు..కాదు... నిర్ణయం తీసుకునే హక్కు ఈ కమిటీకి లేదనే చెప్పాలి. అందుకే హస్తం పార్టీ అలా ఎప్పుడూ వెలిగిపోతుంది.

## కూటమి ప్రభుత్వానికి ఆర్థిక క్రమశిక్షణ లోపించింది

- మొదటి పేజీ తరువాయి

జగన్ తెలిపారు. దీంతో మొత్తం బాండ్ల విలువ రూ. 9,000 కోట్లకు చేరిందని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై ఏపీ హైకోర్టులో కేసు విచారణలో ఉందని, నోటీసులు కూడా జారీ అయ్యాయని గుర్తుచేశారు. ఈ బాండ్ల ద్వారా సమీకరించిన నిధులను ప్రభుత్వ రెవెన్యూ వ్యయాల కోసం వినియోగిస్తున్నారని స్పష్టమవుతోందని ఆయన ఆరోపించారు.రాజ్యాంగ నిబంధనలను పూర్తిగా విస్మరించి, అపూర్వమైన రీతిలో టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రైవేటు పార్టీలకు రాష్ట్ర సంఘటిత నిధిని వినియోగించుకునేందుకు అవకాశం కల్పించిందని జగన్ దుయ్యబట్టారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ద్వారా డైరెక్ట్ డెబిట్ ఆదేశాలు జారీ చేసి, రాష్ట్ర ప్రభుత్వ అధికారుల ప్రమేయం లేకుండానే ప్రైవేటు వ్యక్తులు రాష్ట్ర ఖజానా నుంచి నిధులు విత్‌డ్రా చేసుకునే వెసులుబాటు కల్పించారని తెలిపారు. ఇది భారత రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 203, 204, 293(1) లను పూర్తిగా ఉల్లంఘించడమేనని ఆయన అన్నారు.ఎన్‌సీడీ బాండ్లకు అదనపు హామీగా, గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం రూ. 1,91,000 కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తి అయిన ఖనిజ సంపదను కేవలం రూ. 9,000 కోట్ల బాండ్ల కోసం తాకట్టు పెట్టిందని జగన్ విమర్శించారు. రాష్ట్ర సంఘటిత నిధికి ఇలా ప్రైవేటు వ్యక్తులకు అనుమతి ఇవ్వడం, ఇంత భారీ మొత్తంలో ప్రభుత్వ ఆస్తులను తాకట్టు పెట్టడం చూస్తుంటే, ఈ బాండ్లు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసే రాష్ట్ర అభివృద్ధి రుణాల (ఎస్‌డీఎల్) కంటే ఎక్కువ సురక్షితమైనవిగా భావించాలా? అని వ్యాఖ్యానించారు.అయినప్పటికీ, ఏపీఎండీసీ బాండ్లను 9.30 శాతం అధిక వడ్డీ రేటుకు జారీ చేశారని, ఇది ప్రస్తుతం రాష్ట్ర అభివృద్ధి రుణాలపై ఉన్న వడ్డీ రేటు కంటే 2.60 శాతం ఎక్కువని జగన్ తెలిపారు. ఈ అధిక వడ్డీ రేటు కారణంగా ఏపీఎండీసీపై ఏటా అదనంగా రూ. 235 కోట్ల భారం పడుతుందని, ఈ బాండ్ల కాలపరిమితి పదేళ్లుగా ఉందని తెలిసిందని అన్నారు. ఈ అదనపు భారం వల్ల లబ్ధి పొందింది ఎవరో ముఖ్యమంత్రి చంద్రబాబు సమాధానం చెప్పాలని జగన్ డిమాండ్ చేశారు.ఈ ఎన్‌సీడీల జారీతో, టీడీపీ కూటమి ప్రభుత్వం ఈ 13 నెలల కాలంలో సమీకరించిన బడ్జెట్, ఆఫ్-బడ్జెట్ రుణాలు, గత ప్రభుత్వం ఐదేళ్లలో తీసుకున్న రుణాల్లో 50 శాతానికి పైగా ఉన్నాయని జగన్ ఆరోపించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై, ప్రభుత్వ రుణాలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ, పారదర్శకత పాటించాలని ఆయన డిమాండ్ చేశారు.

## క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ అభిప్రాయం తెలపండి

- మొదటి పేజీ తరువాయి

మనోహర్ స్పష్టం చేశారు. రేషన్ పంపిణీ వ్యవస్థలో పలు కీలక సంస్కరణలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా వినియోగదారుల అభిప్రాయాలు, ఫిర్యాదులను నేరుగా స్వీకరించేందుకు వీలుగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని రేషన్ డిపోల వద్ద క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఏర్పాటు చేసినట్లు మంత్రి వెల్లడించారు.

**క్యూఆర్ కోడ్‌తో నేరుగా మీ స్పందన**

రేషన్ కార్డుదారులు తమ స్మార్ట్‌ఫోన్లతో ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా ఒక వెబ్ ఫారమ్‌లోకి ప్రవేశిస్తారని మంత్రి నాదెండ్ల వివరించారు. ఈ ఫారమ్‌లో ఆ నెల రేషన్ సరుకులు అందుకున్నారా? లేదా? సరుకుల నాణ్యత ఎలా ఉంది? తూకంలో ఏమైనా తేడాలున్నాయా? రేషన్ డీలర్ ప్రవర్తన, ఏవైనా అధిక ధరలు వసూలు చేశారా? వంటి ప్రశ్నలకు "అవును" లేదా "కాదు" అనే సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. పౌరులు నమోదు చేసే ఈ వివరాలు, అభిప్రాయాలు నేరుగా ఉన్నతాధికారులకు చేరుతాయని, దీనివల్ల సమస్యలున్న చోట తక్షణమే చర్యలు తీసుకునేందుకు వీలు కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యం ద్వారానే పౌర సేవలను మరింత మెరుగుపరచాలన్నది మా ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా మంత్రి వెల్లడించారు.

**వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక సౌకర్యం**

మరో కీలక నిర్ణయంగా 65 ఏళ్లకు పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దకే రేషన్ సరుకులు పంపిణీ చేసే కార్యక్రమాన్ని ఇవాళ్టి నుంచే ప్రారంభించినట్లు మంత్రి నాదెండ్ల తెలిపారు. వీరికి ఐదు రోజుల ముందుగానే రేషన్ అందజేయనున్నట్లు చెప్పారు. అంతేకాకుండా జులై నెలకు సంబంధించిన రేషన్ సరుకుల పంపిణీని కూడా నేటి నుంచే రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభిస్తున్నట్లు ఆయన వివరించారు.

# ఇజ్రాయెల్‌పై విజయం సాధించాం, అమెరికాను చిత్తు చేశాం

- మొదటి పేజీ తరువాయి

ఈ మేరకు ఆయన అధికారిక 'ఎక్స్' ఖాతా ద్వారా స్పందించారు. "ఎంత గందరగోళం సృష్టించినా, ఎన్ని ప్రకటనలు చేసినా, జియోనిస్ట్ పాలన ఆచరణాత్మకంగా ఇస్లామిక్ రిపబ్లిక్ దెబ్బలకు చిత్తయి, నలిగిపోయింది" అని ఖమేనీ ఒక పోస్టులో పేర్కొన్నారు. దేశ ప్రజలకు ఈ 'విజయం' పట్ల అభినందనలు అంటూ పోస్టు చేశారు.ఆ వెంటనే అమెరికాను లక్ష్యంగా చేసుకుని మరో పోస్ట్ చేశారు. "మన ప్రియమైన ఇరాన్ అమెరికా ప్రభుత్వంపై సాధించిన విజయానికి నా అభినందనలు. జియోనిస్ట్ పాలన పూర్తిగా నాశనమవుతుందని భావించిన అమెరికా ప్రభుత్వం, దానిని కాపాడేందుకే నేరుగా యుద్ధంలోకి దిగింది. కానీ ఏమీ సాధించలేకపోయింది" అని ఖమేనీ అన్నారు.గల్ఫ్‌లో మోహరించిన అమెరికా దళాలపై ఇరాన్ ప్రతీకార దాడిని కూడా ఖమేనీ ప్రస్తావించారు. "ఇస్లామిక్ రిపబ్లిక్ అమెరికా చెంప చెళ్లుమనిపించింది. ఈ ప్రాంతంలోని కీలకమైన అమెరికా స్థావరాల్లో ఒకటైన అల్-ఉదీద్ వైమానిక స్థావరంపై దాడి చేసి నష్టం కలిగించింది" అని ఆయన తెలిపారు. ఈ ప్రాంతంలోని అమెరికా ఆస్తులపై ఇరాన్ ఎప్పుడైనా దాడి చేయగల సత్తా కలిగి ఉందని ఖమేనీ మరో పోస్టులో హెచ్చరించారు. "ఈ ప్రాంతంలోని కీలకమైన అమెరికా కేంద్రాలను ఇస్లామిక్ రిపబ్లిక్ చేరుకోగలగడం, అవసరమని భావించినప్పుడల్లా చర్యలు తీసుకోగలగడం ఒక ముఖ్యమైన విషయం. భవిష్యత్తులో కూడా ఇలాంటి చర్య పునరావృతం కావచ్చు. ఏదైనా దురాక్రమణ జరిగితే, శత్రువు కచ్చితంగా భారీ మూల్యం చెల్లించుకోవలసి ఉంటుంది" అని ఆయన స్పష్టం చేశారు.

# డ్రగ్స్ తీసుకున్న నటులను ఇండస్ట్రీ నుంచి బహిష్కరించాలి

**పెన్ పవర్ డెస్క్:** తెలంగాణను మాదకద్రవ్యాల మహమ్మారి నుంచి కాపాడేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని, ఈ విషయంలో సినీ పరిశ్రమ కూడా కీలక పాత్ర పోషిస్తుందని ఎఫ్‌డీసీ ఛైర్మన్, ప్రముఖ నిర్మాత దిల్ రాజు అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయనతో పాటు నటులు విజయ్ దేవరకొండ, రామ్ చరణ్ పాల్గొని డ్రగ్స్‌పై తమ గళం విప్పారు. డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ, యువతకు దిశానిర్దేశం చేశారు.దిల్ రాజు మాట్లాడుతూ, మలయాళ చిత్ర పరిశ్రమలో డ్రగ్స్ తీసుకున్న వారిని బహిష్కరించే నిర్ణయం తీసుకున్నారని గుర్తు చేశారు. "అక్కడ ఎవరైనా డ్రగ్స్ తీసుకున్నట్లు తేలితే, వారిని పరిశ్రమ నుంచి బహిష్కరిస్తారు. తెలంగాణ ఎఫ్‌డీసీ తరపున తెలుగు చిత్ర పరిశ్రమ తరపున నేను కోరేది ఒక్కటే. మన దగ్గర కూడా అలాంటి సంఘటనలు జరిగితే సంబంధిత వ్యక్తులను ఇండస్ట్రీలో అడుగు పెట్టకుండా నిషేధించాలి. అప్పుడే సమాజానికి బలమైన సందేశం వెళుతుంది" అని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయాన్ని చిత్ర పరిశ్రమ పెద్దలతో చర్చించి, తెలుగు సినిమాల్లో కూడా ఈ నిబంధన పాటించేలా చర్యలు తీసుకుంటామని, ఇది మనందరి కర్తవ్యమని దిల్ రాజు పేర్కొన్నారు. డ్రగ్స్ లేని రాష్ట్రంగా తెలంగాణను మార్చేందుకు అంతా ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిచ్చారు.నటుడు విజయ్ దేవరకొండ మాట్లాడుతూ, తాను సాధారణంగా బయటి ప్రపంచానికి దూరంగా ఉంటానని, అయితే యాంటీ డ్రగ్ క్యాంపెయిన్ ప్రాముఖ్యతను పోలీస్ అధికారులు వివరించిన తర్వాత దీనిపై మాట్లాడటం బాధ్యతగా భావిస్తున్నానని తెలిపారు. "ఒక దేశాన్ని నాశనం చేయాలంటే యుద్ధం చేయాల్సిన అవసరం లేదు. ఆ దేశ యువతకు డ్రగ్స్ అలవాటు చేస్తే సరిపోతుంది. కొన్ని దేశాలు మన యువతకు మత్తు పదార్థాలు అలవాటు చేసి, దేశ భవిష్యత్తును దెబ్బతీయాలని చూస్తున్నాయి" అని ఆవేదన వ్యక్తం చేశారు.డ్రగ్స్ జీవితాలను నాశనం చేస్తాయని, ఒక్కసారి వాటికి బానిసైతే కోలుకోవడం చాలా కష్టమని హెచ్చరించారు. స్నేహితులు డ్రగ్స్ అలవాటు చేస్తే వారికి దూరంగా ఉండాలని, అందరూ ఆరోగ్యంగా ఉంటూ, వ్యాయామం చేస్తూ, తల్లిదండ్రులకు గౌరవం తెచ్చే పనులు చేయాలని సూచించారు. విజయం, డబ్బు, గౌరవం లేని పనులు చేయడం అనవసరమని ఆయన అన్నారు.అనంతరం నటుడు రామ్ చరణ్ మాట్లాడుతూ, తన చిన్నతనంలో పాఠశాల తరపున ఇలాంటి అవగాహన కార్యక్రమాలకు వెళ్లేవాడినని గుర్తు చేసుకున్నారు. "ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ప్రభుత్వానికి నా కృతజ్ఞతలు. గతంలో కొన్ని పాఠశాలల బయట డ్రగ్స్ అమ్ముతున్నారని తెలిసి చాలా బాధపడ్డాను. అప్పుడు నేను తండ్రిని కాదు, కానీ ఇప్పుడు నేనొక తండ్రిని" అని ఆయన అన్నారు.ఒక మంచి సినిమా చేసినప్పుడు, పరీక్షల్లో మంచి మార్కులు వచ్చినప్పుడు, స్నేహితులతో ఆడుకున్నప్పుడు కలిగే ఆనందం గొప్పదని, రోజూ వ్యాయామం చేస్తూ నచ్చిన పని చేసుకుంటూ కుటుంబంతో సంతోషంగా ఉండాలని యువతకు సూచించారు. '

'మన కుటుంబంతో మొదలుపెట్టి, పాఠశాల, సమాజాన్ని బాగు చేసుకుందాం. ఈ విషయంలో పోలీసు శాఖ చేస్తున్న కృషి అభినందనీయం. ప్రతి ఒక్కరూ ఒక్కో సైనికుడిలా మారి డ్రగ్స్‌ను నిర్మూలిద్దాం" అని రామ్ చరణ్ పిలుపునిచ్చారు.

# డ్రగ్స్ పై యుద్ధం...

- మొదటి పేజీ తరువాయి

విలువైన జీవితాలను నాశనం చేసుకుంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్నిచోట్ల మెడికల్ షాపుల్లో కూడా మత్తుపదార్థాలు అమ్ముతున్నారన్న సమాచారం ఉందని తెలిపారు. "గంజాయిపై రాష్ట్రవ్యాప్తంగా 'ఈగల్' పేరుతో డేగ కన్ను వేసి ఉంచుతాం. ఇప్పటికైనా మారకపోతే అలాంటి వారు రాష్ట్రంలో ఉండేందుకే అనర్హులు. ఎవరైనా ఆడబిడ్డల జోలికి వస్తే, అదే వారికి చివరి రోజు అవుతుంది" అని తీవ్రంగా హెచ్చరించారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరిస్తూ, "రాష్ట్రంలోని 26 జిల్లాల్లో నార్కోటిక్స్ సెల్స్ ఏర్పాటు చేశాం. పాఠశాలల్లో ఈగల్ క్లబ్‌లు నెలకొల్పాం. ఎక్కడైనా ఇబ్బంది ఉంటే '1972' నంబర్‌కు మెసేజ్ పంపితే తక్షణమే రక్షణ చర్యలు తీసుకుంటాం. మద్యం ద్వారా వచ్చే ఆదాయంలో 2 శాతాన్ని డ్రగ్స్ నిర్మూలన కార్యక్రమాలకు కేటాయిస్తాం. రాష్ట్రంలోని మూడు ప్రాంతాల్లో 56 డీ-అడిక్షన్ కేంద్రాలను ఏర్పాటు చేస్తాం" అని చంద్రబాబు ప్రకటించారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా విస్తృత ప్రచారం నిర్వహించేందుకు సినీనటులు కూడా ముందుకు రావాలని, ప్రజా చైతన్యం కోసం కృషి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర హెూంమంత్రి వంగలపూడి అనిత, పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఆరేళ్లుగా పోటీ చేయని రాజకీయ పార్టీలు... ఎన్నికల సంఘం కీలక నిర్ణయం!

- మొదటి పేజీ తరువాయి

గుర్తింపు లేని నమోదిత రాజకీయ పార్టీలను (రిజిస్టర్డ్ అన్‌రికగ్నైజ్డ్ పొలిటికల్ పార్టీస్ - ఆర్‌యూపీపీ) గుర్తించి, వాటిని డీలిస్ట్ చేసే ప్రక్రియను ప్రారంభించినట్లు ఎన్నికల సంఘం వర్గాలు తెలిపాయి. వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన ఈ పార్టీలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని, క్షేత్రస్థాయిలో వాటి కార్యాలయాలు కూడా ఉనికిలో లేవని ఎన్నికల సంఘం తన పరిశీలనలో గుర్తించింది. ఈ నేపథ్యంలోనే సదరు పార్టీలను జాబితా నుంచి తొలగించేందుకు ఈసీ నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా ఎన్నికల సంఘం వద్ద సుమారు 2,800కు పైగా గుర్తింపు లేని నమోదిత రాజకీయ పార్టీలు ఉన్నాయి.సాధారణంగా, ఒక రాజకీయ పార్టీ ఎన్నికల సంఘం నుంచి అధికారిక గుర్తింపు పొందాలంటే, జరిగిన సాధారణ ఎన్నికల్లో పోలైన మొత్తం ఓట్లలో కనీసం ఆరు శాతం ఓట్లు సాధించాలి లేదా నిర్దిష్ట సంఖ్యలో అసెంబ్లీ లేదా లోక్‌సభ సీట్లను గెలుచుకోవాల్సి ఉంటుంది. ఈ ప్రమాణాలను అందుకోలేని పార్టీలను కేవలం నమోదిత గుర్తింపు లేని పార్టీలుగానే పరిగణిస్తారు. ఇటువంటి పార్టీలు సుదీర్ఘకాలం పాటు ఎటువంటి ఎన్నికల కార్యకలాపాల్లో పాల్గొనకపోవడం, కనీసం పార్టీ కార్యాలయాలను కూడా నిర్వహించకపోవడం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఎన్నికల సంఘం ఈ ప్రక్షాళన చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది.

## భారత్‌పై చైనా ఎత్తుగడ! బీజింగ్ నుంచి ఆగిపోయిన స్పెషాలిటీ ఫెర్టిలైజర్స్ సరఫరా

- మొదటి పేజీ తరువాయి

ఈ రకం ఎరువులను ఎగుమతి చేయాలంటే సంబంధిత ఫ్యాక్టరీల నుంచి వచ్చే షిప్‌మెంట్లను చైనా అధికారులు తనిఖీ చేయాల్సి ఉంటుంది. అయితే, భారత్‌కు రావాల్సిన షిప్‌మెంట్లను మాత్రం అధికారులు తనిఖీ చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని తెలుస్తోంది. దీని ద్వారా, అధికారికంగా ఎలాంటి నిషేధం విధించకుండానే ఎగుమతులను అడ్డుకోవడానికి చైనా ఈ మార్గాన్ని ఎంచుకున్నట్లు సమాచారం.మొక్కలు, చెట్లకు భూమి, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా అవసరమైన పోషకాలను అందించి, అధిక ఫలసాయం సాధించడానికి ఈ ప్రత్యేక ఎరువులను ఉపయోగిస్తారు. వీటిలో అనేక రకాలు అందుబాటులో ఉన్నాయి. భారత్‌లో ఈ తరహా ఎరువులను పెద్ద మొత్తంలో తయారు చేసుకునే సామర్థ్యం ప్రస్తుతం పరిమితంగానే ఉంది. కొన్ని సంస్థలు చిన్న మొత్తాల్లో స్థానికంగా ఉత్పత్తి చేస్తున్నప్పటికీ, ఆర్థికంగా అవి అంత లాభదాయకంగా లేవు. మన దేశం వినియోగించే ప్రత్యేక ఎరువుల్లో దాదాపు 80 శాతం చైనా నుంచే దిగుమతి అవుతున్నాయి.గత నాలుగైదేళ్లుగా చైనా ఈ సరఫరాలను నియంత్రిస్తూ వస్తోందని, ఈసారి మాత్రం పూర్తిగా నిలిపివేయడం ఆందోళనకరమని సోలబుల్ ఫర్టిలైజర్స్ ఇండస్ట్రీ అసోసియేషన్ ప్రెసిడెంట్ రాజిబ్ చక్రబర్తి తెలిపారు. సాధారణంగా జూన్ నుంచి డిసెంబర్ మధ్య కాలంలో భారత్ సుమారు 1,50,000 నుంచి 1,60,000 టన్నుల ప్రత్యేక ఎరువులను దిగుమతి చేసుకుంటుందని గణాంకాలు చెబుతున్నాయి.భూసారాన్ని కాపాడుతూ, పంట దిగుబడిని పెంచడానికి రైతులు వీటిని ఎక్కువగా వినియోగిస్తారు. దేశీయంగా ఈ రంగంలో దీపక్ ఫర్టిలైజర్స్, ప్రదీప్ ఫర్టిలైజర్స్, నాగార్జున ఫర్టిలైజర్స్ వంటి కంపెనీలు ప్రధానంగా వ్యాపారం చేస్తున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో భారత్ ఈ ఎరువుల కోసం పశ్చిమాసియా, ఐరోపా దేశాల్లోని ఉత్పత్తిదారుల వైపు చూడాల్సిన అవసరం ఏర్పడింది.గత ఐదేళ్లుగా భారత్-చైనా మధ్య నెలకొన్న దౌత్యపరమైన విభేదాలు, అలాగే పాకిస్థాన్‌తో చైనా సంబంధాలు బలపడటం వంటి అంశాలు ఈ పరిణామాలకు కారణంగా భావిస్తున్నారు. ఇప్పటికే చైనా రేర్ ఎర్త్ మాగ్నెటిక్స్ వంటి కీలక ముడిసరుకుల ఎగుమతులపై ఆంక్షలు విధించింది. తాజా పరిణామం ఇరు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలపై మరింత ప్రభావం చూపే అవకాశం ఉంది.

## రాజమండ్రిలో 'అఖండ గోదావరి' పర్యాటక ప్రాజెక్ట్ కు శంకుస్థాపన చేసిన షెకావత్, పవన్ కల్యాణ్

- మొదటి పేజీ తరువాయి

అఖండ గోదావరి ప్రాజెక్టును నిర్మించ తలపెట్టిన ప్రాంతాన్ని వారు పరిశీలించారు. ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను అధికారులు వారికి వివరించారు. ఈ ప్రాజెక్టు ద్వారా స్థానికంగా పర్యాటకం గణనీయంగా వృద్ధి చెందుతుందని, ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు కందుల దుర్గేష్, నిమ్మల రామానాయుడు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి పాల్గొన్నారు. వీరితో పాటు కూటమి ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఆదిరెడ్డి వాసు, గిడ్డి సత్యనారాయణ, మద్దిపాటి వెంకటరాజు, చిర్రి బాలరాజు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు కూడా హాజరయ్యారు.అలాగే, టూరిజం కార్పొరేషన్ ఛైర్మన్ నూకసాని బాలాజీ, రాజమండ్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (రుడా) ఛైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి, జిల్లా కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ (డీసీసీబీ) ఛైర్మన్ తుమ్మల రామస్వామి, జిల్లా కలెక్టర్ తో పాటు ఇతర జిల్లా అధికారులు, పర్యాటక శాఖ ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు.

## మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డిపై కేసు.. ఎంపీపీ అరెస్ట్.. వైసీపీ నేతలకు చిక్కులు!

- మొదటి పేజీ తరువాయి

వ్యక్తి తీవ్రంగా గాయపడి, ఒక కన్నును కోల్పోయారు. ఈ ఘటనపై బాధితులు జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ)ను ఆశ్రయించారు.ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఆదేశాల మేరకు లక్కిరెడ్డిపల్లి పోలీసులు రంగంలోకి దిగి, బాధ్యులపై చర్యలు చేపట్టారు. ఈ ఘటనకు సంబంధించి మొత్తం 19 మంది వైసీపీ నేతలపై కేసు నమోదు చేశారు. నిందితుల జాబితాలో మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, గడికోట రమేశ్‌రెడ్డి, ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.ఈరోజు ఉదయం ఎంపీపీ సుదర్శన్‌రెడ్డిని లక్కిరెడ్డిపల్లి ఇన్‌ఛార్జ్ సీఐ వరప్రసాద్ నేతృత్వంలోని పోలీసు బృందం అదుపులోకి తీసుకుంది. ఈ కేసులో మిగిలిన నిందితులపైనా చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఎన్నికల సమయంలో జరిగిన ఈ సంఘటన, ఇప్పుడు వైసీపీ నేతలకు న్యాయపరమైన చిక్కులు తెచ్చిపెట్టింది.

## సీఎం చంద్రబాబును కలిసిన కేంద్రమంత్రి గజేంద్ర షెకావత్

**పెన్ పవర్ డెస్క్:** ఆంధ్రప్రదేశ్‌లో పర్యాటక రంగ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ స్పష్టం చేశారు. ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఆయన సమావేశమయ్యారు. సీఎం చంద్రబాబుతో ఏపీ అభివృద్ధి, కేంద్ర సహకారంపై చర్చించారు. అంతకుముందు, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ కేంద్ర మంత్రి షెకావత్‌కు స్వాగతం పలికారు. కేంద్ర మంత్రి షెకావత్ ఇవాళ రాజమండ్రిలో అఖండ గోదావరి ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా అనేక ప్రాజెక్టులకు శంకుస్థాపనలు జరుగుతున్నాయని తెలిపారు. "అఖండ గోదావరి ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయడం చాలా సంతోషంగా ఉంది. ప్రధాని మోదీ దార్శనికతతో దేశంలో పర్యాటక రంగం వేగంగా అభివృద్ధి చెందుతోంది" అని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రాజెక్టుల రూపకల్పనలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ విశేషంగా కృషి చేస్తున్నారని ప్రశంసించారు."డబుల్ ఇంజిన్ సర్కార్‌తో ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి పరుగులు పెడుతోంది. దేశంలోనే కాకుండా, ప్రపంచవ్యాప్తంగా కూడా పర్యాటకుల రాక గణనీయంగా పెరిగింది, ముఖ్యంగా భారత్‌లో ఈ వృద్ధి వేగంగా ఉంది" అని షెకావత్ వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో పర్యాటకాభివృద్ధికి అనుకూలమైన వాతావరణం ఉందని, రాష్ట్రం ఆధ్యాత్మికంగా కూడా పురోగమిస్తోందని ఆయన అన్నారు.రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధి కోసం సుమారు రూ.450 కోట్లకు పైగా నిధులను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందని షెకావత్ వెల్లడించారు. "స్వదేశీ దర్శన్, ప్రసాద్, సాక్షి, ఛాలెంజ్ బేస్డ్ డెస్టినేషన్ డెవలప్‌మెంట్ (సీబీడీడీ) వంటి వివిధ స్కీమ్‌ల ద్వారా కేంద్రం పర్యాటక అభివృద్ధికి తోడ్పాటు అందిస్తోంది. స్వదేశీ దర్శన్ 2.0 కింద అరకు, బొర్రా గుహలు, లంబసింగి, సూర్యలంక బీచ్‌లను అభివృద్ధి చేస్తున్నాం. ప్రసాద్ స్కీమ్ ద్వారా ఆధ్యాత్మిక టూరిజానికి బాటలు వేస్తున్నాం" అని తెలిపారు. అమరావతి, శ్రీశైలం దేవాలయాల్లో భక్తులకు మెరుగైన వసతులు కల్పిస్తున్నామని, సింహాచలం వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం చేపట్టిన పనులు కొనసాగుతున్నాయని, అన్నవరం దేవాలయంలో టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయిందని ఆయన వివరించారు.

**అన్ని విధాలా కేంద్రం సహకారం: పురందేశ్వరి**

ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ ఏపీ అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ, డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఉంటేనే అభివృద్ధి సాధ్యమని తాము గతంలోనే చెప్పామని గుర్తుచేశారు. ప్రజలు తమపై నమ్మకంతో ఆశీర్వదించి గెలిపించారని ఆమె అన్నారు. "వికసిత్ భారత్‌లో వికసిత్ ఆంధ్రప్రదేశ్ ఒక భాగం కావాలి. అమరావతి, పోలవరం వంటి అన్ని కీలక ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తోంది" అని పురందేశ్వరి తెలిపారు. చారిత్రక ప్రాధాన్యత కలిగిన ప్రదేశాలను గుర్తించి, వాటి అభివృద్ధికి కేంద్రం సహాయం అందిస్తోందని, అనేక పర్యాటక అభివృద్ధి కార్యక్రమాలకు నేడు శంకుస్థాపనలు చేసుకుంటున్నామని ఆమె వివరించారు.

## డాకింగ్ విజయవంతం... అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో అడుగుపెట్టిన శుభాంశు శుక్లా

- మొదటి పేజీ తరువాయి

(ఐఎస్ఎస్) విజయవంతంగా అడుగుపెట్టారు. వారి వ్యోమనౌక ఐఎస్ఎస్‌తో అనుసంధానమయ్యే (డాకింగ్) ప్రక్రియ గురువారం సాయంత్రం విజయవంతంగా పూర్తయింది. ఈ ఘనతతో అంతరిక్ష యాత్రల్లో భారత్ తనదైన ముద్రను మరోసారి చాటింది.

వివరాల్లోకి వెళితే, యాక్సియం-4 మిషన్‌లో భాగంగా భారతీయ వ్యోమగామి శుభాంశు శుక్లాతో పాటు అమెరికాకు చెందిన పెగ్గీ విట్సన్, పోలాండ్‌కు చెందిన స్లావోస్జ్ ఉజ్నాన్స్కీ -విస్నీవ్స్కీ, హంగరీకి చెందిన టిబర్ కపులు అంతరిక్షయానం చేపట్టారు. భారత కాలమానం ప్రకారం బుధవారం (జూన్ 25) మధ్యాహ్నం 12:01 గంటలకు అమెరికాలోని కెన్నడీ అంతరిక్ష కేంద్రం నుంచి ఫాల్కన్-9 రాకెట్ ద్వారా వీరి స్పేస్‌క్రాఫ్ట్ నింగిలోకి దూసుకెళ్లింది.

దాదాపు ఒక రోజు ప్రయాణం అనంతరం, గురువారం (జూన్ 26) సాయంత్రం ఈ వ్యోమగాముల బృందం అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరుకుంది. భారత కాలమానం ప్రకారం సాయంత్రం 4:03 గంటలకు స్పేస్‌క్రాఫ్ట్‌ను ఐఎస్ఎస్‌తో అనుసంధానించే డాకింగ్ ప్రక్రియ విజయవంతంగా ముగిసింది. అనంతరం వ్యోమగాములు నలుగురూ

ఐఎస్ఎస్‌లోకి ప్రవేశించారు. ఈ మిషన్‌లో భాగంగా శుభాంశు శుక్లా సహా వ్యోమగాముల బృందం 14 రోజుల పాటు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో గడపనుంది. ఈ సమయంలో వారు పలు పరిశోధనలు, ప్రయోగాలు చేపట్టనున్నట్లు సమాచారం. ఈ విజయం భారత అంతరిక్ష పరిశోధనా కార్యక్రమాలకు మరింత ఊతమిస్తుందని నిపుణులు భావిస్తున్నారు.



## చెట్టు కొమ్మలను తొలగించాలి..

**అంబాజీపేట, పెన్ పవర్, జూన్ 26**

అంబాజీపేట ఆయుర్వేద ఆసుపత్రి ఎదురుగా స్థానిక షిరిడి సాయిబాబా ఆలయం పక్కన ఓ చెట్టు నేలమట్టమయింది. నెలల తరబడి ఈ చెట్టు కొమ్మలు అలాగే ఉన్నాయి. ఓవైపు అమలాపురం అంబాజీపేట ప్రధాన రహదారి చెంతన ఈ చెట్టు కొమ్మలు ఉన్నాయి .అలాగే సాయిబాబా ఆలయానికి వచ్చే భక్తులకు ఇవి ఇబ్బందికరంగా మారాయి. ఆయుర్వేద ఆసుపత్రి ఎదురుగా ఇవి ఉన్నాయి. వీటిని తొలగించాలని భక్తులతో పాటు ప్రజలు కోరుతున్నారు.


# పెన్ పవర్
ఉభయ గోదావరి
కాకినాడ । డా॥బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ । తూ॥ గోదావరి । ప॥ గోదావరి । ఏలూరు


# పునరావాస కాలనీలో భద్రత లేకపోతే ఎలా? బాధితుల ప్రశ్న..




**దేవీపట్నం, పెన్ పవర్, జూన్26:**

పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు దేవీపట్నం మండలంలో ఏర్పాటు చేసిన ఆర్ అండ్ ఆర్ (పునరావాస) కాలనీల్లో సమస్యలు ఎగసిపడుతున్నాయి.కాలనీల్లో నిర్మించిన బాత్రూంలలో నీటి లీకులు చోటుచేసుకుంటున్నాయని, వర్షాకాలం మొదలైన నాటి నుంచి గోడలు తడుస్తున్నాయని వాపోతున్నారు.కాంట్రాక్టర్లు నాసిరకంగా నిర్మాణాలు చేపట్టడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వం తరపున ఖర్చు చేసిన కోట్లాది రూపాయల నిధులు ఏమిటో అని వారు ప్రశ్నిస్తున్నారు.ఇంట్లో ప్రవేశించిన కొన్ని నెలలకే గోడల చేర్పులు విడిపోతుండగా బాత్రూం పైకప్పుల నుంచి నీరు జొరబడుతోంది. బాత్రూమ్స్‌కి వెళ్లాలంటే భయంగా మారింది అని,బాత్రూం గచ్చులు కూడా పీటలు ఇచ్చాయని, బాత్రూం బేషన్స్ క్రిందకి దిగిపోతు న్నాయని, సీతారం ఆర్.అండ్.ఆర్ కాలనీ వాసి గిరిజన మహిళ కుంజం బాపనమ్మ వ్యాఖ్యానించింది.ఇటీవల అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ సరైన స్పందన రాలేదని వారు ఆరోపిస్తున్నారు.సమస్యల పరిష్కారం కోసం సంబంధిత అధికారులు తక్షణమే స్థలాన్ని సందర్శించి దోషులను బాధ్యతకు లోను చేయాలని నిర్వాసితులు డిమాండ్ చేస్తున్నారు.ప్రాజెక్టు బాధితుల పునరావాసంలో నిర్లక్ష్యాన్ని తక్షణమే సరిచేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



- బాత్రూం నుంచి పైకప్పుల వరకు లీకులు... నాసిరకం నిర్మాణాలు.. బాత్రూంలో నుంచి వరదలా నీరు....
- ఫిర్యాదులు విన్న స్పందించని అధికారులు
- నిర్వాసితుల ఆగ్రహం..
- తక్షణమే దర్యాప్తు చేసి చర్యలు తీసుకోండి..బాధితుల డిమాండ్...

## విత్తనాల పంపిణీ ప్రారంభం...

**గిరి రైతులకు రాయితీపై అందుబాటులో ఖరీఫ్ విత్తనాలు..**



**గంగవరం,పెన్ పవర్,జూన్26:**

గంగవరం మండలంలో 2025-26 ఖరీఫ్ పంట కాలానికి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గిరిజన సన్నకారు,చిన్నకారు రైతులకు 90 శాతం రాయితీపై విత్తనాల పంపిణీ కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది.ఈ కార్యక్రమాన్ని ప్రజా ప్రతినిధులు ప్రారంభించారు.



మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ...మండలంలో ఉన్న బయనపల్లి, కొత్తాడ, జడేరు, మోహనాపురం రైతు సేవా కేంద్రాల్లో వరి రకాలైన బిపిటి-5204, ఎంటియు-1064, ఆర్జిఎల్-2537, ఎంటియు-1121, ఎంటియు-1318 విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.విత్తనాల కోసం గిరిజన రైతులు ఆధార్ కార్డు,1బి అడంగల్ కాపీలు వెంట తీసుకురావాలన్నారు. ఒక్కో ఎకరాకు 20 కిలోల విత్తన మోతాదు చొప్పున పంపిణీ జరుగుతుందని,ఇది శాస్త్రవేత్తలు మరియు వ్యవసాయ శాఖ సూచనల ప్రకారమని వివరించారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ కృష్ణారెడ్డి,వైస్ ఎంపీపీ గంగాదేవి,మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పాము అర్జున్,రాష్ట్ర రైతు సంఘం ప్రతినిధి కనిగిరి రాంబాబు,మాజీ ఎంపీపీ,ఎంపీటీసీ ఆదినారాయణ, బీజేపీ మండలాధ్యక్షులు నీలాలమ్మ, బయనపల్లి, కొత్తాడ,జడేరు రైతు సేవా కేంద్రాలగంగవరం పరిధి సర్పంచులు, కూటమి నాయకులు చిన్న, బుల్లియమ్మ, సత్యవేణి,రైతులు,అగ్రికల్చర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బాహుబలి అరిటిగెల

**అశ్చర్యపరుస్తున్న ఆరడుగుల పచ్చగెల..**

**అంబాజీపేట, పెన్ పవర్, జూన్ 26**

సేంద్రియ ఎరువుల వినియోగంతో పెరటిలో పెరిగిన బాహుబలి పచ్చ అరటిగెల అందరినీ ఆశ్చర్యపరుస్తుంది. అంబాజీట కొర్లపాటివారిపాలెంకు చెందిన కొర్లపాటి వెంకటేశ్వరరావు తన పెరట్లో పచ్చ అరటి (ఇత్తనంపిల్ల) మొక్కను పది నెలల క్రితం నాటారు. టిష్యూ కల్చర్ లో భాగంగా గింజ నాటడం ద్వారా వచ్చిన మొలకను స్థానిక పండ్ల వ్యాపారి గంధ్రోతు సూరిబాబు ఇచ్చారని వెంకటేశ్వరరావు తెలిపారు. ఆ మొక్కను పెరట్లో నాటి పూర్తిగా సేంద్రియ ఎరువులు వాడడంతో సుమారు పది అడుగులు ఎత్తు ఎదిగిన అరటి మొక్క బలమైన గెలను వేసిందన్నారు. చెట్టుకు భారం కాకుండా రెండు వెదురు గెడలను ఇరువైపులా వేసి బలంగా కట్టి చెట్టును నిలబెట్టామని తెలిపారు.13 అత్తాల ద్వారా సుమారు 300 కాయలతో బలమైన గెల వేసిందన్నారు. బాహుబలి అరటి గెలను చూసేందుకు పలువురు ఆసక్తిగా తిలకించారు.



## వారాహి అమ్మవారికి ప్రత్యేక పూజలు

**అంబాజీపేట, పెన్ పవర్, జూన్ 26**

మాచవరం శ్రీ పార్వతీ రాజేశ్వర స్వామివారి ఆలయ సమీపంలో వేంచేసియున్న శ్రీ వారాహి అమ్మవారి నవరాత్రి మహోత్సవములు గురువారం పా్రంభమయ్యాయి. ఉదయం నుంచి వారాహి అమ్మవారి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పూజా కార్యక్రమాలలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వహకులు మాట్లాడుతూ వారాహి అమ్మవారికి ఉదయం అభిషేకములు, సాయంత్రం కుంకుమ పూజలు పురోహితులు మాచరి రాజా ఆధ్వర్యంలో జరుపుతారని తెలిపారు. పూజా కార్యక్రమాలు అనంతరం ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.



## మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా

# డొంకరాయిలో అవగాహన ర్యాలీ





**చింతూరు, పెన్ పవర్, జూన్ 26:**

అంతర్జాతీయ మాదక ద్రవ్య దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని డొంకరాయి గ్రామంలో గురువారం ఘనంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.స్థానిక ఎస్సై శివకుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యా, వైద్య, రెవెన్యూ, జెన్కో శాఖల అధికారులు, సీఆర్పీఎఫ్ భద్రతా దళాలు, ప్రజాప్రతినిధులు కలిసి పాఠశాల విద్యార్థులతో కలిసి గ్రామంలో ర్యాలీ మరియు మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వల్ల యువతలో కలిగే దుష్పరిణామాలను గ్రామస్థులకు వివరించి, డ్రగ్స్ వ్యసనానికి దూరంగా ఉండాలని, భవిష్యత్‌ను ధ్వంసం చేసుకునే మార్గం వైపు అడుగులు వేయొద్దని అవగాహన కల్పించారు.

# మత్తు పదార్థాల వల్ల యువత ఆరోగ్యవంతమైన

### జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు



**టి.నరసాపురం, పెన్ పవర్,జూన్ 26:**
భారత ప్రభుత్వం చేపట్టిన మత్తు వ్యవస్థ నివారణ కార్యక్రమం దీని ప్రధాన లక్ష్యం దేశంలో మత్తు పదార్థాల వినియోగం నుండి విముక్తి కలిగించడం దీనిలో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో జూన్ 26 మాదక ద్రవ్యాల వ్యతిరేకత దినోత్సవ కార్యక్రమం ఐ సి డి ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎం లక్ష్మి మాట్లాడుతూ



మాదకద్రవ్యం వాడకం వలన యువత దారి తప్పుతున్నారని ఆరోగ్యవంతమైన జీవితాన్ని చేతులారా నాశనం చేసుకుంటున్నారని మాదకద్రవ్యం వాడకం మద్యపానం ధూమపానం కంటే అత్యంత ప్రమాదకరమైనది అని అన్నారు దీనిని నివారించడం వల్ల యువత చెడు వ్యసనాల బారిన పడకుండా కాపాడి ఆరోగ్యవంతమైన జీవనాన్ని సాగించాలని సూచించారు అనంతరం మానవహారంగా ఏర్పడి మాధక ద్రవ్యాల పై పోరాడదాం అని 2025 థీమ్ కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, మహిళా పోలీస్ అంగన్వాడీ కార్యకర్తలు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# విధులపై నిర్లక్ష్యం

### లాగరాయి పీఏచ్సీ వైద్యాధికారిపై సస్పెన్షన్ చర్య

### ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం



**రాజవొమ్మంగి, పెన్ పవర్ జూన్ 26:**
లాగరాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వర్తిస్తున్న ఇద్దరు వైద్యులలో ఒకరైన డాక్టర్ నాగార్జున విధులకు గైర్హాజరుగా ఉండటాన్ని గుర్తించి, ఆయనను తాత్కాలికంగా సస్పెండ్ చేసినట్లు రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం తెలిపారు. గురువారం ఉదయం రాజవొమ్మంగి మండలంలోని లాగరాయి పీఏచ్సీకి ఆకస్మికంగా సందర్శన చేసిన ప్రాజెక్ట్ అధికారి, అక్కడి హాజరు వివరాలు, వైద్యుల హాజరు రిజిస్టర్ తదితర విషయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగార్జున విధులకు హాజరుకాలేదు అని తేలింది. "ఆరోగ్య సేవలపై ఎలాంటి నిర్లక్ష్యానికీ తావు లేదు. ప్రజల ఆరోగ్యం ప్రాధాన్యత. అందువల్ల విధుల్లో నిర్లక్ష్యం వహించిన డాక్టర్ నాగార్జునపై తాత్కాలిక సస్పెన్షన్ చర్య తీసుకున్నాం" అని ప్రాజెక్ట్ అధికారి స్పష్టం చేశారు. ఇద్దరు వైద్యులు పనిచేస్తున్న ఈ ఆరోగ్య కేంద్రంలో సేవల ప్రభావితతను పర్యవేక్షిస్తూ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంలోని అన్ని ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా చూడాల్సిన బాధ్యత తమపై ఉందని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై శాఖపరమైన చర్యలు తీసుకోవడంలో వెనుకడుగు ఉండదని హెచ్చరించారు.

# వర్షం రోడ్లపై ప్రమాదంగా మారొచ్చా?

### వాహనదారులు అప్రమత్తంగా ఉండాలి: రాజవొమ్మంగి సీఐ హెచ్చరిక



**రాజవొమ్మంగి, పెన్ పవర్ జూన్ 26**
మండలంలోని ప్రాంతాల్లో చిరు చినుకులతో వర్షం కురుస్తోంది. ఈ నేపథ్యంలో ఇటీవల నిర్మించిన హైవే పూర్తిగా తడిసిపోయింది. తడిచిన రోడ్లపై వాహనాల పరుగుల మధ్య జారుడు ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని రాజవొమ్మంగి సీఐ సన్యాసినాయుడు హెచ్చరించారు. వాహనదారులు నెమ్మదిగా, జాగ్రత్తగా నడవాలన్నారు. అత్యవసరమైతేనే ప్రయాణించాలంటూ సూచించారు. "వర్షం పడుతున్న సమయంలో రహదారులు జారుడు స్వభావం సంతరించుకుంటాయి. ఇది ప్రమాదాలకు దారి తీసే అవకాశం ఎక్కువ. అందువల్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి," అని ఆయన తెలిపారు.

# ఆదివాసి హక్కుల సాధనపై సమావేశం





**చింతూరు, పెన్ పవర్, జూన్ 26:**
ఆదివాసి హక్కుల సాధన, చట్టాల అమలుపై అవగాహన పెంపొందించేందుకు ఆదివాసి సంక్షేమ పరిషత్ (274/16) ఆధ్వర్యంలో గురువారం పార్వతీపురం ప్రభుత్వ విశ్రాంతి ఉద్యోగుల భవనంలో జిల్లా స్థాయి విస్తృత సమావేశం నిర్వహించబడింది. హిమరక పకీర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను మాట్లాడుతూ. భారత రాజ్యాంగం ద్వారా గిరిజనులకు ప్రసాదించిన హక్కులు ఇప్పటికీ అనేక ప్రాంతాల్లో అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యం, రాజకీయ ప్రయోజనాల వల్ల అనేక ఆదివాసి గ్రామాలను నాన్ ఏజెన్సీగా చూపించి రాజ్యాంగ చట్టాల అమలుకు తీవ్ర అవరోధంగా మారినట్టు తెలిపారు. మన్యం జిల్లాలోని అన్ని ఆదివాసి గ్రామాలను షెడ్యూల్డ్ ఏరియాగా గుర్తించి, అన్ని హక్కులు, సంక్షేమ పథకాలు, ఉపాధి అవకాశాలు స్థానిక గిరిజనులకే లభించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గౌరవ సుప్రీంకోర్టు, హైకోర్టుల ఉత్తర్వుల ప్రకారం ఏజెన్సీ ప్రాంతాల్లో నాన్ ట్రైబల్స్ అక్రమ కట్టడాలు, స్థిర నివాసాలు, వ్యాపార సముదాయాలు తొలగించాలని, కానీ ఇప్పటికీ మన్యం జిల్లాలో అధికారుల నిర్లక్ష్యంతో చర్యలు లేవని విమర్శించారు. అవసరమైతే ఉద్యమించేందుకు సిద్ధమని హెచ్చరించారు. రాజకీయ పార్టీలకతీతంగా ఆదివాసీలు ఐక్యంగా చట్టాల అమలుకు పోరాటం చేయాలని, లేకుంటే భవిష్యత్ తరాలు హక్కులనూ, సంస్కృతినీ కోల్పోతాయని హెచ్చరించారు. గిరిజన యేతరుల వలసల వల్ల ఆదివాసుల భూములు, హక్కులు, సంప్రదాయాలు కలుషితమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గుమ్మడి సంధ్యారాణి వంటి ప్రజాప్రతినిధులు గిరిజనుల స్థానంలో గిరిజనయేతరులకే మద్దతు ఇస్తూ ఆదివాసులకు ద్రోహం చేస్తున్నారని విమర్శించారు. ఈ సందర్భంగా సంఘం కరపత్రాన్ని విడుదల చేసింది. ఈ సమావేశంలో రాష్ట్ర జాయింట్ సెక్రటరీ తీగల బాబురావు, జిల్లా అధ్యక్షుడు సూర్యనారాయణ, కోరాడ తిరుమల బాబ్జి, గురాడ అప్పన్న, పీతా ప్రసాద్, బిడ్డిక గణేష్, తాడంగి రాజు, ఊర్మిళ, సుజాత, బిడ్డిక చిరంజీవి, బిడ్డిక సూర్యం తదితరులు పాల్గొన్నారు.

### మాదక ద్రవ్యాల నివారణ దినోత్సవం

# ఘనంగా నిర్వహణ

**చింతూరు, పెన్ పవర్, జూన్ 26:**
స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నివారణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డా కె రత్న మాణిక్యం మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం సమాజంలో ప్రమాదకర స్థాయికి చేరుకుందని, ముఖ్యంగా యువతలో ఈ అలవాటు వేగంగా పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన చింతూరు పోలీస్ శాఖకు చెందిన ఎస్ఐలు పి రమేష్, జె కృష్ణ, ఎక్సైజ్ శాఖకు





చెందిన వై వై ఎస్ యల్ స్వామి, హెచ్‌సీలు సి హెచ్ భద్రం, పి మోహన్ రావు, ఎం డి గోస్, తదితరులు గంజాయి వంటి మాదక ద్రవ్యాల వినియోగం గురించి అవగాహన కల్పించారు. గ్రామస్థాయిలో విద్యార్థులే ప్రచారకులుగా మారి పెద్దల్లోనూ ఇది ఎంత ప్రమాదకరమో తెలియజేయాలని సూచించారు. ఈ సందర్భంగా విభాగాధిపతి కె శకుంతల మాదక ద్రవ్యాల శారీరక, మానసిక దుష్పరిణామాల గురించి వివరించారు. మాదకద్రవ్యాల వల్ల మెదడులో డోపమైన్, సెరటోనిన్ వంటి ఉత్ప్రేరకాలు విడుదలై వాటిపై ఆధారపడే పరిస్థితి ఏర్పడుతుందని, వీటికి దూరంగా ఉండాలన్నారు. అంతకుముందు కళాశాల విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించి మాదక ద్రవ్యాల వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎం శేఖర్, అధ్యాపకులు జి వెంకట్రావు, డా వై పద్మ, ఎస్ అప్పనమ్మ, జి హారతి, కె శైలజ, ఎం నాగ మోహన్ రావు, వై వి ఎస్ ఎన్ మూర్తి, సంగం నాయుడు, శీనయ్య, సుబ్బారావు, కన్నయ్యలు పాల్గొన్నారు.

# మోతుగూడెం పోలీసుల హెచ్చరిక

### వాహనదారులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి.. మోతుగూడెం పోలీస్ శాఖ



**చింతూరు, పెన్ పవర్,జూన్ 26:**
మోతుగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆటో డ్రైవర్లు, మ్యాజిక్ వాహన దారులు, ఇతర వాహనదారులకు మోతుగూడెం పోలీసులు కీలక సూచనలు చేశారు. వాహనాలు నడిపే సమయంలో తగిన నిబంధనలు పాటించకపోతే చట్టరీత్యా శిక్షార్హులవుతారని వారు హెచ్చరించారు. ప్రతి వాహనదారుడు తమ వాహనంలో డ్రైవింగ్ లైసెన్స్, వాహన ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలని స్పష్టం చేశారు. అధిక వేగంతో వాహనాలు నడిపటం, త్రిబుల్ రైడింగ్, హెల్మెట్ లేకుండా బైక్ నడిపటం చట్టరీత్యా నేరమని తెలిపారు. వీటికి లోబడే విధంగా వాహనదారులు నడవాలని, మోతుగూడెం పోలీసుల సూచనలు పాటించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై తగిన చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు.

# సబ్సిడీపై వరి విత్తనాలు పంపిణీ



**వై రామవరం, పెన్ పవర్, జూన్ 26:**
మండలంలోని రైతులకు సబ్సిడీపై వరి విత్తనాలు పంపిణీ చేయడం జరిగిందని వ్యవసాయ సిబ్బంది తెలిపారు. వై రామవరం రైతు సేవ కేంద్రం నందు గురువారం రైతులకు 90 శాతం సబ్సిడీపై వరి విత్తనాలు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ధాన్యం ఎం టి యు 1121 రకం 35 కేజీల బ్యాగ్ 135 రూపాయలు, ఎం టి యు 1318 రకం 135 రూపాయలు, ఆర్ జి ఎల్ 2537 రకం145 రూపాయలు రైతులకు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. మండలానికి 640 క్వింటాళ్లు ధాన్యం విత్తనాలు మండలాన్ని సరఫరా అయ్యాయని తెలిపారు. ప్రతి సచివాలయం పరిధిలో రైతు సేవా కేంద్రంలో వరి విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కే బాపన్న దొర, ఎంపీపీ ఆనందరావు, జెడ్పిటిసి వెంకటలక్ష్మి,ఎంపీటీసీ సుబ్బలక్ష్మి, టిడిపి మండల అధ్యక్షుడు వెంకటరమణారెడ్డి, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

# దామలపల్లి ఆశ్రమ పాఠశాలలో ఏటిడబ్ల్యూఓ ఆకస్మిక తనిఖీ..







**దేవీపట్నం,పెన్ పవర్,జూన్26:**
మండలంలోని దామలపల్లి ఆశ్రమ పాఠశాలను ఏటిడబ్ల్యూఓ(అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్) రామతులసి బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె పాఠశాల రికార్డులను,ఉపాధ్యాయుల మరియు విద్యార్థుల హాజరును సరిచూశారు. అనంతరం వంటశాలను పరిశీలించి,విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. భోజన నాణ్యతను గమనించి,విద్యార్థుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సామర్థ్యాలు,శిక్షణ స్థాయిని అంచనా వేసిన ఆమె,అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏటిడబ్ల్యూఓ మాట్లాడుతూ.... విద్యార్థులకు మెరుగైన విద్య,వైద్యం, పోషకాహారం అందించాలన్నారు. పిల్లల భవిష్యత్తు మెరుగుపడేందుకు ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్.ఎం. బి. చంద్రకళ,డిప్యూటీ వార్డెన్ బేబీ రోహిణి,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జూన్ 26 నుంచి డీ-వార్మింగ్ కార్యక్రమం ప్రారంభం

### నెల్లిమెట్ట గ్రామంలో ప్రారంభించిన వెటర్నరీ విభాగం



రాజవొమ్మంగి, పెన్ పవర్ జూన్ 26

గ్రామీణ ప్రాంతాల్లో పశుసంవర్ధనంలో ముఖ్యమైన భాగంగా పశువులకు ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాల్లో భాగంగా, నెల్లిమెట్ట గ్రామంలో జూన్ 26 నుంచి డీ-వార్మింగ్ (పురుగు మందు వేయడం) కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని వెటర్నరీ డాక్టర్ తరుణ్ నేతృత్వంలో నిర్వహిస్తున్నారు. గ్రామంలోని పశువులకు సరైన సమయంలో డీ-వార్మింగ్ చేయించడం ద్వారా వాటి ఆరోగ్యం మెరుగవుతూ, ఉత్పాదకత పెరుగుతుందని ఆయన తెలిపారు. పలువురు పశువులు రైతులు మాట్లాడుతూ, "ఇలాంటి కార్యక్రమాల ద్వారా రైతులకు తమ పశువులను ఆరోగ్యంగా ఉంచుకునే అవగాహన పెరుగుతుంది. ప్రభుత్వం తరఫున మరిన్ని కార్యక్రమాలు కావాలి," అని అభిప్రాయపడ్డారు. వెటర్నరీ సిబ్బంది గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి పశువులకు మందులు వేస్తూ, రైతులకు అవసరమైన సూచనలు అందిస్తున్నారు. అన్ని పశువులు ఈ సేవను పొందాలనే దృఢ సంకల్పంతో ఈ కార్యక్రమం చేపట్టినట్టు నిర్వాహకులు తెలిపారు.

## గిరిజన రైతులకు వరి విత్తనాల పంపిణీ

### 90 సబ్సిడీతో రాజవొమ్మంగి ఎంపీడీఓ కార్యాలయంలో కార్యక్రమం

రాజవొమ్మంగి, పెన్ పవర్ జూన్ 26

గిరిజన రైతులకు సాగు పరంగా ప్రోత్సాహం కల్పించేందుకు 90% సబ్సిడీపై వరి విత్తనాల పంపిణీ కార్యక్రమం మంగళవారం రాజవొమ్మంగి ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, రైతు నాయకులు, వ్యవసాయ





శాఖ అధికారులు పాల్గొన్నారు. విత్తనాల పంపిణీ సందర్భంగా వ్యవసాయ మార్కెటింగ్ చైర్మన్ లోతా లక్ష్మణ్ రావు మాట్లాడుతూ, "ప్రతి గిరిజన రైతు ఈ అవకాశాన్ని వినియోగించుకుని మెరుగైన దిగుబడులు సాధించాలి," అన్నారు. మండల పరిషత్ ప్రెసిడెంట్ గోము వెంకట లక్ష్మి మాట్లాడుతూ, "పంట నమోదు కోసం ప్రతి రైతు తప్పనిసరిగా చేయించుకోవాలి," అని సూచించారు. టిడిపి మండల అధ్యక్షుడు గొల్లపూడి పెద్దిరాజు మాట్లాడుతూ, "రెండవ పంట సాగును ప్రోత్సహించాలి. పశువుల వల్ల పంట నష్టం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి," అన్నారు. మాజీ చైర్మన్ గణిజాల తాతారావు మాట్లాడుతూ, "కొత్త నాట్ల విధానం ద్వారా తక్కువ విత్తనంతో ఎక్కువ దిగుబడులు సాధించవచ్చు," అని వివరించారు. ఎంపీటీసీ నల్ల సత్తిబాబు మాట్లాడుతూ, "పేడీ కొనుగోలు పరిమితి పెంపు కోసం ప్రభుత్వానికి విన్నవించాం," అని తెలిపారు. ఈ సందర్భంగా 1163 క్వింటాళ్ల వరి విత్తనాలు పంపిణీ చేశారు. అందులో MTU-1064, MTU-1318, నెల్లూరు సన్నాలు, -1121 రకాలున్నాయి. కార్యక్రమంలో ఎంపీటీసీలు, వ్యవసాయ శాఖ సిబ్బంది, అనేక మంది గిరిజన రైతులు పాల్గొన్నారు. విత్తన వినియోగంపై అవగాహన కల్పించడంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.

# వాహనదారులకు యమపాశంగా మారిన హైవే

రాజవొమ్మంగి పెన్ పవర్ జూన్ 26

నూతనంగా నిర్మితమైన హైవే రహదారి ఇప్పుడు వాహనదారులకు యమపాశంగా మారింది. ప్రతి రోజూ సాయంత్రం ఐదు గంటల తరువాత మూగజీవాల సంచారం హైవేపై గణనీయంగా పెరుగుతోంది. గుంపులుగా వచ్చి రోడ్డుపై నిద్రిస్తున్న పశువులు, వేగంగా వస్తున్న వాహనాలను అడ్డుకోవడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. మూగజీవాలను ఢీకొని వాహనదారులు చేతులు, కాళ్లు, తలకు గాయాలు పాలవుతున్న ఘటనలు నిత్యమైపోయాయి. ముఖ్యంగా రాత్రివేళల్లో లారీలు, హైసర్లు, ట్రాక్టర్లు వేగంగా వెళ్తుండటంతో హైవేపై పశువులు గుంపులుగా నిలబడటం లేదా పడుకుని ఉండటం వాహనదారులకు ముప్పుగా మారుతోంది. ఒక్కసారిగా లైట్‌లు పడగానే మూగజీవాలు ఉలిక్కిపడి లేచే ప్రయత్నం చేస్తుండగా వాహనాలు వాటిని ఢీకొడుతున్న దృశ్యాలు తరచుగా కనిపిస్తున్నాయి. రాజవొమ్మంగి మండలంలో ఈ దృశ్యాలు సహజంగా మారిపోతున్నాయి. వేసవి మొదటి నాటినుంచి ఇప్పటివరకు అనేక మంది వాహనదారులు గాయపడగా, పలు మూగజీవాలు మృత్యువాత పడ్డాయి. వాహనదారులు తమ ప్రాణాలను చేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. "హైవేపై ప్రయాణం చేయడం అంటే అసలు ప్రయాణమే కాదు, అది ఒక ప్రయాణ యాత్ర కాదు... యమపాశంపై నడక" అని కొంతమంది ప్రయాణికులు వేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదంతా జరిగిపోతున్నా, సంబంధిత పంచాయతీలు, పశుసంవర్ధన శాఖ అధికారులు స్పందించకపోవడం బాధాకరం. జిల్లా స్థాయి నుండి మూగజీవాలు హైవేపైకి రాకుండా చర్యలు తీసుకోవాలని పలుమార్లు సందేశాలు పంపించినా, గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నడవడం లేదు. పశువులను అడ్డుకునే చర్యలు తీసుకోవడం కాదు గానీ, కనీసం పంచాయతీ కార్యదర్శులు స్పందించకపోవడం స్థానికుల ఆగ్రహానికి దారితీస్తోంది. రైతులకు తమ మూగజీవాల నియంత్రణపై పూర్తిస్థాయిలో అవగాహన లేకపోవడం, పశువులు స్వేచ్ఛగా సంచరించడమే ఈ ప్రమాదాలకు మూలకారణంగా భావిస్తున్నారు. హైవేపై ప్రయాణం చేస్తున్న వాహనదారులు ఒక్కో రోజు క్షేమంగా తిరిగి ఇంటికి చేరుతామా అనే ఆందోళనలో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇకనైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని, మూగజీవాలు హైవేపైకి రాకుండా నియంత్రణ విధించాలని, వాహనదారుల ప్రాణాలకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు. అలాగే మూగజీవాలు అనవసరంగా మృత్యువాత పడకుండా చూడాల్సిన బాధ్యత సమాజమంతటిపై ఉందని పలువురు హెచ్చరిస్తున్నారు.





## ఐ.టి.డి.ఏ..పి.ఓ మండలంలో సుడిగాలి పర్యటన

### విధులలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు

### పి.ఓ కట్టా.సింహాచలం...

అడ్డతీగల, పెన్ పవర్ ,జూన్ 26

గురువారం రంపచోడవరం ఐ.టీ.డీ.ఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా.సింహాచలం మండల కేంద్రమైన అడ్డతీగల లో పర్యటించారు అడ్డతీగల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సందర్శించి రోగులను వైద్య సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఏజెన్సీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో డాక్టర్ వారి సిబ్బంది ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటూ, మెరుగైన వైద్య సేవలు అందించాలని విధులలో నిర్లక్ష్యం వహిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని ప్రాజెక్ట్ ఆఫీసర్ కట్ట సింహాచలం అన్నారు. అడ్డతీగల కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో ఎంతమంది వైద్యాధికారులు ఉన్నది, ఎంతమంది సిబ్బంది అని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి జ్వరముతో వచ్చిన రోగులను వెంటనే రక్త



నమోనాలు సేకరించి మలేరియా, డెంగు పరీక్షలు నిర్వహించాలని వ్యాధి నిర్ధారణ అయితే వెంటనే మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆయన సూచించారు. ఆసుపత్రిలో ప్రస్తుతం ఎంతమంది గర్భిణీ స్త్రీలు ఉన్నాది ఆయన ఆరా తీశారు. సీజనల్ వ్యాధులకు ఎప్పటికప్పుడు మందులు అందుబాటులో పెట్టుకోవాలని,వైద్య సిబ్బందికి సూచనలు ఇచ్చారు. అనంతరం అడ్డతీగల గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలను ప్రాజెక్టు అధికారి పరిశీలించారు, ఆశ్రమ పాఠశాలలో ఎంతమంది విద్యార్థులు ఉన్నది అదే విధంగాఎంతమంది ఉపాధ్యాయులు ఉన్నది ఆయన పరిశీలించారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతులు ఒకటికి రెండుసార్లు విద్యాబోధన చేయాలని ఉపాధ్యాయులకు ఆయన తెలిపారు. విద్యార్థులకు పుస్తకాలు నోటు పుస్తకాలు అందరికీ అందినది లేనిది అడిగి తెలుసుకున్నారు. గుడ్లు, పాలు నిత్యవసర కూరగాయలు వెండర్లు ఏ విధంగా సరఫరా చేస్తున్నారు అన్నది ఆరా తీశారు. అనంతరం వేటమామిడి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల ను ప్రాజెక్ట్ అధికారి పరిశీలించారు.

## కె గంగవరం పాఠశాల విద్యార్థులకు నోటుపుస్తకాలు పంపిణీ



కె గంగవరం పెన్ పవర్ జూన్ 26:

కె గంగవరం మెయిన్‌లోని మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలను అందజేశారు. ఈ సేవా కార్యక్రమాన్ని హైదరాబాద్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ముత్యాల కిషోర్ మరియు సుధ దంపతులు చేపట్టారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు పోతంశెట్టి సత్యనారాయణమూర్తి,కోనసీమ జిల్లా ఎస్ఎస్ఏ ఐఈ కోఆర్డినేటర్ మద్రి రెడ్డి వీర వెంకట సత్యనారాయణ దాతల పరమార్థమైన సేవను అభినందించారు. విద్యార్థుల భవిష్యత్తు మెరుగుపడాలనే సంకల్పంతో అజ్ఞాతంగా సేవలందిస్తున్న ముత్యాల దంపతుల ఈ పన్నెండు ప్రశంసనీయం అని ఉపాధ్యాయులు అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులైన దాసరి శ్రీను,ఎం.ప్రదీప్ కుమార్,ఎన్.శ్యామలాదేవి,కే. శిరీష తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకుంటాం

### - డి. ఈ. ఓ సలీం భాషా - హర్షం వ్యక్తం చేసిన తల్లిదండ్రులు

అమలాపురం పెన్ పవర్ జూన్ 26 :

ఉప్పలగుప్తం మండలం. ఎస్. యానాం పెదపేట అంబేద్కర్ నగర్ గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాల విద్యార్థుల తల్లితండ్రులు పాఠశాలను విలీనం చెయ్యవద్దని ఆందోళన చేసిన నేపథ్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి (డి. ఈ. ఓ ) స్పందించి గురువారం పెదపేట పాఠశాలను సదర్శించి విద్యార్థుల తల్లితండ్రులు మరియు పి డి ఎస్ యు విద్యార్థి సంఘాల నాయకులతో చర్చించారు..విద్యార్థులను ఎలాంటి పరిస్థితుల్లోనూ ఇబ్బందులు పెట్టాకుండా చర్యలు తీసుకుంటామని, వారికి భద్రత కల్పిస్తామని తల్లిదండ్రులు ఆందోళన చెందవద్దని విద్యార్థులకు నాణ్యమైన నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తుందని దానికి విద్యార్థుల తల్లితండ్రులు సహకారం కూడా అందించాలని సూచించారు..విద్యార్థుల సమస్యలు పరిగణలోకి తీసుకోని విద్యార్థుల చదువులకు ఆటంకం కలగకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్. యానాంలో ఉన్న అన్నిపాఠశాలలను సందర్శించి మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించారు విద్యార్థుల తో ముచ్చటించి 10 వ తరగతి విద్యార్థులకు సైన్స్ పాటలు బోదించారు.. పరిశుభ్రతా మంచినీళ్లు ఉపయోగం పై ఉపాధ్యాయులకు సూచనలు చేసి విద్యార్థుల ఆరోగ్యానికి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.. ఈ కార్యక్రమం లో మండల విద్యాశాఖ అధికారులు కె. కిరణ్ బాబు, పి. డి. ఎస్.యూ విద్యార్థి సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు రేవు తిరుపతి రావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ బూల దుర్గా ప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు పెట్టా అప్పారావు, ముత్తాబత్తుల శ్రీనివాసరావు, ఉడుము కిషోర్,ఉలిశెట్టి స్వామి నాయుడు, రేవు నాగేశ్వరావు, అయితాబత్తుల అభిమన్యుడు, కాశీ జోషప్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యాభివృద్ధికి కృషి చేస్తూ సమస్యలు పరిష్కరించిన డిఈఓ సలీం భాష కు గ్రామస్తులు విద్యార్థి సంఘ నాయకులు దుస్సాలువా కప్పి చిరు సత్కారం చేశారు.





# గోదావరి-శబరి వరద సమీక్ష సమావేశం



## ఐటిడిప చింతూరు ఆహ్వానం

చింతూరు, పెన్ పవర్, జూన్ 26:

గోదావరి మరియు శబరి నదుల వరద పరిస్థితులపై సమగ్ర సమీక్ష సమావేశం జూన్ 27, 2025 న ఉదయం 11 గంటలకు ఐటిడిఏ చింతూరు కార్యాలయంలో నిర్వహించబడనుందని ప్రాజెక్టు అధికారి ఐటిడిఏ చింతూరు వారు తెలిపారు. ఈ సమావేశం జిల్లా కలెక్టర్ వారి ఆధ్వర్యంలో జరుగనుంది. చింతూరు డివిజన్‌కు చెందిన నాలుగు మండలాల ప్రజా ప్రతినిధులు, ముంపు బాధిత గ్రామాల సర్పంచులు, గ్రామ పెద్దలు సమావేశానికి హాజరై, తమ గ్రామాల్లో అవసరమైన కనీస సదుపాయాల వివరాలను దరఖాస్తు రూపంలో సమర్పించాలని ప్రాజెక్టు అధికారి సూచించారు. విపత్తు ముంపు పరిస్థితుల నేపథ్యంలో ప్రతి గ్రామ స్థాయి సమస్యలు, లోటుపాట్లు ఈ సమీక్ష సమావేశంలో చర్చించబడనున్నాయి. అందుకే సంబంధిత ప్రతి గ్రామ ప్రతినిధి తప్పనిసరిగా హాజరు కావాలని అధికారులు కోరుతున్నారు. సమావేశానంతరం మండలాల మీడియా ప్రతినిధులతో ప్రెస్ మీట్ నిర్వహించబడుతుందని, మీడియా మిత్రులు పూర్తి స్థాయిలో హాజరవ్వలని పిలుపునిచ్చారు.

# నేడు విద్యుత్ సరఫరా నిలిపుదల

<u>అంబాజీపేట, పెన్ పవర్, జూన్ 26</u>

మండలంలో అంబాజీపేట గంగలకుర్రు సబ్ స్టేషన్ పరిధిలోని గల గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ కె.రాంబాబు ప్రకటనలో తెలిపారు. అంబాజీపేట, మాచవరం, వాకలగరువు, నందంపూడి, తొండవరం, పోతాయిలంక, సాకుర్రు గున్నేపల్లి, గంగలకుర్రు పరిధిలో కె.పెదపూడి, మొసలపల్లి. పాలగుమ్మి, నడిపూడి, బండారులంక గ్రామాలకు విద్యుత సరఫరా ఉండదన్నారు. 33 కేవీ విద్యుత్ లైన్ లకు, 11 కేవీ విద్యుత్ లైన్ కు మరమత్తు పనులు చేపట్టనున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

# ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలి

<u>జగ్గంపేట, పెన్ పవర్, జూన్ 26:</u>

ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలని జగ్గంపేట సీఐ వై.ఆర్.కె శ్రీనివాస్ అన్నారు. గురువారం మండలంలో కాట్రావులపల్లిలో ముసిరెడ్డి నాగేశ్వరరావు ఆర్థిక సహాయంతో అందించిన 12 హెల్మెట్లను లాటరీ తీసి ఉచితంగా అందించారు.



ఈసందర్భంగా జగ్గంపేట సీఐ వై.ఆర్.కె శ్రీనివాస్, ఎస్ఐ టి.రఘునాధరావు, సిబ్బంది హెల్మెట్లు ధరించి గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ద్విచక్ర వాహనం నడిపే వ్యక్తితో పాటు వెనుక కూర్చునే వ్యక్తి కూడా హెల్మెట్ ధరించాలన్నారు. హెల్మెట్లు ధరించకపోతే కలిగే అనర్థాలు వివరించారు. ప్రమాదాలు జరిగిన సమయంలో హెల్మెట్లు ఉండడం వల్ల ప్రాణాపాయంతో బయటపడవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యడ్లపల్లి రమేష్, సుంకర సీతారాముడు, కంటే బుల్లబ్బి, పి.ధర్మానందకుమార్ శాస్త్రి, బావన్నదొర వీరాచారి, మూలయ్య, శ్రీను బుజ్జి, రాజా తదితరులు పాల్గొన్నారు.

# జగ్గంపేటలో మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం



<u>జగ్గంపేట, పెన్ పవర్, జూన్ 26:</u>

అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని గురువారం జగ్గంపేటలో నిర్వహించారు. జగ్గంపేట సీఐ వై.ఆర్.కె శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొని గ్రామంలో ర్యాలీ చేపట్టారు. మాదవద్రవ్యాలు వాడరాదని నినాదాలు చేస్తూ జగ్గంపేట సెంటర్ లో మానవహారం చేశారు. విద్యార్థులు, యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలు వివరించారు. మాదక ద్రవ్యాలు వినియోగించిన, కలిగి ఉన్న, రవాణా చేసిన కఠిన చర్యలు తప్పవన్నారు. యువత ఈ కేసుల్లో చిక్కుకుని భవిష్యత్ ను నాశనం చేసుకోవద్దని సూచించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట ఎస్ఐ టి.రఘునాధరావు, గండేపల్లి ఎస్ఐ యువ శివనాగబాబు, కిర్లంపూడి ఎస్ఐ జి.సతీష్, సీడీపీవో పూర్ణిమ, పోలీసు, అంగన్వాడీ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గిరిజన కుటుంబానికి ఇంటి నిర్మాణ సహాయం

## జేకెసిటి ట్రస్ట్ ఆధ్వర్యంలో




<u>చింతూరు, పెన్ పవర్, జూన్ 26:</u>

మండలంలోని దొంగల జగ్గారం గ్రామానికి చెందిన పూసం వెంకటేశ్వర్లు అనే నిరుపేద ఆదివాసి గిరిజన కుటుంబానికి జేకెసిటి ట్రస్ట్ తరపున ఇంటి నిర్మాణానికి అవసరమైన సామాగ్రి అందజేశారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ మొహమ్మద్ జమాల్ ఖాన్ స్వయంగా హాజరై 12 సిమెంట్ రేకులు, 10 ఇనుప పైపులు వెంకటేశ్వర్లుకు అందజేశారు.ఎండలు, వర్షాలకు తీవ్రంగా ఇబ్బంది పడుతున్న ఈ కుటుంబం పూరిగుడిసెలో నివాసం ఉంటోందన్న విషయాన్ని స్థానికులు జమాల్ ఖాన్కు తెలియజేయగా, ఆయన వెంటనే స్పందించి అవసరమైన సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షులు ఎండి జహంగీర్, సాల్మన్ రాజు, ఇర్కం శ్రీను, మడకం దుర్గారావు, స్వామి, ఇర్కం వెంకటేష్, పూసం ప్రసాద్, ట్రస్ట్ సభ్యులు జానీ, వహీద్, నటరాజ్ తదితరులు పాల్గొన్నారు. ఇంటి నిర్మాణ సామగ్రిని అందుకున్న పూసం వెంకటేశ్వర్లు కుటుంబం ట్రస్ట్కు మరియు సహాయపడిన జమాల్ ఖాన్ కు కృతజ్ఞతలు తెలిపారు.

# గంజాయి రహిత ఆంధ్రప్రదేశ్ మా లక్ష్యం

- ఈగల్ విభాగం, డ్రోన్లు జిపిఎస్ తో నిగా పెంపు..
- నార్కోటిక్ కంట్రోల్ కేంద్రాలతో చైతన్య కార్యక్రమాలు...
- పరివర్తన పేరిట గ్రామస్థాయిలో చర్చలు...
- యువత భవిష్యత్తు కోసం గంజాయి నిర్మలనే మార్గం..
- రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి..






<u>దేవీపట్నం/రంపచోడవరం, పెన్ పవర్, జూన్26:</u>

ఆంధ్రప్రదేశ్ను మాదకద్రవ్యాల మచ్చ నుంచి క్లీన్ చేయడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని, గంజాయి నిర్మూలనపై కఠిన చర్యలు తీసుకుంటూ "గంజాయి ఆంధ్రప్రదేశ్" అనే ముద్రను తొలగించి మళ్లీ "అన్నపూర్ణ ఆంధ్రప్రదేశ్"గా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి స్పష్టం చేశారు.

**ఈగల్ విభాగం,టెక్నాలజీ ఆధారిత నిఘా..**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు గంజాయి నిర్మూలన కోసం ప్రత్యేక మంత్రుల కమిటీ ఏర్పాటు చేయడమేకాక, "ఈగల్" అనే ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసి సాగు, రవాణా, వినియోగం ప్రతి దశలో నిఘా పెంచుతున్నామని తెలిపారు. డ్రోన్లు,శాటిలైట్లు, జిపిఎస్ ట్రాకింగ్, ఆధార్ ఆధారిత పర్యవేక్షణ, సీసీ కెమెరాలు వంటి ఆధునిక సాంకేతిక పద్ధతులను వినియోగించి గంజాయి నిర్మూలనకు ప్రభుత్వం నడుబిగించింది.

**గిరిజన ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు....**

అల్లూరి జిల్లా సహా పలు గిరిజన మండలాల్లో గంజాయి సాగు గణనీయంగా తగ్గిందని, మారుమూల గిరిజన గ్రామాల్లో సాగు పూర్తిగా ఆపివేయబడిందని ఎమ్మెల్యే వివరించారు.స్థానిక పోలీసు, రెవెన్యూ అధికారులు గిరిజనులను చైతన్యవంతులుగా మార్చుతూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్పరిణామాలపై గ్రామస్థుల, యువతలో అవగాహన పెంచడమే లక్ష్యమని తెలిపారు.

**ప్రతి జిల్లాలో నార్కోటిక్ కంట్రోల్ కేంద్రాలు...**

ప్రతి జిల్లాలో నార్కోటిక్ కంట్రోల్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు, ప్రతి పోలీస్ స్టేషన్ స్థాయిలో ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, రైతులతో కలిసి "పరివర్తన" పేరిట చర్చలు నిర్వహిస్తున్నామని శిరీష భాస్కర్ తెలిపారు. ప్రజల భాగస్వామ్యం గంజాయి నిర్మూలనలో కీలకం అని అన్నారు.

**స్మగ్లర్ల ఆస్తుల జప్తు – సాగుదారులకు పథకాలు రద్దు...**

గంజాయి సరఫరా చేస్తున్న స్మగ్లర్ల ఆస్తులను ప్రభుత్వం జప్తు చేస్తోందని,సాగుదారులను గుర్తించి వారిని ప్రభుత్వ పథకాల నుండి అనర్హులుగా ప్రకటించేందుకు కూడా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. గతంలో గంజాయి సాగు 11,000 ఎకరాల్లో జరిగితే, ప్రస్తుతం అది 100 ఎకరాలకు తగ్గించబడిందని వెల్లడించారు.

**గంజాయి ఆంధ్రప్రదేశ్గా మార్చిన వైసీపీ పాలన..**

"అన్నపూర్ణ"గా పేరుగాంచిన ఆంధ్రప్రదేశ్ను గత వైసీపీ పాలనలో "గంజాయి ఆంధ్రప్రదేశ్"గా మార్చారన్న ఆరోపణలు చేశారు. గంజాయి సరఫరాలో రాష్ట్రాన్ని రాజధానిగా మార్చిన వారిదే అధికార ముద్ర అని ఆరోపించారు. గత ఐదేళ్లలో మత్తు పదార్థాల బారిన పడి 1,745 మంది యువకులు ఆత్మహత్యలు చేసుకున్నారని, ఇది వైసీపీ పాలనకు అద్దంపడే దుస్థితి అని వ్యాఖ్యానించారు.




**విద్యాసంస్థల పరిధిలోనే గంజాయి విక్రయం...**

గత ప్రభుత్వ పాలనలో పాఠశాలలు, కాలేజీలు, ట్యూషన్ సెంటర్లే మత్తు పదార్థాల కేంద్రాలుగా మారాయని, విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకున్న పాలకులు పాపభాగ్యానికి పాత్రులయ్యారన్నారు. తెనాలిలో గంజాయి కేసులో నిందితులను పరామర్శించిన జగన్మోహన్ రెడ్డి చర్యలను ఆమె తీవ్రంగా తప్పుబట్టారు.మత్తు పదార్థాల నుండి రాష్ట్రాన్ని రక్షించేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములై ముందడుగు వేయాలి. కూటమి ప్రభుత్వం వృద్ధితో పాటు శాంతి భద్రతల పరిరక్షణకు, యువత భవిష్యత్తు కోసం గంజాయి నిర్మూలనకు కట్టుబడి పని చేస్తోంది అని ఎమ్మెల్యే శిరీష భాస్కర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో రంపచోడవరం నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షులు మఠం విజయభాస్కర్, కూటమి ప్రభుత్వం నాయకులు కార్యకర్తలు,అధికారులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# సర్పంచులను గుర్తించారా...?

## మాజీ మంత్రి కొట్టుకు సర్పంచుల ఛాంబర్ ప్రశ్న

<u>తాడేపల్లిగూడెం, పెన్ పవర్, జూన్ 26:</u>

గత వైసిపి ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ సర్పంచులను గుర్తించారా అని తాడేపల్లిగూడెం నియోజకవర్గ సర్పంచుల చాంబర్ ప్రశ్నించింది. గురువారం జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సర్పంచుల ఆత్మీయ సమావేశంలో పలువురు సర్పంచులు మాట్లాడారు. ఆరుగొలను సర్పంచ్ పీతల బుచ్చిబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పంచాయతీలకు ఒక్క రూపాయి గ్రాంట్ కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ నిధులను దారి మళ్ళించారని, ఏనాడు సర్పంచులకు గౌరవం ఇవ్వలేదని తెలిపారు. వాలంటీర్ వ్యవస్థ వల్ల ఇబ్బందులు పడ్డామని తెలిపారు. మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ తనపై వీఆర్వో చేత కేసు పెట్టించిన ఘనత ఆయనకే దక్కుతుందని బుచ్చిబాబు చెప్పారు. ప్రస్తుత ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పై నిందలు వేయవద్దని, అవినీతి జరిగిందని అనుకుంటే నిరూపించాలని ఆయన కోరారు. ఆరుగొలను గ్రామంలో ఉన్న గ్రావెల్ ను అమ్ముకుని కోట్లాది రూపాయలు కొట్టు దండుకున్నారని చెప్పారు. దండగర్ర సర్పంచ్ పిల్లా రాంబాబు మాట్లాడుతూ ఎమ్మెల్యే బొలిశెట్టి వచ్చాక సర్పంచులకు గౌరవం పెరిగిందన్నారు. గ్రామంలో ఇప్పుడే అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతు న్నాయని తెలిపారు. యానాలపల్లి సర్పంచ్ సాయి దేవి మాట్లాడుతూ మూడున్నర సంవత్సరాలు తాను ఎంతో ఆవేదనకు గురయ్యానని చెప్పారు. కె ఎస్ ఎన్ హయాంలో జరిగిన ప్రభుత్వ కార్యక్రమాల్లో సర్పంచులకు ప్రోటోకా లేదన్నారు. ఎమ్మెల్యే బొలిశెట్టి వచ్చాక సీసీ రోడ్లు, తారు రోడ్లు, డ్రైన్లు నిర్మిస్తున్నామని వివరించారు. జట్లపాలెం సర్పంచ్ మణి రాజు మాట్లాడుతూ మాజీ మంత్రి కొట్టు ఏనాడు గౌరవించ లేదని తెలిపారు. అభివృద్ధికి ఏనాడూ సహకరించలేదని చెప్పారు. సర్పంచులకు విలువనిచ్చింది ఎమ్మెల్యే బొలిశెట్టి అని స్పష్టం చేశారు. అప్పారావుపేట సర్పంచ్ ఆరుగొలు శ్రీనివాసరావు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పెన్షన్ ఇచ్చే సమయంలో కూడా సర్పంచులను పిలవలేదని తెలిపారు. ఎమ్మెల్యే




బొలిశెట్టిపై బురద జల్లడం మానుకోవాలని హితవు పలికారు. కొత్తూరు సర్పంచ్ హనుమంతు మాట్లాడుతూ తమ గ్రామంలో గత ఐదు సంవత్సరాల్లో ఏనాడు ఒక్క రూపాయి కేటాయించలేదన్నారు. ఇళ్ల స్థలాలు క్వారీ గోతుల్లో ఇచ్చారని, దీంతో తాను అభ్యంతర వ్యక్తం చేయడంతో ఆగిపోయాయని తెలిపారు. ప్రస్తుతం గ్రామంలో రోడ్లు డ్రైనేజీలు నిర్మిస్తున్నామని వివరించారు. కే.పెంటపాడు సర్పంచ్ పీతల సత్యనారాయణ మాట్లాడుతూ తమ గ్రామానికి మంజూరైన జలజీవన్ మిషన్ నిధులు రాకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ ని అడిగినా ఫలితం లేకుండా పోయిందన్నారు. తమ గ్రామంలో ఉన్న వేణుగోపాల స్వామి దేవాలయానికి సంబంధించిన నిధుల్లో కోటి రూపాయలతో కళ్యాణ మండపం నిర్మాణం చేపట్టారని, ఆ నిర్మాణం ఇప్పటికీ పూర్తి కాలేదని దేవాదాయ శాఖ నిధులు కోటి రూపాయలు ఏమయ్యాయో తెలియకుండా ఉందని వివరించారు. కేఎస్ఎన్ ఏనాడూ సర్పంచులను గౌరవించలేదని చెప్పారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రజలకు స్వేచ్ఛ వచ్చిందని, తమ గ్రామంలో అభివృద్ధి పనులకు 60 లక్షల రూపాయలు ఎమ్మెల్యే బొలిశెట్టి మంజూరు చేశారని వివరించారు. ఈ సమావేశంలో పెంటపాడు, తాడేపల్లిగూడెం మండలంలోని తెలుగుదేశం, జనసేన సర్పంచులు పాల్గొన్నారు.

# మత్తుకు చెక్ - ప్రత్తిపాడు పోలీసుల ప్రతిజ్ఞ ర్యాలీ!

## - నిబంధనలు పాటించాలి, మత్తును తిరస్కరించాలి - సీఐ సూర్య అప్పారావు నేతృత్వంలో అవగాహన కార్యక్రమం

<u>ప్రత్తిపాడు, పెన్ పవర్, జూన్ 26 :</u>

అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రత్తిపాడు సర్కిల్ పరిధిలో మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన ర్యాలీ చేపట్టారు. సర్కిల్ ఇన్స్పెక్టర్ బి. సూర్య అప్పారావు నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు, ఏలేశ్వరం, అన్నవరం, రౌతులపూడి మండలాల ఎస్సైలు, ఎన్సీసీ క్యాడెట్లు, పలు కాలేజీలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్ నుండి అల్లూరి సీతారామరాజు విగ్రహం వరకు సాగిన ఈ భారీ ర్యాలీలో "డ్రగ్స్ వద్దు – ఆరోగ్యం ముద్దు", "డ్రగ్స్ ను తరిమికొడదాం – యువతను కాపాడుదాం" అనే నినాదాలు ప్రతిధ్వనించాయి. అనంతరం వైయస్సార్ సెంటర్ వద్ద మానవహారం ఏర్పాటు చేసి మాదకద్రవ్యాల హానిపై చైతన్య సభ నిర్వహించారు. సీఐ సూర్య అప్పారావు ఈ సందర్భంగా విద్యార్థులకు





ప్రతిజ్ఞ చేయించారు. "ఏ ప్రయోజనం కోసమూ మాదకద్రవ్యాలను వినియోగించము, చట్టవిరుద్ధమైన డ్రగ్స్ను ఎట్టి పరిస్థితుల్లోనూ తాకము" అంటూ ప్రతిజ్ఞ చేయించి, సమాజాన్ని మత్తు మైనసుల నుండి కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు ఎస్. లక్ష్మీకాంతం, ఎన్. రామలింగేశ్వరరావు, శ్రీహరి బాబు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

# జూలై 5న జగ్గంపేటలో మెగా జాబ్ మేళా

**జగ్గంపేట, పెన్ పవర్, జూన్ 26:**
జూలై 5వ తేదీన జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో మెగా జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందని టిడిపి జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ తెలిపారు. జగ్గంపేట నియోజకవర్గంలోని జగ్గంపేట, గండేపల్లి, కిర్లంపూడి, గోకవరం మండలాలలో ఉన్న నిరుద్యోగ యువతకు బంగారు అవకాశం కల్పిస్తూ జ్యోతుల నవీన్ కుమార్ నేతృత్వంలో జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ గుర్తింపు సంస్థ వికాస సౌజన్యంతో జాబ్ మేళా ఏర్పాటు చేస్తున్నారు. 1350 ఖాళీలతో అనేక కంపెనీలు తీసుకొచ్చి నిరుద్యోగ యువతకు ఉద్యోగం అవకాశం కల్పించాలని ఉద్దేశంతో ఈ మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఒక్క నిరుద్యోగి ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉద్యోగావకాశాలు పొందాలని జ్యోతుల నవీన్ తెలియజేశారు.

# ప్రైవేట్ వడ్డీ వ్యాపారస్తులకు వ్యతిరేకంగా పోరాడండి




**జగ్గంపేట, పెన్ పవర్, జూన్ 26:**
జగ్గంపేట పెన్షనర్స్ హోం నందు గురువారం సిపిఐ(ఎంఎల్) జగంపేట అసెంబ్లీ నియోజకవర్గ కార్యదర్శి జక్కంపూడి రాజు అధ్యక్షతన కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు కామ్రేడ్ వి.శంకర్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ బుగతా బంగార్రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా కామ్రేడ్ శంకర్ మాట్లాడుతూ సామ్రాజ్యవాద అమెరికా ఇరాన్ పై బాంబు దాడులకు తెగబడిందని, తూర్పు మధ్య ఆసియా దేశాలపై అజమాయిషీ చెలాయించేందుకు డబ్బు ఆయుధాలు అందిస్తూ ఇజ్రాయెల్ ను వారిపై ఉసిగొల్పుతోందనీ, ఈ దాడులలో పసికందులు, మహిళలతో సహా వేల మంది ప్రజలు మరణిస్తున్నారనీ మరికొన్ని వేల మంది క్షతగాత్రులవుతున్నారనీ తెలిపారు. ఈ దాడులను తీవ్రంగా వ్యతిరేకించాలని తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి బంగార్రావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ ఖగార్ పేరుతో అనేక మంది నాయకులను కార్యకర్తలను ముందస్తుగా నిర్బంధించి ఆ తర్వాత బూటకపు ఎన్ కౌంటర్లు చేస్తుందని, ఈ హత్యలన్నిటిపై న్యాయ విచారణ జరిపించాలి అని డిమాండ్ చేశారు. అలాగే ప్రైవేటు మైక్రో ఫైనాన్స్ కంపెనీల దోపిడీ వల్ల వారి ఒత్తిళ్ల వల్ల గ్రామీణ ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, వారి దోపిడీకి వ్యతిరేకంగా ప్రజలు పోరాడాలని, గ్రామీణ పేదలకు ప్రభుత్వ రంగ బ్యాంకుల ద్వారా వడ్డీ లేని రుణాలు ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లతో భవిష్యత్తులో పోరాటాలు నిర్వహించాలని జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జున్ రావు తీర్మానం చేయగా కమిటీ సభ్యులు ఆమోదించి నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సమావేశంలో దిమ్మిత అప్పారావు, వీరబత్తుల చిన్న అబ్బు, రాయుడు రమణ, నాగులపల్లి అచ్చారావు, పందిరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# గమ్మా ఫౌండేషన్ నిత్యావసర సరుకులు పంపిణీ





**వి.ఆర్.పురం పెన్.పవర్.జూన్.26**
మండలంలోని రామవరం గ్రామపంచాయితీ పరిధిలోని అడవి వెంకన్నగూడెం గ్రామంలో గురువారం గమ్మా ఫౌండేషన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సీ.ఈ.ఓ. దుర్గాప్రసాద్ సూచనల మేరకు రంపచోడవరం నియోజకవర్గ గమ్మా పౌండేషన్ చారిటబుల్ ట్రస్ట్,క్లస్టర్ కో.ఆర్డినేటర్ సొందే సునీల్ కుమార్,సర్పంచ్ కారం బుచ్చమ్మ,మాజీ సర్పంచ్,కుంజా నాగిరెడ్డి,ఎం.సి.ఓ. ముత్తయ్య ఆధ్వర్యంలో 40 కుటుంబాలకు,చింతూరు మండలం ఎర్రంపేట గ్రామంలో 10 కుటుంబాలకు,సర్పంచ్ దారయ్య,సాయిబాబా ద్వారా ఏకవారి గూడెం ఎం.పీ.టీ.సీ.రాజ్ కుమార్ ఆధ్వర్యంలో10 కుటుంబాలకు నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో గమ్మా ఫౌండేషన్ చారిటబుల్ ట్రస్ట్ వి.సి.ఓ.లు ఎం.గంగమ్మ ఎం.రాజు వి.రజిని,యు.రజిని,పి.బాలు పి.శేఖర్ పి.గంగరాజు, ఎం.సి.ఓ.వినోద్, గ్రామస్తులు తదతరులు పాల్గొన్నారు.

# దేవగుప్తంలో ఘనంగా ఆనందరావు పుట్టిన రోజు వేడుకలు

**అల్లవరం, పెన్ పవర్, జూన్ 26**
దేవగుప్తంలో అమలాపురం శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. టీడీపీ నాయకులు పోతుమూడి సురేష్,ముత్తాబత్తుల నాగరాజు ఆధ్వర్యంలో కేక్ కటింగ్ చేసి పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో వేగిరాజు వెంకటరాజు,పోతుల నాగరాజు,గుబ్బల నాగేశ్వరావు,తానేలంక ఏసుబాబు,చిట్టూరి శ్రీను,జోగి ఆంజనేయులు,పచ్చిమాల రమేష్,పోతుల అప్పారావు,రాజేష్ గౌడ్,కందికట్ల రాంబాబు, కొంకి సురేష్,పులిదిండి సత్యనారాయణ, చిట్టిబాబు,నాగిరెడ్డి సత్యనారాయణ, చిట్టిమెను వీరన్న,వెలిగట్ల దుర్గాప్రసాద్,మిద్దె మణికంఠ,పితాని వెంకటేష్,గెడ్డం సూరిబాబు వెలగన సుబ్బారావు,అత్తిలి మురళి,అజ్మీర్,గ్రామకమిటి కొప్పిశెట్టి రామకృష్ణ,చిట్టూరి బులిమంగన్న,తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు,అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



# గ్రామ స్వరాజ్యానికి తూట్లు

**సచివాలయాల్లో సేవలు కనుమరుగు**
**సమయపాలన పాటించని సచివాలయ ఉద్యోగులు**
**ఖాళీ కుర్చీలు దర్శనం**
**డిజిటల్ అసిస్టెంట్ లేక ఇబ్బందులు పడుతున్న ప్రజలు**




**సీతానగరం, పెన్ పవర్, 26:**
ప్రజా సమస్యలను గ్రామస్థాయిలోనే పరిష్కరించేలా గత వైసిపి ప్రభుత్వం గ్రామ స్వరాజ్యం స్థాపన దిశగా సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టింది. ఈ సచివాలయంలో అన్ని శాఖల అధికారులు గ్రామస్థాయిలోనే అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరించేలా చర్యలు వాలంటీర్ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ వచ్చేవారు, అయితే కోటమీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాలంటీర్ వ్యవస్థను ప్రక్కను పెట్టి సచివాలయ ఉద్యోగులచే సేవలు అందిస్తున్నారు. అప్పటినుంచి సచివాలయ వ్యవస్థ గాడి తప్పింది. సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సంఖ్య తగ్గించడంతో పాటు ఆయా సర్వేల పేరుతో ఉద్యోగులు సతమతమవుతూ సెలవులు పెట్టి వెళ్లిన సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి, సమస్యల పరిష్కారం కోసం సచివాలయాల వద్దకు వచ్చిన ప్రజలు కార్యాలయాల్లో ఉద్యోగులు అందుబాటులో లేకపోవడంతో వారికోసం నిరీక్షణతో పాటు ప్రదక్షిణాలు చేయాల్సి పరిస్థితి నెలకొని ఉంది. సీతానగరం మండలంలో పలు సచివాలయాల్లో ఉద్యోగులు కార్యాలయానికి తలుపులు వేసి పత్తాలేకుండా పోయారు. ఆయా సమస్యలపై సచివాలయానికి వచ్చిన ప్రజలు కార్యాలయం వద్ద ఉద్యోగులు లేకపోవడంతో నిరాశ వెనుతిరిగి పెదవలసిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన తల్లికి వందనం పథకంలో పలువురు లబ్ధిదారులు అనర్హుల జాబితాతో ఉండడంతో దీనిని గ్రీవెన్స్ పెట్టుకునేందుకు విద్యార్థులు తల్లితండ్రులు సచివాలయం చుట్టూ పనులు మానుకొని తిరుగుతున్నారు, అంతేకాకుండా రేషన్ కార్డుల ఆదాయ కుల ధ్రువీకరణ పత్రాలు క్యాస్ట్ ఇన్కమ్ పెన్షన్ల కోసం సచివాలయాల వద్దకు వస్తుండడంతో కార్యాలయంలో సిబ్బంది లేకపోవడం వల్ల వారి కోసం గంటలు తరబడి నిరీక్షణ చేసి వెనుతిరుగుతున్నారు, వీటికితోడు గ్రామ సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్ లేకపోవడంతో లబ్ధిదారులకు పని జరగక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు, ఇటీవల మండల పరిధిలో పలు సచివాలయాల్లో ఉద్యోగుల ఉదయం 11:30 గంటలైన సచివాలయం తలుపులు తీయలేదు. ప్రజలు లబ్ధిదారులు సచివాలయం వద్ద పడి కాపులు కావలసిన పరిస్థితి నెలకొంది. కొంతమంది అధికారులు సచివాలయానికి రాకుండానే సర్వే అంటూ సమయపాలన పాటించకుండా వారికి ఇష్టం వచ్చిన సమయానికి వస్తున్నారు, ఇప్పటికైనా అధికారులు స్పందించే గ్రామ సచివాలయ వ్యవస్థను గాడిలో పెట్టి సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమయపాలన పాటించాలని దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు, అదేవిధంగా సచివాలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నారు,

# గ్రామ సర్వేల రిలే దీక్షకు మద్దతు..

**అడ్డతీగల ,పెన్ పవర్ ,జూన్ 26**
గ్రామ సర్వేలకు గడచిన ఆరేళ్లుగా ఎటువంటి పదవున్నతలు కానీ సీనియారిటీ లిస్ట్ ,టెక్నికల్ పే స్కేల్ పాదదర్శక బదిలీలు కానీ హేతుబద్ధీకరణ విషయంలో గ్రామ సర్వేలకు తగు న్యాయం చేయాలని, ఆంధ్రప్రదేశ్ గ్రామ సర్వేల సంఘం ఈనెల 25 వ తేదీ నుండి మూడు రోజులపాటు విజయవాడలో రిలే దీక్షల పిలుపుమేరకు అడ్డతీగల మండల గ్రామ సర్వేలు రిలే దీక్ష, సభలకు మద్దతు తెలుపుతూ అడ్డతీగల డిప్యూటీ తాసిల్దార్ తేజస్వినికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో అడ్డతీగల మండలం గ్రామ సర్వేర్లు పాల్గొన్నారు.



# మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి




**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, జూన్ 26:**
మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని స్థానిక ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ కోరారు. వీటినిసేవించడం వల్ల కలిగే దుష్ప్రభావాలు గురించి వివరించారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ విద్యార్థిని విద్యార్థులు స్వచ్ఛంద సంస్థలు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. పోలీస్ శాఖ ఈ ర్యాలీ ఏర్పాటు చేసింది. భారీ ర్యాలీలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విప్ , శాసనసభ్యులు శ్రీనివాస్, భవన నిర్మాణ కార్మికుల చైర్మన్ వలవల బాబ్జి , డి.ఎస్.పి విశ్వనాథ్ పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. ఆర్టీసీ బస్టాండ్ దగ్గర నుండి పోలీస్ ఐలాండ్ వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం జూన్ 26న ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని జరుపుకుంటారని తెలిపారు. మాదకద్రవ్యాల వినియోగం శారీరక, మానసిక, సామాజిక పరంగా వ్యక్తి, కుటుంబం, సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతుంద న్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా షగంజాయి నిర్మూలనకు ఈగల్ డిపార్ట్మెంట్ నెలకొల్పి గంజాయిను మూలాలతో సహా రూపుమాపే విధంగా చర్యలు తీసుకుంటు న్నామని చెప్పారు. గంజాయి కి ఒకసారి అలవాటు పడితే అది జీవితాన్ని నాశనం చేసే స్థాయికి వెళ్లే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. గంజాయి నిర్మూలనకు సహాయం చేసే సంఘ వ్యతిరేక శక్తులను ఈగల్ డిపార్ట్మెంట్ రూపుమాపు తుందని వీరికి సహాయంగా అన్ని శాఖలు పనిచేస్తాయని తెలిపారు. విద్యార్థులు ఈ మార్గాలకు దూరంగా ఉండాలని, తమ కలలు, లక్ష్యాలను పరిరక్షించుకోవాలని సూచించారు. తల్లితండ్రులు ప్రతిక్షణం తమ పిల్లలను గమనించాలని, సంఘ విద్రోహకారుల వలలో మొబైల్ ద్వారా పడనీయకుండా జాగ్రత్త తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల్లో చట్టపరమైన అవగాహనను పెంపొందించడంతో పాటు, సమాజానికి హానికరమైన వ్యసనాలకు వ్యతిరేకంగా ధైర్యంగా నిలబడే ధృడమైన మానసిక స్థైర్యాన్ని అందించడమేనని వివరించారు. ఈ కార్యక్రమంలో సీఐ ఆది ప్రసాద్, రూరల్ సీఐ రమేష్, మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు, ఎమ్మార్వో సునీల్, వర్తనపల్లి కాశి, పుల్లా బాబి, అడపా ప్రసాదు, జనసేన తెలుగుదేశం బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# డ్రగ్స్ వద్దు ఆరోగ్యం ముద్దు

మాదకద్రవ్యాలను తరిమికొడదాం యువతను కాపాడదాం

అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ



**చింతూరు,పెన్ పవర్, జూన్ 26:**
అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని చింతూరు గ్రామంలో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి అపూర్వ భారత్, ఐఏఎస్, సబ్ డివిజన్ ఎస్డీపీఓ, అదనపు ఎస్పీ పంకజ్ కుమార్ మీనా, హాజరయ్యారు. ఈ అవగాహన ర్యాలీలో పోలీస్, రెవెన్యూ, మెడికల్, ఎక్సైజ్, అటవీ, విద్యా శాఖల అధికారులు, పాఠశాల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఐటిడిఏ కార్యాలయం నుంచి చింతూరు మెయిన్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించబడింది. డ్రగ్స్ వద్దు ఆరోగ్యం ముద్దు, మాదకద్రవ్యాలను తరిమికొడదాం యువతను కాపాడదాం, వంటి నినాదాలతో ర్యాలీలో పాల్గొన్నవారు గ్రామస్తులకు అవగాహన కల్పించారు.ర్యాలీ అనంతరం చింతూరు మెయిన్ సెంటర్లో మానవహారం ఏర్పాటు చేయబడింది. ఈ సందర్భంగా అధికార ప్రముఖులు, ప్రజలు,





విద్యార్థులను ఉద్దేశించి మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే ప్రమాదాలను వివరించారు. యువతను మాదకద్రవ్యాల ప్రభావం నుండి దూరంగా ఉంచేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, అలాగే ఈ నిర్మూలనలో యువత పాత్ర గురించి స్పష్టంగా వివరించారు.ఈ అవగాహన కార్యక్రమం గ్రామస్థుల నుండి విశేష స్పందన పొందింది. ఈ కార్యక్రమంలో అధికారులు స్టూడెంట్స్ ప్రజలు మీడియా వర్గం తదితరులు పాల్గొన్నారు.

## డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనంపై బీజేపీ మండల అధ్యక్షుడు శివాజీ సంతృప్తి

**కాజులూరు, పెన్ పవర్,జూన్ 26:**
ప్రముఖంగా ప్రవేశపెట్టిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం విద్యార్థులకు మెరుగైన ఆహారాన్ని అందిస్తోందని కాజులూరు బీజేపీ మండల అధ్యక్షుడు పుణ్య మంతుల శివాజీ అన్నారు. కాజులూరు మండలంలోని మంజేరు గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఆయన పథకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా భోజనానికి ఉపయోగిస్తున్న నాణ్యమైన బియ్యం, వంట సరుకులు, వండే విధానం తదితర అంశాలపై సమీక్షించి, సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో భోజనం చేస్తున్న విద్యార్థుల ఉత్సాహాన్ని గమనించి, వారు ఆనందంగా, ఆరోగ్యంగా ఉన్నారని తెలిపారు.శివాజీ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ అభిప్రాయంతో మధ్యాహ్న భోజన పథకాన్ని డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంగా నామకరణ చేసి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నారు. ఇది విద్యార్థులకు మంచి పోషకాహారం అందించే దిశగా బలమైన చర్యగా నిలుస్తోంది," అని అన్నారు.ఈ పర్యటన ప్రధానమంత్రి 11 ఏళ్ల పాలన అమృతకాలం సేవా సుపరిపాలన కార్యక్రమాల భాగంగా నిర్వహించ బడినదని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పిఠాపురం జనసేన నాయకుడు పిఎస్ఎన్ మూర్తి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



# గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ తొలి ప్రాధాన్యత

రూ.30.8 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించిన మంత్రి వాసంశెట్టి సుభాష్

మెయిన్ సీసీ రోడ్డులో మట్టి ఫిల్లింగ్ పనులకు మంత్రి ఆదేశం





**కాజులూరు, పెన్ పవర్ ప్రతినిధి జూన్ 26:**
గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కూటమి ప్రభుత్వం దృఢ సంకల్పంతో ముందుకెళ్తుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు.కాజులూరు గ్రామ అభివృద్ధికి రూ.30.8 లక్షల నిధులతో నిర్మించిన నాలుగు సిమెంట్ కాంక్రీట్ (సీసీ) రోడ్లను గురువారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు.ఈ రోడ్ల నిర్మాణానికి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్) నిధులు వినియోగించారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ %-% "ప్రతి గ్రామానికి అభివృద్ధి చెందే అవకాశం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యంగా ఉంది.దశలవారీగా మౌలిక సదుపాయాలు అందించేందుకు కృషి చేస్తున్నాం. ప్రజల నిత్యవసర సదుపాయాలపై ప్రాధాన్యతగా దృష్టి సారిస్తున్నాం," అని పేర్కొన్నారు.ఇదే సందర్భంగా శ్రీరామ్ నగర్ కాలనీలో రూ.19 లక్షలతో నిర్మాణంలో ఉన్న మరికొన్ని అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు.అలాగే, ఇటీవల నిర్మించిన శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయాన్ని సందర్శించిన మంత్రి సుభాష్‌ను కాలనీవాసులు ఘనంగా సత్కరించారు.అలాగే కాజులూరు ప్రధాన సీసీ రోడ్డు వద్ద ఉన్న గోవులను మంత్రి పరిశీలించారు.తక్షణం మట్టి ఫిల్లింగ్ చేయించాలంటూ ఎంపీడీవో, కార్యదర్శులను మంత్రి ఆదేశించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దండంగి సరోజ, పంచాయతీ కార్యదర్శి కె.ఈశ్వరి, ఎంపీడీవో జె.రాంబాబు, తహసీల్దార్ జి.రవీంద్రనాథ్ ఠాగూర్, పంచాయతీరాజ్ జేఈ శేఖర్, ఏపీవో బి.వెంకటలక్ష్మి, ఆర్ఐ పి.వేగేశ్వరరావు, ఎస్ఐ మోహన్ కుమార్, కూటమి నాయకులు చవ్వాకుల డాక్టర్ బాబు, అన్యం శ్రీరామ్, మేడిశెట్టి పెద్ద, చంద్రు వీర్రాజు చౌదరి, నక్క శ్రీను, అంగర కృష్ణ, కోమలి వెంకటరమణ, వనుం వీరబ్రహ్మం, యాళ్ల కృష్ణారావు, సలాది వీరబాబు, చోడిశెట్టి శ్రీను, పేపకాయల బాబ్జి, జ్యోతి కుమార్, స్వామి, దడాల నాగార్జున, రెడ్డి శేషారావు, పలివెల రాజు, శ్రీనివాసరావు, చందాల బాబి, వీఆర్వోలు,సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదపు మలుపులలో వేగనిరోధక డ్రమ్ములు ఏర్పాటు చేసిన పోలీసులు

**వై రామవరం, పెన్ పవర్, జూన్ 26 :**
వై రామవరం పోలీస్ స్టేషన్ పరిధిలో అతి ప్రమాదకర మలుపులలో పోలీసులు వేగనిరోధక ఏర్పాటు చేయడం జరిగిందని స్థానికులు తెలిపారు. వివరాల్లోనికి వెళితే ఈ మధ్యకాలంలో పనసల పాలెం చవిటి దిబ్బలు గ్రామాల మధ్యలో పనస చెట్టు మలుపు వద్ద ప్రమాదం సంభవించిన ప్రతి ఒక్కరూ చనిపోయారని స్థానికులు తెలిపారు. ఈనెల 22వ తేదీన పెన్ పవర్





దినపత్రికలో వెలువడిన ఆ మలుపులు ప్రమాద ఘంటికలు కథనంపై పోలీసులు స్పందించి పనస చెట్టు మలుపు వద్ద, కోకిత గొంది మలుపు వద్ద వేగ నిరోధక డ్రమ్ములను పోలీసులు ఏర్పాటు చేయడం జరిగిందని స్థానికులు తెలిపారు. మండలంలో ఉన్న అత్యంత ప్రమాదకరమైన ఏడు మలుపులలో కూడా వేగనిరోధక డ్రమ్ములను తొలగించకుండా చూడవలసిన బాధ్యత ఎంతైనా ఉందని స్థానికులు కోరుతున్నారు. ఇకనైనా పోలీస్, రెవెన్యూ సిబ్బంది స్పందించి అత్యంత ప్రమాదకరమైన మలుపులలో వేగనిరోధకాలను ఏర్పాటు చేసి పర్యవేక్షించవలసిన బాధ్యత ఎంతైనా ఉందని స్థానికులు కోరుతున్నారు.

# నియోజకవర్గంలో చివరి ఎకరా వరకు రైతుకు సాగు నీరందిస్తాం: ఎమ్మెల్యే సత్య ప్రభ





**ఏలేశ్వరం, పెన్ పవర్, జూన్ 26:**
నియోజకవర్గంలో చట్ట చివరి ఎకరాకు రైతుకు సాగునీరు అందిస్తామని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. ఏలేశ్వరం మండల పరిధిలో లింగంపర్తి, ఏలేశ్వరం పట్టణంలో పంట కాలువల పూడుకుతీత పనులకు కొబ్బరికాయ కొట్టి గురువారం పనులు ప్రారంభించారు. సిరిపురం గ్రామంలో వాటర్ ట్యాంక్ నిర్మాణానికి భూమి పూజ చేసి అభివృద్ధి పనులకుఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కూడికతీత పనులకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో రైతాంగ సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. గత వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో చేసిన తప్పిదాల వల్ల, రైతాంగం యోగక్షేమాలు జగన్మోహన్ రెడ్డి పక్కన పెట్టడం వల్ల పంట కాలవలు పూడికితీతలు తీయక, తుప్పలు డొంకలు, చెత్త చెదారంతో మూసుకుపోయాయని రైతుకు సాగునీరు అందించే పరిస్థితి లేదన్నారు. ఇట్టి పరిస్థితుల్లో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నియోజకవర్గం లో పంట కాలువల పూడుక తీతల కోసం 2 కోట్ల 28 లక్షల నిధులను మంజూరు చేయించడం జరిగిందన్నారు. ప్రతిపాడు నియోజకవర్గంలో సుబ్బారెడ్డి సాగర్ ఆయకట్టు అన్ని పంట కాలువలలో పూడుకు తీసేందుకు 66 లక్షలు రూపాయలు, తిమ్మరాజు చెరువు ఆయకట్టుకు 38 లక్షలు, దీనిలోఏలేశ్వరం ఆయకట్టు లో ఉన్న పంట కాలువల పూడుకు తీతకు 10 లక్షల 85 వేల రూపాయలు, అనగా తిమ్మరాజు చెరువు పంట కాలువలలో ఐదున్నర కిలోమీటర్ల కాలువలలో పూడికతీతకు 5 లక్షల 50 వేలు, మిగతా సొమ్ము లింగంపర్తి వంటకాలకు పూడిక తీతలకు మంజూరైనట్లు ఎమ్మెల్యే తెలిపారు. పంట కాలవల పూడిక తీత పనులను ఆయా ఆయకట్టు వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు అప్పగించామన్నారు. అలాగే పుష్కర కాలువల అభివృద్ధికి 80 లక్షలు, శంఖవరం చెరువు అభివృద్ధికి 33 లక్షల రూపాయలు ప్రభుత్వం మంజూరు చేయడం జరిగిందన్నారు. వాతావరణ శాఖ ఇచ్చిన సమాచారం మేరకు నైరుతి రుతుపవనాలు రాష్ట్రమంతా చురుగ్గా సాగుతున్నాయని, ఇకనుంచి జిల్లాలో భారీ వర్షపాతం నమోదు అవుతుందని ఎన్ ఎం డి నివేదికలు ఇచ్చిందన్నారు. ఇది రైతులు సంతోషించదగ్గ విషయమని, కాలువల



నిర్మాణం వేగవంతంగా పూర్తి చేసి నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో చిట్ట చివరి రైతుకు సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమాలలో ఎమ్మెల్యే వెంట ఎన్డీఏ కూటమి నాయకులు పెంటకోట మోహన్, మేడిశెట్టి బాబి, ఏలేశ్వరం ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, నీటి సంఘం అధ్యక్షులు ఎస్ జీవీ సుబ్బరాజు, సామంతుల భాస్కరరావు, నగర పంచాయతీ కౌన్సిలర్ చలమయ్య, బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, మాజీ జెడ్పిటిసి జ్యోతుల పెదబాబు, సూతి బూరయ్య, ఎండగుడి నాగబాబు, బుద్ధ ఈశ్వర రావు, కారణం సుబ్రహ్మణ్యం, పలివెల శ్రీనివాస్, జిగటాపు సూరిబాబు, బస్సా ప్రసాద్, రైతులు, పలువురు కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### కాకినాడ జిల్లాను మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా

# మార్చడమే లక్ష్యం : కలెక్టర్ షణ్మోహన్

## అంతర్జాతీయ మాదక ద్రవ్య వ్యతిరేక దినం..బహిరంగ ప్రతిజ్ఞ కార్యక్రమాలు





**కాకినాడ, పెన్ పవర్ స్టాఫర్, జూన్ 26:**
జిల్లాను మాదక ద్రవ్యాల రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ ముందుకొచ్చి సంఘ బాధ్యతగా పోరాటం చేయాలని కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ప్రజలకు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదక ద్రవ్య వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకొని గురువారం సాయంత్రం జిల్లా కేంద్రంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమాల్లో భాగంగా జిల్లా ఎస్పీ కార్యాలయం నుండి భానుగుడి కూడలి వరకు మాదక ద్రవ్యాల వ్యతిరేకంగా భారీ ర్యాలీ నిర్వహించబడింది. కలెక్టర్ షణ్మోహన్ , ఎస్పీ జి.బిందుమాధవ్, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, ఎమ్మెల్యే పంతం నానాజీ ర్యాలీకి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం భానుగుడి కూడలిలో విద్యార్థులు, యువత, తల్లిదండ్రులు, ఉద్యోగులతో మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ "డ్రగ్స్ వినియోగం యువత జీవితాలను నాశనం చేస్తోంది. వాటిని విక్రయించేవారిని, వాడే వారిని ఉక్కుపాదంతో అణచివేస్తాం. విద్యార్థులెవరైనా డ్రగ్స్ వాడినట్టు తెలిసితే వారి కళాశాలలలో పేరెడ్ చేయిస్తాం. తల్లిదండ్రులు, విద్యాసంస్థలు అప్రమత్తంగా ఉండాలి. డ్రగ్స్ సమాచారం అందించిన వారికి నెలకు ఒకరికి రూ.50,000 నగదు బహుమతి, ప్రశంసాపత్రం అందజేస్తాం. సమాచారం ఇచ్చే వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం.సమాచారానికి 1972, 14405 టోల్ ఫ్రీ నెంబర్లు లేదా 9494933233 వాట్సాప్ నెంబరుకు సంప్రదించవచ్చు," అన్నారు. కలెక్టర్ వివరించిన వివరాల ప్రకారం, గత సంవత్సరం కాలంలో జిల్లాలో 2060 కిలోల గంజాయి (రూ. 2.60 కోట్ల విలువ)ను సీజ్ చేసి 46 కేసులు నమోదు చేశారు. మొత్తం 139 మందిని అరెస్టు చేశారు. అలాగే 747 అవగాహన కార్యక్రమాల ద్వారా 47,158 మందికి డ్రగ్స్ దుష్పరిణామాలపై విద్య కల్పించారు. జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ మాట్లాడుతూ "డ్రగ్స్ వినియోగం యువతను దారి తప్పించేస్తోంది. ఎన్ డీ పీ ఎస్ చట్టం ప్రకారం స్వల్ప పరిమాణం అయినా పట్టుబడితే 6 నెలల జైలు శిక్ష తప్పదు. దీనివల్ల వారి భవిష్యత్తు నాశనం అవుతుంది. పోలీసులు డ్రగ్స్ అరికట్టడమే కాక, రిహాబిలిటేషన్ కార్యకలాపాలకు కూడా చర్యలు తీసుకుంటున్నారు" అని తెలిపారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ మాట్లాడుతూ "డ్రగ్స్ నిర్మూలనకు ప్రభుత్వం మాత్రమే కాదు, సమాజంలోని ప్రతి ఒక్కరూ భాగస్వాములై ముందుకు రావాలి" అని పిలుపునిచ్చారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే పంతం నానాజీ మాట్లాడుతూ "గత ఐదేళ్లలో జిల్లాలో మత్తుపదార్థాల విస్తృత వ్యాప్తిని నియంత్రించడంలో పోలీసు శాఖ చేసిన కృషి ప్రశంసనీయమైనది. ప్రజలందరూ డ్రగ్స్ సమాచారాన్ని అధికారులకు వెంటనే అందించాలి" అని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ రేణుక, ఎక్సైజ్ సూపరింటెండెంట్ కృష్ణకుమారి, డిఆర్ఓ జె.వెంకట్రావు, డిఎంహెచ్ఓ డా.జె.నరసింహనాయక్, జిజిహెచ్ సూపరింటెండెంట్ డా.లావణ్య కుమారి, ఐఎంఏ ప్రెసిడెంట్ డా.యం.పవన్ కుమార్, డ్రగ్స్ నోడల్ అధికారి డా.వరప్రసాద్,విద్యార్థులు, విద్యాసంస్థలు,పురపౌరులు తదితరులు పాల్గొన్నారు.





## డ్రగ్స్ వద్దు- బంగారు భవిష్యత్తు ముద్దు



**అమలాపురం పెన్ పవర్ జూన్ 26:**
డ్రగ్స్ వద్దు బంగారు భవిష్యత్తు ముద్దు అని ఎక్సైజ్ సూపర్డెంట్ అమర్ బాబు పేర్కొన్నారు. స్థానిక మిరియం జూనియర్ కాలేజ్ ,ఒకేషనల్, డిగ్రీ కాలేజ్ అమలాపురం కాలేజ్ విద్యార్థులు కళాశాల సిబ్బందికి డ్రగ్స్ వాడకం వలన కలిగే దుష్పర్మనాలు గురించి తెలియచేయడమైనది. ఈ కార్యక్రమంతో జూనియర్ ఒకేషనల్ డిగ్రీ కాలేజ్ విద్యార్థిని విదార్థులు , ఎక్సైజ్ సీఐ వీటివివి సత్యనారాయణ, ఎక్సైజ్ సిబ్బంది, లేడీ కానిస్టేబుల్స్ ,సత్యనారాయణ,నాగేంద్ర కుమార్, నాగేశ్వర్ కానిస్టేబుల్స్ నానాజీ,బాలాజి, లు తదితరులు పాల్గన్నారు.

### మత్తు పదార్థాలు సేవించడం,

# రవాణా చేయడం నేరం, శిక్షార్హమైనది

### ఎస్సై రామలింగేశ్వరరావు.

**ఏలేశ్వరం, పెన్ పవర్, జూన్ 26:**
అంతర్జాతీయ మాదక ద్రవ్య దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో గురువారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి సునీత అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఏలేశ్వరం ఎస్సై ఎన్ రామలింగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వాడకం వల్ల కలిగే అనర్థాల గూర్చి విద్యార్థులకు వివరించారు. మాదక ద్రవ్యాలు తీసు కొన్న వ్యక్తులకు గుండె జబ్బులు, కాలేయ వ్యాధులు, ఊపిరితిత్తుల సమస్యలు, మానసిక సమస్యలు వంటి ఎన్నో వ్యాధులకు దారితీస్తాయని , శరీరంలో రోగనిరోధక శక్తి తగ్గిపోతుందని అన్నారు . ఈనాటి యువతరాన్ని దారి మళ్ళించి చెడు మార్గాల్లో నడిపిస్తున్న దురలవాట్లలో మాదక ద్రవ్యాల వినియోగం తీవ్రమైనది. ధూమపానం, మద్యపానం వంటి వ్యసనాల కన్నా తీవ్రమైన ప్రభావం చూపిస్తున్నాయని, మాదక ద్రవ్యాలలో వివిధ రకాలు న్నాయని నల్లమందు, మార్ఫిన్, హెరాయిన్, చరస్, గంజాయి, మారిజువానా, కొకైన్, ఎల్.ఎస్.డి. మొదలైనవి ముఖ్యమైనవని వీటికి అలవాటు పడిన విద్యార్థులు, యువకులు చదువులు వదిలి సర్వస్వం కోల్పోయి నిర్భాగ్యులౌతున్నారు. ఒకసారి దీనికి బానిసలైన తర్వాత వీటిని సంపాదించడానికి ఎంతటి అకృత్యాలు, నేరాలు చేయడానికి వెనుకాడరని , మాదకద్రవ్యాల జోలికి వెళ్లకుండా ఉండడం చాలా ముఖ్యం అన్నారు. ముఖ్య అతిథి ఏలేశ్వరం ఎస్సై మాట్లాడుతూ మాదకద్రవ్యాల వాడకం వల్ల జరిగే నష్టాలను విద్యార్థులకు ఉదాహరణలతో తెలియజేస్తూ, మాదక ద్రవ్యాలను సరఫరా చేసేవారు యుక్త వయస్కులను లక్ష్యంగా చేసుకుంటారని, మాదక ద్రవ్యాల సరఫరా ఒక చెయిన్‌లా సాగుతుందని చెప్పారు. రద్దీగా ఉండే ప్రాంతాల్లో ఉండే కిళ్లీ దుకాణాలు, కాఫీ షాపుల, మరి ఇతర దుకాణాల ద్వారా మత్తు పదార్థాలు సరఫరా సాగుతూ ఉంటుందని సాధారణంగా సిగరెట్లు,ఆల్కహాల్ ద్వారా మాదక ద్రవ్యాలను తీసుకోవడం మొదలవుతుందని ఒక్క సారి ఈ రంగం లోకి దిగిన యువత యొక్క భవిష్యత్ సర్వ నాశనం అవుతుందని అన్నారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని కోరారు. ఎవరైనా మాదకద్రవ్యాలు తీసుకున్నా, రవాణా చేసిన చట్టప్రకారంగా కఠినమైన శిక్షలు ఉంటాయని అన్నారు. మాటకద్రవ్యాల వినియోగం, రవాణా వంటి విషయాలు తెలిస్తే వెంటనే ఏలేశ్వరం పోలీస్ స్టేషన్కు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్సై తెలిపారు.








యన్.యస్.యస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా. ప్రయాగ మూర్తి ప్రగడ మాట్లాడుతూ యువత చెడు మార్గం లోకి వెళ్ళడం వల్ల కుటుంబాలు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులకు గురవ్వడమే కాకుండా సమాజంలో విలువను కోల్పోయి, మానసిక క్షోభకు గురై ఆత్మహత్యాలకు దారితీస్తుందని అన్నారు. యన్.యస్.యస్ వాలంటీర్లు భాద్యత వహించి ఎక్కడైన మాదక ద్రవ్యాల సమాచారం ఉంటే స్థానికి పోలీసులకు తెలియజేసి సమాజ శ్రేయస్సు, దేశ అభివృద్ధిలో పాల్గొనాలని కోరారు. వైస్ ప్రిన్సిపల్ కె. వెంకటేశ్వర రావు మాట్లాడుతూ యువత చదువు పై మాత్రమే దృష్టి పెట్టాలని చెడు వ్యాసనాలకు దూరంగా ఉండాలి అన్నారు. అనంతరం విద్యార్థుల చేత మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమలో అధ్యాపకులు వి. రామారావు , కె సురేష్ , డా.య స్ కె మదీనా, డా. శివ ప్రసాద్ , బి వీరభద్ర రావు, శ్రీలక్ష్మి , డా. బంగార్రాజు, పుష్ప , మేరీ రోజలిన , రాజేష్, సతీశ్, ఆఫీస్ సిబ్బంది కళాశాల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

### మైక్రో ఫైనాన్స్ దోపిడీకి వ్యతిరేకంగా

# ప్రజలు పోరాటానికి సిద్ధమవ్వాలి

### కామ్రేడ్ శంకర్






**ప్రత్తిపాడు, పెన్ పవర్, జూన్ 26 :**
ప్రైవేట్ మైక్రో ఫైనాన్స్ కంపెనీల దోపిడీ నుంచి గ్రామీణ ప్రజలను విముక్తి చేయాలంటే ఉద్యమం అవసరమని సిపిఐ (ఎంఎల్) పొలిట్ బ్యూరో సభ్యుడు కామ్రేడ్ వి. శంకర్ పిలుపునిచ్చారు. ప్రత్తిపాడులోని పార్టీ కార్యాలయంలో మండల కార్యదర్శి కామ్రేడ్ ఎం. లచ్చబాబు అధ్యక్షతన నిర్వహించిన సిపిఐ (ఎంఎల్) మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన శంకర్, సామ్రాజ్యవాద అమెరికా మద్దతుతో ఇజ్రాయెల్ ఇరాన్‌పై దాడులు చేస్తున్నాయని, ఈ విధ్వంసక చర్యల్లో పసికందులు, మహిళలతోపాటు వేలాది అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అటువంటి దాడులకు ప్రతిఒక్కరు గళమెత్తాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ బుగతా బంగార్రావు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం "ఆపరేషన్ ఖగార్" పేరిట ఉద్యమ నేతలను ముందస్తుగా అరెస్టు చేసి, ఆ తర్వాత బూటకపు ఎన్‌కౌంటర్లు నిర్వహిస్తోందని ఆరోపించారు. ఈ హత్యలపై న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ మైక్రో ఫైనాన్స్ సంస్థల అధిక వడ్డీ, బెదిరింపుల వల్ల గ్రామీణులు తీవ్రంగా నలుగుతున్నారని, ప్రభుత్వ రంగ బ్యాంకుల ద్వారా వడ్డీలేని రుణాలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ అంశాలపై భవిష్యత్‌లో ఉద్యమాలు నిర్వహించాలని తీర్మానించారని మండల కార్యదర్శి లచ్చబాబు తెలిపారు. ఈ సమావేశంలో రేచుకట్ల సింహాచలం, తాడి నాగేశ్వరరావు, మాస రాజమణి, చిన్నం అర్జునుడు, రాజల రత్నం, బీరా దేవతయ్య తదితరులు పాల్గొన్నారు.

### విద్యాసంస్థలలో మాదక ద్రవ్యాలపై

# అవగాహన కార్యక్రమం





**కాకినాడ, పెన్ పవర్, జూన్ 26:**
అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం జగన్నాథపురం లోని ఎమ్.ఎస్.నాయకర్ జూనియర్ కళాశాల లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థి యువత డ్రగ్స్ నుంచి దూరంగా ఉండాలని, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ముందుండాలని కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.విజయకుమారి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ "మాదక ద్రవ్యాలు మెదడు, నాడీ మండల వ్యవస్థలను తీవ్రంగా దెబ్బతీస్తాయి. విద్యార్థుల జీవితం, కుటుంబాలు, మానవ సంబంధాలు, సామాజిక వ్యవస్థలు కూడా తీవ్ర ప్రభావానికి లోనవుతాయి. యువశక్తి సద్వినియోగానికి డ్రగ్స్ పెద్ద అడ్డంకిగా మారుతున్నాయి. ప్రతి విద్యార్థి అప్రమత్తంగా ఉండాలి. డ్రగ్స్ మహమ్మారిని సమాజం నుంచి పారదోలే బాధ్యత అందరిపై ఉంది" అని చెప్పారు. అనంతరం సివిక్స్ అధ్యాపకులు చిట్టూరి చిట్టిబాబు ఆధ్వర్యంలో విద్యార్థులు "నషా ముక్త భారత్ కై ప్రతిజ్ఞ" చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# ఏపీఎస్ ఆర్టీసీ బస్సు పాసుల మేళ

## -విద్యార్థిని,విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి




**కూనవరం,పెన్ పవర్,జూన్ 25.**

ఏపీఎస్ ఆర్టీసీ గోకవరం డిపో వారు కూనవరం బస్ స్టేషన్ నందు ఈనెల 27,28 తేదీలలో విద్యార్థినీ, విద్యార్థులకు బస్సు పాసుల మేళ నిర్వహిస్తున్నామని ప్రకటన ద్వారా తెలిపారు.మండలంలోని గ్రామా ప్రజలందరూ ఈ బస్సు పాస్ మేళ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.పి హెచ్ సి పాసులు,ఉచిత పాసులు,మనీ,మంత్లీ,సీజన్ పాసులు ఇవ్వబడునని తెలిపారు.ఉచిత పాస్ లకు కావలసినవి ఒక ఆధార్ కార్డు జిరాక్స్ ఒకటి,ఒక పాస్ కు 50 రూ రుసుము కట్టాలని తెలిపారు.పి హెచ్ సి పాస్ కు కావలసినవి వైద్యులు ఇచ్చినటువంటి సదరన్ సర్టిఫికెట్ జిరాక్స్ ఒకటి,ఆధార్ కార్డు జిరాక్స్ ఒకటి,సంబంధిత వారి యొక్క ఫుల్ పాస్ ఫోటో ఒకటి,100 రూ ఇవ్వాలని తెలిపారు.సీజన్ పాస్ కు కావలసినవి ఒక పాస్ ఫోటో ఒకటి,ఆధార్ కార్డు జిరాక్స్ ఒకటి సంబంధిత ఆర్టీసీ అధికారులకు అందజేయాలని తెలిపారు.

## ఆపరేషన్ సింధూర్ దేశ

# ఆత్మగౌరవం పెంచింది

## పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప






**పెద్దాపురం, పెన్ పవర్, జూన్ 26:**

పహాల్గామ్ ఉగ్రవాదానికి వ్యతిరేకంగా చేపట్టిన ఆపరేషన్ సింధూర్ దేశ ఆత్మగౌరవాన్ని, ధైర్యాన్ని పెంచిందని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. ఆపరేషన్ సింధూర్ యుద్ధంలో పాల్గొన్న పెద్దాపురం పట్టణానికి చెందిన సుబేదార్ వినోద్ దడాలకు నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఆయన డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు)తో కలిసి ఆయన గురువారం పాల్గొన్నారు. ముందుగా సుబేదార్ వినోద్ దడాలను పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ భారతదేశం సైనిక శక్తిలోనే కాదు ఆర్థిక శక్తిలోనూ దూసుకుపోతోందని, 2047 నాటికి ప్రపంచంలో నంబర్ వన్ లేదా నంబర్ టు స్థానంలో నిలవడం ఖాయమన్నారు. పహల్గాం లాంటి సంఘటనలు పునరావృతం అయితే ఆపరేషన్ సింధూర్ లాంటివి పునరావృతం అవుతాయన్నారు. ఉగ్రవాదంపై మన రక్షణ దళాలు చేస్తున్న పోరాటానికి సెల్యూట్ చేస్తున్నానన్నారు. ప్రపంచం గర్వించదగ్గ త్రివిధ దళాలు మన సొంతమని చెప్పుకోవడానికి గర్విస్తున్నానన్నారు. పెద్దాపురం పట్టణానికి చెందిన వినోద్ ఆపరేషన్ సింధూర్ యుద్ధంలో పాల్గొనడం గర్వకారణమన్నారు. అనంతరం వినోద్ ఇంటి వరకు మేళతాళాలతో భారీ ర్యాలీగా తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు రాజా సూరిబాబు రాజు, తూతిక రాజు, మహ్మద్ ఆరిఫ్ అలీ, పొలమరశెట్టి సత్తిబాబు, నూనే రామారావు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీలో సర్పంచ్ తుమ్మలపల్లి సాయి గుణశేఖర్

**కిర్లంపూడి, పెన్ పవర్, జూన్ 26:**

కిర్లంపూడి మండలం రామచంద్రపురం ప్రభుత్వ పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రామచంద్రపురం గ్రామ సర్పంచ్ తుమ్మలపల్లి సాయి గుణశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు అందరికి విద్యార్థి మిత్ర కిట్ లను పంపిణి చేసారు. ఈ సందర్భంగా సర్పంచ్ తుమ్మలపల్లి సాయి గుణశేఖర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం లో వచ్చిన తర్వాత విద్యా వ్యవస్థ లో పెను మార్పులు వచ్చాయన్నారు. విద్యార్థుల కు సర్వేపల్లి రాధాకృష్ణ పేరుతో స్కూల్ బ్యాగ్, షూస్, స్కూల్ యూనిఫామ్, పుస్తకాలు కిట్ల ను అందచేస్తుందని అన్నారు.అలాగే స్కూల్ పిల్లలకు ఇచ్చే వస్తువులపై ఎలాంటి రాజకీయ నాయకుల ఫొటోస్ లేకుండా ఇవ్వడం, ఈ కిట్ల పంపిణీ పథకానికి విద్యావేత్త,భారతదేశ మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ పేరు పెట్టడం గర్వించదగ్గ విషయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ స్కూల్ విద్యాకమిటీ చైర్మన్, ఉపాధ్యాయులు,గ్రామ పంచాయతీ వార్డ్ మెంబెర్స్, ఇతరులు పాల్గొన్నారు.




# నరకయాత్ర రహదారి!




**రాజవొమ్మంగి, పెన్ పవర్ జూన్ 26**

రాజవొమ్మంగి నుంచి జడ్డింగ్, అన్నవరం, గొంతువనపాలెం, రమణయ్యపేట మీదుగా ఏలేశ్వరం వరకు సాగిన ఆర్ఎంబీ రహదారి పేరు చెబితే ప్రజలకు భయం వరిస్తోంది. వర్షం పడితే ఈ రహదారి చెరువుగా మారుతుంది. ఎక్కడ గుంత, ఎక్కడ నీటి గుంపు, ఎక్కడ మట్టిసెల్లు అని ఊహించలేని పరిస్థితి. వాహనదారులకు ఇది ప్రయాణం కాదు ు శిక్ష. ప్రజలు ఇలా నిట్టూర్పు విడుస్తున్నారు: "ఈ రహదారి మీద ప్రయాణం అంటే నరకం చూసినట్టే."ఈ మార్గం పక్కన రెండు కరికి శాలలు ఉండటంతో రోజూ భారీ టిప్పర్లు, లారీలు ఎగబడి పోతున్నాయి. వాటి తాకిడితో రహదారి పూర్తిగా దెబ్బతినిపోతోంది. జడ్డంగి అన్నవరం నుంచి రమణయ్యపేట వరకు రోడ్డేమీ లేదన్న మాట వినిపిస్తోంది. ఇది రహదారి కాదు, రహదారిపై కసింత గుణపాఠమే.గత ప్రభుత్వం ఈ రహదారిపై కనీసం కనుచూపు కూడా పెట్టలేదు. ప్రజలు ఇప్పుడైన కొత్త ప్రభుత్వం పట్టు పట్టి ఏదైనా చేస్తుందేమోనన్న ఆశలో ఉన్నారు. కానీ ఇప్పటివరకు ఎటువంటి మార్పు కనబడడం లేదు. ఏదో కలలో మాత్రమే మారిపోయే పరిస్థితిలా వుంది. "వర్షం కురిసిన ప్రతి రోజూ వాహనం నడపడం మామూలు విషయం కాదు. చెరువులో పడవ నడిపినట్టే. చిన్న తప్పిదం ఘోర ప్రమాదానికి దారి తీస్తుంది" అంటూ వాహనదారులు వాపోతున్నారు.ప్రజలు అధికారుల దృష్టిని ఈ మార్గంపై మరల్చాలని కోరుతున్నారు. "ఒక్కసారి ఈ రహదారిపై వాళ్లే ప్రయాణిస్తే, మా బాధ అర్థమవుతుంది. మేం రోజూ ఇదే భయంతో జీవిస్తున్నాం" అని నిరాశతో చెబుతున్నారు.





# విద్యార్థులకు దుస్తులు,బ్యాగులు, పంపిణీ

**కాజులూరు, పెన్ పవర్,జూన్ 26:**

మండల పరిధిలోని గొల్లపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు దుస్తులు, బ్యాగులు, షూస్ పంపిణీ కార్యక్రమం గురువారం నిర్వహించ బడింది.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పోతురాజు ప్రసన్న మౌనిక, గ్రామ కమిటీ అధ్యక్షుడు నక్క శ్రీను,హెచ్ఎం సుశీల, దేగల సతీష్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మౌనిక మాట్లాడుతూ విద్యార్థులు ఉపాధ్యా యుల బోధనను సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్యావంతులు కావాలని ఆకాంక్షించారు.దేగల సతీష్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకుంటున్నారని గుర్తు చేశారు. గ్రామ కమిటీ అధ్యక్షుడు నక్క శ్రీను మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యార్థులకు అన్ని రకాల సదు



పాయాలను కల్పిస్తున్నదన్నారు.ఈ కార్యక్రమంలో స్కూల్ సిబ్బంది,కూటమి నాయకులు ఆర్టోస్ చిన్న,నాని,మాధవ రపు శ్రీరామ్ మూర్తి,చిన్న డాక్టర్, విద్యార్థులుపాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాల వ్యసనం విద్యార్థుల

# భవిష్యత్తును నాశనం చేస్తోంది

## ఎమ్మెల్యే వేగుళ్ళ




**మండపేట. పెన్ పవర్.జూన్ 26 :**

విద్యార్థులు మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే వారి బంగారు భవిష్యత్తు అంధకారం అవుతుందని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు హెచ్చరించారు. మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మండపేట టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన అవగాహన ర్యాలీని ముఖ్య అతిథిగా ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంతమంది విద్యార్థులు సరదాకు మాదక ద్రవ్యాలను ఉపయోగించడం ప్రారంభించి చివరకు జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఒకసారి అలవాటు పడితే వారు మళ్లీ మామూలు జీవితం వైపు తిరగలేరన్నారు. డబ్బు కోసం నేరాలకు కూడా పాల్పడే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు మాదక ద్రవ్యాల ప్రభావం పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మందు, గంజాయి వంటి వ్యసనాల నుండి పిల్లలను దూరంగా ఉంచాలని, వారి అలవాట్లను ఎప్పటికప్పుడు గమనించాలని చెప్పారు. మండపేట టౌన్ సీఐ డి. సురేష్ పర్యవేక్షణలో, ఎస్ఐ చంటి నేతృత్వంలో నిర్వహించిన ర్యాలీలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు, మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీ వర ప్రకాష్, రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ మందపల్లి దొరబాబు, పట్టణ టీడీపీ మాజీ అధ్యక్షుడు ఉంగరాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# పి గన్నవరం సీఐ భీమరాజు ఆధ్వర్యంలో ర్యాలీ




**అమలాపురం /పి గన్నవరం పెన్ పవర్ జూన్ 26.**

మారకద్రవ్యల నిరోధక అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా పి గన్నవరం నియోజకవర్గం పి గన్నవరం లో మూడు రోడ్ల జంక్షన్ నుండి పోలీసుస్టేషన్ వరకు పి. గన్నవరం సీఐ రుద్రరాజు భీమరాజు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా పి. గన్నవరం శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ ,ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జడ్పీ మాజీ చైర్మన్ పి .గన్నవరం నియోజకవర్గం టీడీపీ కన్వీనర్ నామన రాంబాబు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, వివిధ కళాశాల విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# లారీ ఢీ కొని మహిళ మృతి

**భీమడోలు పెన్ పవర్ జూన్ 26:**

ఏలూరు జిల్లా, భీమడోలు మండలంలోని పూళ్ళగ్రామములో గురువారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది.బైక్ పై వెళ్ళుతున వాహనదారుని ఢీ కొట్టిన లారీ ఘటనలో భార్య అక్కడికక్కడే మృతి చెందిందిభర్తకు తీవ్ర గాయలవడంతో హుటాహుటిన అంబులెన్స్ లో ఆసుపత్రికి తరలించారుపోలిసులు అందించిన వివరాల ప్రకారం ఏలూరు జిల్లా, మండవల్లి మండలం లోని కొవ్వాడలంక గ్రామమునకు చెందిన ఘంటసాల సీతామహాలక్ష్మి భర్త రామకృష్ణఉదయం యమ్.యమ్.పురం గ్రామములో గల తనకూమార్తె మెరుల లక్ష్మి తిరుపతమ్మ యింటి నుండి బయలు దేరి ఏలూరు ఆసుపత్రికి బైక్ పై వెళ్ళుతుండా పూళ్ళ గ్రామములో స్పీడుగా వస్తున లారీ ఏపి05 టీ ఇ 2233 నెంబరుగల లారీ బలంగా బైకు ను ఢీకొట్టడంతో అక్కడికక్కడే సీతామహలక్ష్మీ (61) మృతిచెందింది. భర్త రామకృష్ణను ఏరియా హస్పిటల్ కు చికిత్స నిమిత్తం తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.



# జగన్‌లో అప్పటి ఊపు... ఉత్సాహం ఇప్పుడెక్కడ ... ?



**హైదరాబాద్ పెన్ పవర్:** వైసిపి అధినేత మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిలో ఊపు ఉత్సాహం కరువైందా? అంటే అవుననే సమాధానం వినిపిస్తుంది. సహజంగా జగన్ రాజకీయంగా ఏం మాట్లాడినా.. ఎవరిపై విమర్శలు చేసినా చాలా ఉత్సాహంగా ఉంటారు. ఉత్సాహంగా వ్యాఖ్యానిస్తారు. కానీ, తాజాగా బుధవారం జరిగిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో మాత్రం ఆయన చాలా నిరుత్సాహంగా కనిపించారు. ఆయన మాట్లాడే విధానం, మాట్లాడే తీరు గమనిస్తే జగన్లో స్పష్టంగా తేడా కనిపించింది. మరి ఈ తేడా ఎందుకు వచ్చింది.. అంటే ప్రస్తుతం ఆయన చుట్టూ అనేక కేసులు ముసురుకున్నాయి. ప్రధానంగా ఆయన ఇంటి నుంచి కారును పోలీసులు తీసుకువెళ్లడంపై మానసికంగా ఆయన ఇబ్బంది పడుతున్నట్టు తెలుస్తోంది. సహజంగా కేసు పెట్టి అందులో జగన్ పేరు చేర్చడంపై కంటే కూడా వ్యక్తిగతంగా ఆయన ఇంటి నుంచి కారు తీసుకెళ్లడాన్ని జగన్ కొంచెం ఫీల్ అవుతున్నారని సమాచారం. దీనికి తోడు పార్టీ నాయకుల పై వరుసగా నమోదు అవుతున్న కేసులు కూడా జగన్‌ను ఇబ్బంది పెడుతున్నాయి. పైకి గంభీరంగా ఉన్నా.. అరెస్టయిన వారిని బయటకు తీసుకురాలేని పరిస్థితి వంటి పరిణామాలు కూడా మానసికంగా జగన్ ను కుంగ తీస్తున్నాయని చెప్పాలి. సహజంగా ధైర్యం, సాహసం వంటి వాటికి జగన్ పేరును పర్యాయపదంగా చెబుతారు. కానీ, మారుతున్న కాలం.. మారుతున్న పరిస్థితులు వంటివి జగన్ను ఆ దిశగా నడిపించడంలో కాస్త వెనుకబాటు కనిపించింది. ఇదే సమయంలో నిరుత్సాహానికి కారణం కూడా అదేనని చెప్పాలి. దీనికి తోడు ఏడాది కాలంలో కూటమిలో అనైక్యత చోటు చేసుకుంటుందని అనుకున్నారు. అంతేకాదు.. ఎక్కడో ఒక చోట విభేదాలు వస్తాయని జగన్ అంచనా వేసుకున్నారు. కానీ అలా జరగలేదు. పైగా కూటమి బలంగా ఉందన్న సంకేతాలు తాజాగా జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం ద్వారా స్పష్టమైంది. ఇది కూడా జగన్కు మానసిక ఆవేదనను పెంచిందని చెప్పాలి. ఎలా చూసుకున్నా రాజకీయంగా జగన్ కి ఇప్పుడు ఒక సంక్లిష్ట పరిస్థితి అయితే ఏర్పడిందనేది పరిశీలకులు చెబుతున్న మాట. అందుకే ఆయనలో ఊపు, ఉత్సాహం కొరవడిందని అంటున్నారు. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# 'సుపరిపాలన' ప్రోగ్రాంకి వెళ్లుంటే వెనక్కి వచ్చేసేవాడిని.. రఘురామ కీలక వ్యాఖ్యలు



**హైదరాబాద్ పెన్ పవర్:** ఏడాది పాలన సందర్భంగా ఇటీవల అమరావతిలో కూటమి ప్రభుత్వం 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఘనంగా జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా.. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, ఏపీబీజేపీ చీఫ్ పురందేశ్వరి, మంత్రి లోకేష్.. జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. ఇదే సమయంలో.. ఈ ప్రతిష్టాత్మకమైన 'సుపరిపాలనలో తొలి అడుగు' సదస్సుకు కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, చీఫ్ సెక్రటరీ, డీజీపీ, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు! అయితే... ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలకు అవమానం జరిగిందంటూ ఉండి ఎమ్మెల్యే, ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు కీలక వ్యాఖ్యలు చేశారు. అవును... అమరావతిలో ఇటీవల అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఎమ్మెల్యేలకు అవమానం జరిగిందని ఏపీ శాసనసభ ఉప సభాపతి రఘురామకృష్ణరాజు అన్నారు. ఈ సందర్భంగా... ప్రొటోకాల్ ఉల్లంఘన ప్రభుత్వ పెద్దలకు తెలిసే జరిగిందో.. లేదో నాకు తెలియదంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. కలెక్టర్ కంటే ఎమ్మెల్యే ప్రొటోకాల్ పెద్దదని తెలిపారు. ఈ సందర్భంగా స్పందించిన రఘురామ... 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో కలెక్టర్, ఎస్పీ, ఎంపీని ఒక టేబుల్ వద్ద కుర్చోబెట్టారని.. మరో టెబుల్ వద్ద కార్పొరేషన్ డైరెక్టర్లతో కలిసి ఎమ్మెల్యేలను కూర్చోబెట్టారని చెప్పిన ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు... ప్రభుత్వం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రొటోకాల్ నిబంధనలు పాటించలేదని అన్నారు. ఇదే సమయంలో.. ఈ ప్రభుత్వ కార్యక్రమానికి స్పీకర్, డిప్యూటీ స్పీకర్ ను కూడా ఆహ్వానించాలని తెలిపారు. ఈ క్రమంలో... ఎమ్మెల్యేలకు జరిగిన అవమానంపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాస్తానని తెలిపారు. అయితే.. ఇది మొదటి తప్పుగా భావిస్తున్నట్లు చెప్పిన ఆయన... కార్యక్రమానికి వెళ్లి ఉంటే సీటింగ్ విధానం చూసి బయటకు వచ్చేసేవాడినని వ్యాఖ్యానించడం గమనార్హం. ఈ సందర్భంగా.. ఆ కారక్రమంలో తమకు అవమానం జరిగిందని చాలా మంది ఎమ్మెల్యేలు తనతో చెప్పినందుకే మాట్లాడుతున్నానని చెప్పిన రఘురామ... ప్రొటోకాల్ ఉల్లంఘన ప్రభుత్వ పెద్దలకు తెలిసే జరిగిందో.. లేదో తనకు తెలియదని వ్యాఖ్యానించారు. దీంతో.. ఈ వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి!

# పార్లమెంట్ కాదు.. రాజ్యాంగమే సుప్రీం.. తేల్చిచెప్పిన చీఫ్ జస్టిస్

**హైదరాబాద్ పెన్ పవర్:** భారత ప్రజాస్వామ్య పునాదులైన శాసన, న్యాయ, కార్యనిర్వాహక వ్యవస్థల్లో ఏది అత్యున్నతం..?? దేశ పార్లమెంటు, సుప్రీం కోర్టు.. వీటిలో ఏది అత్యున్నతం..? రాజ్యాంగం.. పార్లమెంటు.. వీటిలో ఏది ప్రధానం..? అనేకసార్లు ఇలాంటి చర్చ వచ్చింది. పలు సందర్భాల్లో తీవ్ర సంఘర్షణ కూడా తలెత్తింది. ఈ నేపథ్యంలో సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి కీలక వ్యాఖ్యలు చేశారు. ఇటీవలే దేశ 52వ ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు జస్టిస్ బీఆర్ గవాయ్. మహారాష్ట్రలోని అమరావతిలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న జస్టిస్ గవాయ్... దేశంలో రాజ్యాంగమే అత్యుత్తమం అని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలోని మూడు వ్యవస్థలు (శాసన, న్యాయ, కార్యనిర్వాహక) దీనికిందే పనిచేస్తాయని కుండబద్దలు కొట్టారు. బేసిక్ స్ట్రక్చర్ డాక్ట్రిన్ పై సుప్రీం కోర్టు గతంలో ఇచ్చిన తీర్పును ఉద్దేశించి మాట్లాడుతూ జస్టిస్ గవాయ్ ఈ వ్యాఖ్యలు చేశారు. కాగా, రాజ్యాంగాన్ని సవరించేందుకు మాత్రమే పార్లమెంట్ కు అధికారాలు ఉనాయని... రాజ్యాంగం ప్రాథమిక రూపాన్ని మాత్రం మార్చేందుకు అధికారం లేదని స్పష్టం చేశారు. భారత ప్రజాస్వామ్యంలో శాసన (పార్లమెట్-అసెంబ్లీ), న్యాయ (కోర్టులు), కార్యనిర్వాహక (అధికార) వ్యవస్థలు ఉండగా.. నాలుగో వ్యవస్థగా మీడియాను పేర్కొంటారు. మొదటి మూడు వ్యవస్థలలో ఏది అత్యున్నతం అనే చర్చ తరచూ వస్తున్న సంగతిని జస్టిస్ గవాయ్ ప్రస్తావించారు. ఈ నేపథ్యంలోనే పార్లమెంటే అత్యున్నతం అని చాలామంది అంటారని.. రాజ్యాంగమే అత్యున్నతం అని, మిగతా మూడు విభాగాలు దానికిందనే పనిచేస్తాయని జస్టిస్ గవాయ్ పేర్కొన్నారు. రాజ్యాంగం కిందనే విధులు నిర్వర్తిస్తున్నామని న్యాయమూర్తులు ఎప్పుడూ గుర్తుంచుకోవాలని తేల్చిచెప్పారు. ప్రజల హక్కులు, రాజ్యాంగ విలువలు, నిబంధనలకు రక్షకులం అని.. అధికారంతో పాటు బాధ్యతలు కూడా ఉన్నట్లు గుర్తించాలని స్పష్టం చేశారు. జడ్జిలు స్వతంత్రంగా ఆలోచించాలని.. తీర్పుల గురించి ప్రజలు ఏం అనుకుంటున్నారు? అనేది కాదని జస్టిస్ గవాయ్ పేర్కొన్నారు.

# తెరపైకి 48వ వర్గం బ్లడ్ గ్రూప్... ఏమిటీ 'గ్వాడా నెగిటివ'?



**హైదరాబాద్ పెన్ పవర్:** సాధారణంగా ఏ, బీ, ఏబీ, ఓ రకాల బ్లడ్ గ్రూప్స్ ని మాత్రమే ఎక్కువగా చూసే ప్రపంచంలో సరికొత్త రక్త వర్గం తెరపైకి వచ్చింది. సుమారు 15 సంవత్సరాల పరిశోధన తర్వాత ఫ్రెంచ్ శాస్త్రవేత్తలు 48వ రక్త గ్రూపు వ్యవస్థను కనుగొన్నారు. ఈ కొత్త రక్త వర్గానికి "గ్వాడా నెగిటివ్" అని నామకరణం చేశారు. ఈ పేరు దాని మూలం యొక్క సారాంశాన్ని ప్రతిబింబిస్తుందని అంటున్నారు. అవును... శాస్త్రవేత్తలు తాజాగా ఒక కొత్త బ్లడ్ గ్రూప్ ను గుర్తించారు. ఫ్రెంచ్ మహిళలో ఈ కొత్త రకం రక్త వర్గాన్ని గుర్తించారు. ఆపరేషన్ కు ముందు చేసే రెగ్యులర్ పరీక్షల కోసం ఆమె రక్తనమూనాలను సేకరించి, పరీక్షించగా.. అందులో గతంలో ఎన్నడూ చూడని కొత్త వ్యత్యాసాలు కనిపించాయని అంటున్నారు. ఇదంతా తొలుత 2011లోనే ప్రారంభమైంది.

వివరాల్లోకి వెళ్తే... ఫ్రాన్స్ దేశంలోని గ్వాడెలోప్ ప్రాంతానికి చెందిన మహిళ, పారిస్ లో నివసిస్తుంది. 2011లో ఆపరేషన్ కోసం ఆస్పత్రికి వెళ్లిన 54 ఏళ్ల మహిళకు సాధారణ వైద్యపరీక్షల కోసం బ్లడ్ తీశారు. ఆ బ్లడ్ శాంపుల్స్ ని పరీక్షించిన వైద్యులకు అది అసాధారణంగా కనిపించింది. ఈ బ్లడ్ గ్రూప్, ఇతర సాధారణ బ్లడ్ గ్రూప్స్ తో ఏమాత్రం సరిపోలడం లేదు. అదేవిధంగా... ఈ రక్త వర్గంలోని యాంటీ బాడీస్ ఏ రక్తవర్గంలోనూ ఇప్పటి వరకు గుర్తించలేదు. దీంతో... ఈ అసాధారణ రక్త వర్గాన్ని గుర్తించిన వైద్యులు.. పరిశోధనల కోసం బ్లడ్ శాంపిల్స్ ను సేవ్ చేసి పెట్టారు. ఈ క్రమంలో ఎన్నో పరిశోధనలు చేసినప్పటికీ సుమారు 8 ఏళ్లపాటు ఎలాంటి ఫలితం రాలేదు. అయితే.. 2019లో మళ్లీ పరిశోధన ప్రారంభించారు. అప్పటికి అడ్వాన్స్ టెక్నాలజీ అందుబాటులోకి రావడంతో, దాని సహాయంతో పరిశోధన మళ్లీ ప్రారంభించారు. ఇందులో భాగంగా... హై క్వాలిటీ థ్రోపుట్ డీ.ఎన్.ఏ సీక్వెన్సింగ్ సహాయంతో శాస్త్రవేత్తలు మళ్లీ రీసెర్చ్ మొదలుపెట్టారు. ఈ సమయంలో... ప్రపంచ వ్యాప్తంగా అందుబాటులో ఉన్న బ్లడ్ గ్రూప్స్ లో లేనటువంటి కొత్తరకం జెనిటిక్ మ్యుటేషన్ ను ఇందులో గుర్తించారు.

ఈ సందర్భంగా... సదరు మహిళ పేరెంట్స్ ఇద్దరూ అరుదైన జన్యువులను కలిగి ఉన్నారని.. ఆ అరుదైన జన్యువులే ఆమెకు వచ్చాయని.. ఈ క్రమంలో జెనిటిక్ మ్యూటేషన్ వల్ల అరుదైన రక్తవర్గం వచ్చిందని శాస్త్రవేత్తలు కనిపెట్టారు. ఈ సందర్భంగా దీనికి 'గ్వాడా నెగిటివ్' అని నామకరణం చేశారు.

కాగా... ప్రపంచంలో ఇప్పటి వరకు మొత్తం 47 రకాల బ్లడ్ గ్రూప్స్ ను అధికారికంగా

గుర్తించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో తాజాగా శాస్త్రవేత్తలు 48వ రకం బ్లడ్ గ్రూప్ ను గుర్తించారు. ఈ మేరకు ఫ్రెంచ్ బ్లడ్ ఎస్టాబ్లిష్ మెంట్.. 48వ రక్తవర్గాన్ని గురించినట్లు అధికారికంగా ప్రకటించింది. ఇటీవలే ఈ బ్లడ్ గ్రూప్ కు ఇంటర్నేషనల్ సొసైటీ ఆఫ్ బ్లడ్ ట్రాన్స్ఫ్యూజన్ (ఐ.ఎస్.బీ.టీ) గుర్తింపు లభించింది.

# టూవీలర్లకు టోల్ ఫీజు ప్రచారం: కేంద్ర మంత్రి గడ్కరీ సంచలన ప్రకటన

**హైదరాబాద్ పెన్ పవర్:** జులై 15 నుండి నేషనల్ హైవేలపై టూవీలర్లకు కూడా టోల్ ఫీజు వసూలు చేస్తారంటూ సామాజిక మాధ్యమాల్లో, కొన్ని వార్తాపత్రికలలో వస్తున్న వార్తలను కేంద్ర రహదారులు.. రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ గట్టిగా ఖండించారు. ఈ ప్రచారం అవాస్తవం అని, ప్రజలు ఆందోళన చెందవద్దని ఆయన స్పష్టం చేశారు.



### ప్రచారంపై వివరణ

గత కొన్ని రోజులుగా నేషనల్ హైవేలపై ద్విచక్ర వాహనాలకు కూడా టోల్ వసూలు చేస్తారన్న వార్తలు విపరీతంగా ప్రచారంలో ఉన్నాయి. ఈ వార్తలు ప్రజలలో ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులలో తీవ్రమైన ఆందోళనను రేకెత్తించాయి. ఇంధన ధరలు ఇప్పటికే భారంగా మారిన నేపథ్యంలో టోల్ ఫీజు భారం మరింత పెరగనుందని చాలామంది ఆందోళన చెందారు. అయితే, ఈ వార్తలపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తక్షణమే స్పందించి, వాటిని పూర్తిగా ఖండించారు.

### గడ్కరీ ప్రకటన

కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ మీడియాతో మాట్లాడుతూ "టూవీలర్లకు టోల్ ఫీజు వసూలు చేయాలని ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ద్విచక్ర వాహనాలకు టోల్ ఫీజు నుండి పూర్తి మినహాయింపు కొనసాగుతుంది" అని స్పష్టంగా ప్రకటించారు. ఈ ప్రకటనతో ద్విచక్ర వాహనదారులకు పెద్ద ఊరట లభించింది. టోల్ వసూలుకు సంబంధించి వస్తున్న వార్తలు కేవలం వదంతులు మాత్రమేనని, వాటిని నమ్మవద్దని ఆయన ప్రజలకు సూచించారు.

### పూర్వపు విధానం కొనసాగింపు

భారతదేశంలో ద్విచక్ర వాహనాలకు నేషనల్ హైవేలపై టోల్ ఫీజు నుంచి ఎప్పుడూ మినహాయింపు ఉంది. ఈ మినహాయింపు కొనసాగుతుందని గడ్కరీ మరోసారి ధ్రువీకరించారు. హైవేలపై ద్విచక్ర వాహనాలకు ప్రత్యేకంగా లేన్లు ఉండకపోవడం, వాటి వేగం , భద్రత దృష్ట్యా ఈ మినహాయింపును అందిస్తున్నారు. చిన్న తరహా వాహనాలు.. సామాన్య ప్రజల ప్రయాణ సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ విధానం అమలులో ఉంది.

### ప్రచారాల పట్ల జాగ్రత్త

సామాజిక మాధ్యమాలలో తప్పుడు సమాచారం , వదంతులు చాలా వేగంగా వ్యాపిస్తున్నాయి. ఇటువంటి ప్రచారాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నితిన్ గడ్కరీ పరోక్షంగా సూచించారు. ప్రభుత్వ నిర్ణయాలకు సంబంధించిన అధికారిక సమాచారం కోసం విశ్వసనీయ వర్గాలను మాత్రమే అనుసరించాలని ఆయన పరోక్షంగా తెలిపారు. తప్పుడు వార్తలను నమ్మి ఆందోళన చెందవద్దని, ఏదైనా కొత్త విధానం అమలైనట్లయితే, ప్రభుత్వం అధికారికంగా ప్రకటిస్తుందని గుర్తు చేశారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ స్పష్టమైన ప్రకటనతో టూవీలర్లకు టోల్ ఫీజు వసూలు అంశంపై నెలకొన్న గందరగోళం తొలగిపోయింది. ద్విచక్ర వాహనదారులకు టోల్ భారం ఉండదని, ప్రస్తుత మినహాయింపు కొనసాగుతుందని మరోసారి స్పష్టమైంది. భవిష్యత్తులో ఇటువంటి అవాస్తవ ప్రచారాలపై ప్రజలు మరింత జాగ్రత్తగా ఉండాలని ఈ ఘటన మరోసారి రుజువు చేసింది.

# వలసదారులపై మరింత కఠిన చర్యలు.. ట్రంప్ నెక్స్ట్ నిర్ణయం ఏమిటంటే..?

**హైదరాబాద్ పెన్ పవర్:** పన్నెండు రోజుల పాటు పశ్చిమాసియాను రగిలించేసిన ఇజ్రాయెల్ - ఇరాన్ మధ్య జరిగిన భీకర యుద్ధం ముగిసిన సంగతి తెలిసిందే. ఇరు దేశాలు కాల్పుల విరమణకు అంగీకరించడంతో వాతావారణం చల్లబడింది. దీంతో యుద్ధం ముగిసిందంటూ డొనాల్డ్ ట్రంప్ పలు పోస్టులు చేశారు. ఈ నేపథ్యంలో తాజాగా మరోసారి స్పందించిన ఆయన.. మళ్లీ యుద్ధం రావొచ్చేమో అంటూ కీలక వ్యాఖ్యలు చేశారు.




అవును... ఇజ్రాయెల్ - ఇరాన్ మధ్య యుద్ధం ముగిసి రెండు రోజులు కావొస్తుంది. పశ్చిమాసియా ఇప్పుడిప్పుడే కాస్త ప్రశాంత వాతావరణంలోకి అడుగుపెడుతోంది. ఈ సమయంలో ఇజ్రాయెల్, ఇరాన్ తో తాను చర్చలు జరిపానని.. అవి రెండూ ప్రస్తుతానికి అలిసిపోయాయని.. అయితే మళ్లీ యుద్ధ బహుశా ఏదో ఒకరోజు రావొచ్చని.. త్వరలోనే యుద్ధం మళ్లీ ప్రారంభం కావొచ్చని ట్రంప్ అన్నారు.

దీంతో... ఈ విషయం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇజ్రాయెల్ అయితే ట్రంప్ కు చెప్పకుండా ఏ పనీ చేయకపోవచ్చు. అయితే.. ఇరాన్ ఎప్పుడు ఏమి చేస్తుందో ట్రంప్ గిల్లుడును బట్టి, ఆంక్షలను బట్టి ఉంటుందని.. ఆ ఉద్దేశ్యంలోనే ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేసి ఉండొచ్చని అంటున్నారు పరిశీలకులు. పైగా.. ఇరాన్ తో చర్చలవేళ ఇది ఓ బెదిరింపు హింట్ అయ్యికూడా ఉండొచ్చని చెబుతున్నారు.

ఈ సందర్భంగా ఇరాన్ తో అణు చర్చల అంశాన్ని మరోసారి ప్రస్తావించారు ట్రంప్. ఇందులో భాగంగా... వచ్చే వారం టెహ్రాన్ తో అణు చర్చలు జరుపుతామని.. అణ్వాయుధాలు తయారుచేయాలన్న ఆశయాన్ని వదిలేసేలా ఇరాన్ తో ఒప్పందం చేసుకునే అవకాశం ఉందని వెల్లడించారు. ఇదే సమయంలో.. ఇరాన్ పై అమెరికా దాడుల వల్లే పశ్చిమాసియాలో యుద్ధానికి త్వరగా ముగింపు పడిందని ఆయన అన్నారు. పైగా... తన నిర్ణయంతో అందరికీ విజయం లభించిందని ట్రంప్ వ్యాఖ్యానించడం గమనార్హం. మరోవైపు.. ఇరాన్ చమురుపై అమెరికా ఆంక్షలను సడలించే అవకాశాలున్నట్లు ట్రంప్ సంకేతాలిచ్చారు. ఇందులో భాగంగా... ప్రస్తుతం ఇరాన్ పునర్నిర్మాణానికి ఆర్థిక వనరులు కావాలని.. ఈ సమయంలో ఆ దేశం కోలుకునేలా మద్దతు ఇవ్వడం కోసం కొన్ని ఆంక్షలను సడలించే అవకాశాన్ని పరిశీలిస్తున్నామని ట్రంప్ వెల్లడించారు.

### ఇరాన్ నష్టంపై సీఐఏ క్లారిటీ!:

ఇరాన్ లోని అణుకేంద్రాలపై ఇజ్రాయెల్ దాడివల్ల పెద్ద నష్టం ఏమీ జరగలేదని ఒకరంటే.. రెండు మూడు నెలల్లో ఇరాన్ మళ్లీ పని మొదలుపెడుతుందని మరొకరు అన్నారు. అయితే... ఇప్పట్లో ఇరాన్ తేరుకోలేదని అమెరికా, ఇజ్రాయెల్ లు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ (సీ.ఐ.ఏ) ఓ ప్రెస్ నోట్ విడుదల చేసింది.

ఇందులో భాగంగా... ఇటీవల జరిగిన దాడుల్లో ఇరాన్ అణు కార్యక్రమం తీవ్రంగా దెబ్బతిన్నట్లు నమ్మకమైన ఇంటెలిజెన్స్ విభాగం ఒకటి వెల్లడించిందని.. మరిన్ని వివరాలను తాము సేకరించి పాలకులకు అందిస్తామని.. అమెరికా ప్రజలకూ తెలియజేస్తామని.. జాతీయ ప్రాధాన్యం ఉన్న అంశం కావడంతో పూర్తిగా పారదర్శకంగా వ్యవహరిస్తామని సీఐఏ డైరెక్టర్ జాన్ రాట్ క్లిఫ్ ప్రెస్ నోట్లో పేర్కొన్నారు.

### మరోసారి క్లారిటీ ఇచ్చిన ట్రంప్:

ఇదే విషయంపై ట్రంప్ నాటో సదస్సు వేదికగా మరోసారి క్లారిటీ ఇచ్చారు. ఇందులో భాగంగా.. ఇజ్రాయెల్ మనుషులు అక్కడికి వెళ్లి పరిశీలించి పూర్తిగా ధ్వంసమైనట్లు తెలిపారని.. ఇప్పుడు ఇజ్రాయెల్ దానిపై ఓ నివేదిక తయారుచేస్తోందని.. పూర్తిగా ధ్వంసమైందని వారు చెప్పడంతోపాటు.. తాను కూడా నమ్ముతున్నానని.. అక్కడ (ఇరాన్ అణు కేంద్రాల్లో) ఏదీ మిగిలే అవకాశం లేదని ట్రంప్ పేర్కొన్నారు.

# టెస్ట్ క్రికెట్‌లోనూ స్టాప్ క్లాక్.. ఐసీసీ ప్రకటించిన ఐదు కొత్త రూల్స్ ఇవే



హైదరాబాద్ పెన్ పవర్: అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ మెన్స్ ఇంటర్నేషనల్ క్రికెట్‌లో ఐదు కొత్త రూల్స్ తీసుకొని వచ్చింది. గురువారం (జూన్ 26) ప్రకటించిన ఈ రూల్స్ లో టెస్ట్ క్రికెట్ పై ఫోకస్ చేస్తూ రూల్స్ ప్రకటించింది. గత వారం కంకషన్ సబ్‌స్టిట్యూట్ లో గందరగోళాన్ని తొలగించగా.. వన్డే ఫార్మాట్ లో బ్యాట్, బంతికి మధ్య కాంటెస్ట్ రసవత్తరంగా మార్చాలని కొత్త బంతి పై ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. తాజాగా టెస్ట్ క్రికెట్ లో స్టాప్ క్లాక్ రూల్.. డీఆర్ఎస్ విధానంపై మార్పులు చేస్తూ కీలక రూల్స్ ప్రకటించింది. ఈ రూల్స్ మూడు ఫార్మాట్ లకు వర్తిస్తాయి. ఐసీసీ కొత్తగా ప్రవేశ పెట్టిన రూల్స్ ఏంటో ఇప్పుడు చూద్దాం.

**టెస్ట్ క్రికెట్ లో స్టాప్ క్లాక్:**

స్టాప్ క్లాక్ రూల్ ఇప్పటివరకు వన్డే, టీ20 ఫార్మాట్ లో మాత్రమే ఉంది. ఈ రూల్ ను ఐసీసీ టెస్టుల్లోనూ చేర్చింది. టెస్ట్ మ్యాచ్‌లలో స్లో ఓవర్ రేట్ల సమస్యను పరిష్కరించడానికి ఐసీసీ స్టాప్ క్లాక్‌ను ప్రవేశపెట్టింది. ఈ రూల్ ప్రకారం ఫీల్డింగ్ చేస్తున్న జట్టు మునుపటి ఓవర్ ముగిసిన 60 సెకన్లలోపు కొత్త ఓవర్‌ను ప్రారంభించాల్సి ఉంటుంది. ఒకవేళ ఆలస్యమైతే అంపైర్లు వార్నింగ్ ఇస్తారు. రెండు సార్లు కంటే అంపైర్ ఎక్కువసారి వార్నింగ్ ఇచ్చినట్లయితే బ్యాటింగ్ చేసే జట్టుకు 5 పరుగుల పెనాల్టీ ఇస్తారు. ప్రతి 80 ఓవర్లకు గడియారం రీసెట్ అవుతుంది. ఈ మార్పు ఇప్పటికే ప్రస్తుత వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్ సైకిల్‌లో ఉపయోగిస్తున్నారు.

**లాలాజల నియమం సడలించబడింది:**

బంతిపై లాలాజలం వాడకంపై నిషేధం తొలగించిన సంగతి తెలిసిందే. అయితే దీన్ని అడ్వాంటేజ్ గా తీసుకొని ఫీల్డింఫ్ చేస్తున్న జట్టు బంతి స్వరూపాన్ని మార్చి కొత్త బంతిని తీసుకునే ప్రయత్నం చేస్తున్నారు. అయితే ఇకపై అలా జరగడానికి వీలు లేదు. అంపైర్లు బంతిని స్థితిని గమనించి.. బంతి పరిస్థితి గణనీయంగా మారిందని అంపైర్లు నిర్ధారించిన ట్లయితే బంతిని మారుస్తారు. లాలాజలాన్ని బలవంతంగా బంతిపై రుద్దడానికి వీలు లేదు. ఉద్దేశ్యపూర్వకంగా ఎవరైనా అలా చేస్తే బ్యాటింగ్ జట్టుకు 5 పరుగుల పెనాల్టీ విధిస్తారు.

**DRS విధానంలో కొత్త మార్పు:**

ఈ రూల్ ప్రకారం (ఉదాహరణకు) ఫీల్డింగ్ చేస్తున్న జట్టు క్యాచ్ కోసం అప్పీల్ చేస్తుంది. ఈ సమయంలో అంపైర్ ఔటిస్తే బ్యాటింగ్ చేసే జట్టు క్యాచ్ అప్పీల్ కోసం రివ్యూ కోరుతుంది. ఈ సమయంలో థర్డ్ అంపైర్ మొదట అల్ట్రాఎడ్జ్ చెక్ చేస్తారు. ఒకవేళ బంతి బ్యాట్ కు తగలేకపోతే ఎల్బీడబ్ల్యూ కోసం అంపైర్ చెక్ చేస్తారు. ఎల్బీడబ్ల్యూలో ఔట్ అని తేలినా లేకపోతే అంపైర్స్ కాల్ వచ్చినా ఔట్ గానే పరిగణిస్తారు.

**నో బాల్ లో క్లీన్ క్యాచ్ పడితే పరుగులు ఉండవు:**

సవరించిన రూల్ ప్రకారం నో బాల్ వేసినప్పుడు క్యాచ్ పడితే దాన్ని నాటౌట్ గా పరిగణిస్తారని మనకు తెలిసిందే. అయితే క్యాచ్ పట్టినప్పుడు అది క్లీన్ క్యాచా.. కాదా అని పరీశీలిస్తారు. ఒకవేళ క్లీన్ క్యాచ్ అయితే అప్పటివరకు తిరిగిన పరుగులు బ్యాటింగ్ జట్టుకు జత చేయరు. కేవలం నో-బాల్ పరుగు మాత్రమే బ్యాటింగ్ జట్టు స్కోరుకు జోడించబడుతుంది. ఒకవేళ క్లీన్ క్యాచ్ కాకపోతే బ్యాటర్లు పూర్తి చేసిన పరుగులను జట్టు స్కోర్ లో జత చేస్తారు. అంతేకాదు క్యాచ్ సరిగా పట్టకుండా ఔట్ అని అప్పీల్ చేస్తే.. థర్డ్ అంపైర్ చెక్ చేశాక అది క్లీన్ క్యాచ్ కాదని నాటౌట్ గా తెలితే నో బాల్ గా ప్రకటిస్తారు.

**షార్ట్ రన్ తీస్తే భారీ మూల్యం:**

బ్యాటర్లు పరుగు పూర్తి చేసేటప్పుడు కొన్ని సందర్భాల్లో బ్యాట్ ను పూర్తిగా క్రీజ్ లో పెట్టరు. దీనినే షార్ట్ రన్ అంటారు. గతంలో ఇలా చేస్తే అంపైర్లు చెక్ చేసి ఆ రన్ ఉండదని అంపైర్లు బ్యాటర్లకు వార్నింగ్ ఇస్తారు. అయితే కొత్తగా సవరించిన రూల్స్ ప్రకారం బ్యాటర్ పరుగు పూర్తి చేసి ఇంకో పరుగు తీసే క్రమంలో క్రీజ్ లో బ్యాట్ పూర్తిగా పెట్టరో ఆ జట్టుకు 5 రన్స్ పెనాల్టీ విధించబడుతుంది. అంతేకాదు ఫీల్డింగ్ జట్టు తర్వాత బంతికి ఎవరు స్ట్రైక్ తీసుకోవాలో ఎంచుకోవచ్చు.

# ఆర్చర్ ఇన్.. బుమ్రా ఔట్: రెండో టెస్టుకు ఇంగ్లాండ్, ఇండియా జట్లలో కీలక మార్పులు



హైదరాబాద్ పెన్ పవర్: ఎడ్జ్‌బాస్టన్ వేదికగా బుధవారం (జూలై 2) భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య రెండో టెస్టు జరగనుంది. తొలి టెస్ట్ తర్వాత వారం గ్యాప్ ఇరు జట్లు రెండో టెస్ట్ ఆడడానికి సిద్ధమవుతున్నాయి. లీడ్స్ వేదికగా జరిగిన తొలి టెస్టులో టీమిండియాపై ఇంగ్లాండ్ 5 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి 1-0 ఆధిక్యంలో నిలిచింది. రెండో టెస్టులోనూ గెలిచి భారత్ పై స్పష్టమైన ఆధిక్యం సంపాదించాలని ఇంగ్లాండ్ చూస్తుంటే.. తొలి టెస్టులో ఎదురైన ఓటమికి టీమిండియా ప్రతీకారం తీర్చుకోవాలని భావిస్తోంది. ఈ టెస్టులో ఇండియా, ఇంగ్లాండ్ జట్లు ఒక కీలక మార్పుతో బరిలోకి దిగడం దాదాపుగా ఖాయంగా మారింది.

**రెండో టెస్టుకు బుమ్రా దూరం:**

టీమిండియా స్టార్ ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా రెండో టెస్ట్ ఆడే అవకాశాలు కనిపించడం లేదు. వర్క్ లోడ్ కారణంగా సిరీస్ కు ముందే బుమ్రా 3 టెస్టులు మాత్రమే ఆడతానని చెప్పాడు. తొలి టెస్ట్ ముగిసిన తర్వాత టీమిండియా హెడ్ కోచ్ గంభీర్ సైతం బుమ్రా మూడు టెస్టులు ఆడతాడని కన్ఫర్మ్ చేశాడు. ఇప్పటికే బుమ్రా ఒక టెస్ట్ ఆడాడు. మిగిలిన నాలుగు టెస్టుల్లో రెండు మ్యాచ్ లు ఆడాల్సి ఉంది. ఒకవేళ బుమ్రా రెండో టెస్ట్ కూడా ఆడితే అప్పుడు చివరి మూడు టెస్టుల్లో ఒకటే టెస్ట్ ఆడాలి. దీంతో ఈ గుజరాత్ పేసర్ కు రెండో టెస్టుకు రెస్ట్ ఇచ్చే అలోచనలో ఉన్నట్టు జట్టు యాజమాన్యం భావిస్తోందట.

లీడ్స్ వేదికగా జరిగిన తొలి టెస్ట్ తొలి ఇన్నింగ్స్ లో బుమ్రా 5 వికెట్లు తీసి సత్తా చాటాడు. రెండో రోజు ఆటలో భాగంగా మూడు కీలక వికెట్లు తీసుకోగా.. మూడో రోజు మరో రెండు వికెట్లు పడగొట్టాడు. దీంతో టెస్ట్ కెరీర్ లో 14 వ సారి 5 వికెట్ల ఘనతను అందుకున్నాడు. ఓవరాల్ గా బుమ్రా తొలి ఇన్నింగ్స్ లో 24.4 ఓవర్లు బౌలింగ్ చేసి 83 పరుగులు మాత్రమే ఇచ్చి 5 వికెట్లు పడగొట్టాడు.

**నాలుగేళ్ళ తర్వాత ఆర్చర్ రీ ఎంట్రీ..**

ఇంగ్లాండ్ కు రెండో టెస్టుకు ముందు గుడ్ న్యూస్ అందింది. స్టార్ ఫాస్ట్ బౌలర్ జోఫ్రా ఆర్చర్ రెండో టెస్ట్ కోసం ఇంగ్లాండ్ స్క్వాడ్ లో ఎంపికయ్యాడు. దీంతో నాలుగేళ్ల తర్వాత ఆర్చర్ టెస్ట్ క్రికెట్ లోకి అడుగుపెట్టబోతున్నాడు. బొటన వేలి గాయం నుంచి కోలుకొని ఫస్ట్-క్లాస్ క్రికెట్‌లో మ్యాచ్ ఆడాడు. చెస్టర్-లె-స్ట్రీట్‌లో జరిగిన కౌంటీ ఛాంపియన్‌షిప్ లో భాగంగా దర్హామ్‌తో జరిగిన మ్యాచ్‌లో ససెక్స్ తరపున ఈ స్పీడ్‌స్టర్ 14 ఓవర్లు బౌలింగ్ చేశాడు. మే 2021 తర్వాత ఆర్చర్ తన తొలి ఫస్ట్-క్లాస్ మ్యాచ్ ఆడడం విశేషం. ఈ మ్యాచ్ లో ఇబ్బందిపడకుండా బౌలింగ్ చేసిన ఈ ఇంగ్లాండ్ పేసర్.. ఒక వికెట్ కూడా తీసుకున్నాడు. ఈ స్పెల్ తో తాను రెండో టెస్టుకు రెడీ అని సంకేతాలు ఇచ్చాడు.

ఆర్చర్ తన చివరి టెస్ట్ మ్యాచ్ ను 2021 ఫిబ్రవరిలో ఆడాడు. ఆ తర్వాత మోచేయికి శస్త్రచికిత్స చేపించుకొని సుదీర్ఘ ఫార్మాట్ కు దూరమయ్యాడు. ఈ క్రమంలో 2023 లో జరిగిన యాషెస్ తో భారత్ వేదికగా జరిగిన వన్డే వరల్డ్ కప్ కు దూరమయ్యాడు. జూలై 2న ఎడ్జ్‌బాస్టన్‌లో భారత్‌తో ఇంగ్లాండ్ రెండో టెస్ట్ మ్యాచ్ ఆడనుంది. ఈ మ్యాచ్ లో ఆర్చర్ బరిలోకి దిగడం ఖాయంగా కనిపిస్తుంది. ప్రస్తుతం ఇంగ్లాండ్ జట్టులో అనుభవం లేని ఫాస్ట్ బౌలర్లు ఉన్నారు. ఆర్చర్ జట్టులోకి వస్తే ఇంగ్లాండ్ బౌలింగ్ సమస్యలు తీరినట్టే.

# టెస్ట్ క్రికెట్ చరిత్రలో తొలిసారి.. మ్యాచ్ మధ్యలోనే గ్రౌండ్ వదిలి వెళ్లిపోయిన అంపైర్



హైదరాబాద్ పెన్ పవర్: కొలంబో వేదికగా సింహలీస్ స్పోర్ట్స్ క్లబ్ లో శ్రీలంక, బంగ్లాదేశ్ మధ్య బుధవారం (జూన్ 25) రెండో టెస్ట్ ప్రారంభమైంది. ఈ టెస్టులో తొలి రోజు శ్రీలంక బౌలర్లు ఆధిపత్యం చూపించగా.. రెండో రోజు శ్రీలంక బ్యాటర్లు బంగ్లా బౌలర్ల భరతం పట్టారు. దీంతో రెండో రోజు ఆట ముగిసే సమయానికి శ్రీలంక తొలి ఇన్నింగ్స్ లో 2 వికెట్ల నష్టానికి 290 పరుగులు చేసింది. క్రీజ్ లో పాతుం నిస్సాంక (146), ప్రబాత్ జయసూర్య (5) ఉన్నారు. ప్రస్తుతం శ్రీలంక తొలి ఇన్నింగ్స్ లో 43 పరుగుల ఆధిక్యంలో ఉంది. ఈ మ్యాచ్ తొలి రోజు ఆటలో భాగంగా ఒక అనూహ్య సంఘటన జరిగింది. తొలి రోజు ఆటలో భాగంగా ఆన్ ఫీల్డ్ అంపైర్ గ్రౌండ్ వదిలి మ్యాచ్ మధ్యలోనే వెళ్ళిపోయాడు. ఆన్-ఫీల్డ్ అంపైర్ అలెక్స్ వార్ఫ్ స్థానంలో నాల్గవ అంపైర్ ప్రగీత్ రాంబుక్వెల్లా గ్రౌండ్ లోకి వచ్చాడు. అయితే దీనికి కారణం లేకపోలేదు. అలెక్స్ వార్ఫ్ ఆనారోగ్యంతో ఉండడంతో అతను గ్రౌండ్ లో ఉండలేకపోయాడు. 148 ఏళ్ళ టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఒక అంపైర్ ఆట మధ్యలోనే వెళ్లిపోవడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఈ సంఘటన సోషల్ మీడియాలో వైరల్ గా మారుతుంది. అనారోగ్యంతో ఉన్న అంపైర్ త్వరగా కోలుకుని మైదానంలోకి తిరిగి రావాలని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. బంగ్లాదేశ్ బ్యాటింగ్ చేస్తున్నప్పుడు ఇన్నింగ్స్ 65 ఓవర్లో ఈ సంఘటన చోటు చేసుకుంది. ఈ మ్యాచ్ విషయానికి వస్తే మొదట బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్ లో 247 పరుగులకు ఆలౌట్ అయింది. షాద్మాన్ ఇస్లామ్ (46), ముష్ఫికర్ రహీమ్ (35), లిటన్ దాస్ (34), మెహిదీ హసన్ మిరాజ్ (31) మెరుగ్గా ఆడటంతో తొలి రోజ ఆట ముగిసే టైమ్‌కు బంగ్లా తొలి ఇన్నింగ్స్‌లో 71 ఓవర్లలో 220/8 స్కోరు చేసింది. రెండో రోజు మరో 27 పరుగులు జోడించి చివరి రెండు వికెట్లు కోల్పోయింది. అనంతరం మొదట ఇన్నింగ్స్ ఆరంభించిన శ్రీలంక రెండో రోజు ఆట ముగిసే సమయానికి శ్రీలంక తొలి ఇన్నింగ్స్ లో 2 వికెట్ల నష్టానికి 290 పరుగులు చేసింది. పాతుం నిస్సాంక ఈ సిరీస్ లో వరుసగా రెండో సెంచరీ చేసి సత్తా చాటగా.. చండీమల్ తృటిలో సెంచరీ మిస్ చేసుకున్నాడు.

**ఆకాంక్ష శర్మ స్లాగా గజల్ గుప్త కోచర్**



# ఇంకా సైలెంట్ మోడ్‌లోనే నేచురల్ స్టార్?

**ఇటీవలి ఫోటోలలో భూమి పెడ్నేకర్ మెరిసింది**



నేచురల్ స్టార్ నాని ఇటీవలే %-%హిట్:ది థర్డ్ కేస్%-%తో ప్రేక్షకుల ముందుకొచ్చాడు. శైలేష్ కొలను తెరకెక్కించిన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద రికార్డు స్థాయి వసూళ్లని రాబట్టి నాని కెరీర్‌లో మరో రూ.100 కోట్ల మూవీగా నిలిచింది. మే 1న ఐదు భాషల్లో విడుదలైన %-%హిట్ 3%-% ఇప్పుడు ప్రముఖ ఓటీటీ ప్లాట్ ఫామ్ నెట్ ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. అక్కడ కూడా ఐదు భాషల్లో టాప్‌లో ట్రెండ్ కావడం తెలిసిందే. ఇదిలా ఉంటే ఈ సినిమా విడుదలై..ఓటీటీలోకి వచ్చేసినా నాని మాత్రం ఇప్పటికీ సైలెంట్ మోడ్‌లోనే ఉన్నాడు. ఇది ఫ్యాన్స్‌ని కలవరానికి గురి చేస్తోంది. %-%హిట్ 3%-%తో బ్లాక్ బస్టర్ హిట్ ఇచ్చిన నాని అదే ఊపులో తదుపరి ప్రాజెక్ట్‌ని పట్టాలెక్కిస్తాడు అనుకుంటే సైలెంట్ మోడ్‌లోనే ఉండటం పలువురిని ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ఈ మూవీ తరువాత %-%దసరా%-% ఫేమ్ శ్రీకాంత్ ఓదెల డైరెక్షన్‌లో నాని %-%ది ప్యారడైజ్%-% పేరుతో ఓ భారీ పాన్ ఇండయా సినిమాకు శ్రీకారం చుదుతున్న విషయం తెలిసిందే. దీనికి సంబంధించి గ్లింప్స్‌ని మూడు నెలల క్రితమే అంటే మార్చి 3న విడుదల చేశారు. దీని కోసం ఏకంగా టీమ్ కోటి ఖర్చు చేసినట్టుగా వార్తలు వినిపించాయి. సికింద్రాబాద్ లోని పారడైజ్



ఏరియాలో జరిగిన ఓ యాదార్ధ సంఘటన ఆధారంగా తెలంగాణకు చెందిన ఓ రచయిత రాసిన బుక్ ఆధారంగా ఈ సినిమాని తెరపైకి తీసుకురాబోతున్నారు. ఓ వేశ్య కొడుకు కథగా, తల్లి పంతం కోసం ఓ కొడుకు చేసిన సమరం నేపథ్యంలో ఈ సినిమాని శ్రీకాంత్ ఓదెల సెట్స్ పైకి తీసుకెళ్లబోతున్నాడు. గత కొంత కాలంగా దీనికి సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. %-%దసరా%-%ని నిర్మించిన సుధాకర్ చెరుకూరి నిర్మించనున్న ఈ ప్రాజెక్ట్ రా అండ్ రస్టిక్ కంటెంట్‌తో రూపొందబోతోందని ఇప్పటికే గ్లింప్స్‌లోని సన్నివేశాలు, డైలాగ్‌లతో స్పష్టమైంది. గ్లింప్స్ కారణంగా ఈ సినిమాపై అంచనాలు తారా స్థాయికి చేరుకున్నాయి. ప్రీ రిలీజ్ బిజినెస్‌తో పాటు నాన్ థియేట్రికల్ బిజినెస్ పరంగానూ భారీ డిమాండ్ ఏర్పడిన నేపథ్యంలో ఇంత వరకు దీని షూటింగ్‌కు సంబంధించిన అప్ డేట్ లేదంటనే కామెంట్‌లు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా నాని సైలెంట్ మోడ్‌ని వీడి ది ప్యారడైజ్ - షూటింగ్ అప్ డేట్‌ని ఇవ్వాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. మరి నాని వారి మాటలు వింటున్నాడా? షూటింగ్ అప్ డేట్‌నిస్తాడా? అన్నది వేచి చూడాల్సిందే.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, H.NO: 38-4-216, Maharani street, Marripalem, Visakhapatnam, Andhrapradesh-530018, Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS, H.NO: 38-4-216, Maharani street, Marripalem, Visakhapatnam, Andhrapradesh-530018, And Published at Flat No: F5 C/o M.Ramesh kumar,1st Floor, Prasanthi Appt,Sriram Nagar, Station Road, Bhanugudi, Kakinda, East Godavari -533003, Andhra Pradesh, Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2017/73154, e-mail:penpower9@gmail.com